ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతకు/సహ-రుణగ్రహీతకు/ తాకట్టుదారులకు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ దిగువ పేర్కొన్న తనఖాపెట్టబడిన స్థిరాస్తులను చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి లాంఛనప్రాయంగా తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి ఐకమీదట చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పేర్కొనబడును. సదరు సెక్యూర్డ్ ఆస్తులను "ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలాగే" మరియు "ఏదైతో ఎలా ఉందో అలాగే" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించబడును.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా బహిరంగ ఇ-వేలాన్ని వెబ్‌సైట్: http://bankauctions.in ద్వారా నిర్వహించబడును.

క్ర. సం	ఖాతా నెం. మరియు రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తాకట్టుదారుల పేరు	సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం	రిజర్వు ధర / ధరావత్తు / వేలం పెంపుదల మొత్తం (రూ.లో)	ఇ-వేలం తేదీ మరియు సమయం / ఇఎండి సమర్పణకు చివరి తేది / తనిఖీ తేదీ
1	రుణ ఖాతా నెం: X0HEHYD00003010177, HE02HYD00000007806:- 1) మహ్మద్ ఇబ్రార్ అలీ, తండ్రి గులామ్ నబీ, 2) గరిబ్ ఉన్నీసా, భర్త గులామ్ నబీ, 3) అక్బర్ అలీ, తండ్రి గులామ్ నబీ, 4) గులామ్ నబి, తండ్రి గుల్ మహ్మద్, 2) సీలింగ్స్, అందరి నివాసం: ఇ.నెం.8-1-398/పిఎం/17, పారమౌంట్, టోలిచౌకి, గోల్కొండ, తెలంగాణ-500008.	08-02-2023, Rs.1,04,42,346.50/- and Rs.19,47,717/- totalling to Rs.1,23,90,063.50/- as on 05-02-2022	Rs. 2,90,00,000/- / Rs. 20,09,000/- / Rs. 1,00,000/-	06-07-2023న ఉ.గం.11-00 నుంచి మ.1-00గం.ల వరకు (5 నిమిషాల నిడివితో అపరిమిత వేలం పొడిగింపు) / 05-07-2023 (సా.5-30గం.ల వరకు) / 29-06-2023 మరియు 30-06-2023 (ఉ:10-00గం.ల నుండి మ:1.00గం.ల వరకు)

1. ఔత్సాహిక పాల్గొనదారులు/బిడ్డరుదారులు వెబ్‌సైట్: https://bankauctions.in/ & https://www.cholamandalam.com/auction.notices ను సందర్శించాలి. ఇ-వేలానికి సంబంధించిన వివరాలు, సహాయం, విధానం మరియు ఆన్‌లైన్ ట్రైనింగ్‌కు ఔత్సాహిక బిడ్డరుదారులు వీరిని సంప్రదించవచ్చు: శ్రీ.మహమ్మద్ రహీస్-81240 00030, మెసర్స్4 క్లోజర్: శ్రీ.జయ ప్రకాష్ రెడ్డి, ఫోన్ నెం.8142000064, ఇ-మెయిల్: info@bankauctions.in లో సంప్రదించాలి.
2. ఇ-వేలంలో పాల్గొనే క్రమానికి నియమ నిబంధనల కోసం దయచేసి వెబ్‌సైట్‌ను దర్శించండి: https://bankauctions.in/ & https://www.cholamandalam.com/auction-notices

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002లోని రూల్ 8(6) ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటనగా కూడా దీనిని పరిగణించడను.

ఆస్తి /ఆస్తుల వివరణ: హకీంపేట్ గ్రామం, గోల్కొండ మండలం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం వద్దగల 88.00చ.గ.లు లేదా 73.5చ.మీ.ల విస్తీర్ణపు సర్వేనెం.లు 94(పి) మరియు 107(పి) యొక్క ఫార్మింగ్ పార్ట్‌లో ప్లాట్ నెం.23కు సమానమైన ప్లాట్ నెం.(మ్యా)పై ఇంటి నెం.8-1-398/పిఎం/18 యొక్క మొత్తంభాగం మరియు సరిహద్దులు: ఉత్తరం:30' వెడల్పు రోడ్, దక్షిణం: నాలా/6-0" వెడల్పు లేన్, తూర్పు:ప్లాట్ నెం.17, పడమర: ఇ.నెం.8-1-398/పిఎం/18. ఆస్తి యొక్క షెడ్యూలు బి: హకీంపేట్ గ్రామం, గోల్కొండ మండలం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం వద్దగల 250.00చ.గ.లు లేదా 209.00చ.మీ.ల విస్తీర్ణపు ఇంటి మున్సిపల్ నెం.8-1-398/పిఎం/17 యొక్క మొత్తంభాగం మరియు సరిహద్దులు: ఉత్తరం:రోడ్, దక్షిణం: నాలా/6-0" వెడల్పు లేన్, తూర్పు:ప్లాట్ నెం.16, పడమర: ప్లాట్ నెం.18.

తేది: 30-05-2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

సంపాదకీయం

తిరోగమన పాఠాలు

ఇక మనం 'చదువని వాడజ్ఞుండగు' అనే పోతన పద్యాన్ని 'చదివిన వాడజ్ఞుండగు' అని తిరగేసి చదువుకోవాలి. మత పరమైన, మనువాద భావజాలంతో విద్య వ్యవస్థను కలుషితం చేసే కుట్రలు వేగం పుంజుకుంటున్నాయి. పురాణాలు, వేదాలు, జ్యోతిష్యం, హస్త సాముద్రికం, చిలుక జోస్యాలు వంటివి ప్రవేశపెట్టి, విద్యార్థుల మెదళ్లను వికసించకుండా

దేశ ఔన్నత్యానికి ప్రతీక అయిన భిన్నత్వంలో ఏకత్వం, లౌకికత అంటే పడని పాలకుల కనుసన్నల్లో తయారైన ఈ విద్యావిధానం రానున్న రోజుల్లో భావి భారత విద్యార్థిని మతతత్వంలో మూఢత్వంలో మునిగితేలేలా చేస్తుంది. ఇందుకు అనుగుణంగా కేంద్రమే చరిత్రను పూర్తిగా వక్రీకరించే పనికి పూనుకుంది. ఇప్పటిదాకా ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య ఇకపై కేంద్ర ప్రభుత్వ పెత్తనంలోకి వెళ్లనుండడంతో రాష్ట్రాల హక్కులకు భంగం కలుగనుంది.

మూఢత్వాన్ని నింపుతుంటే ఇక శాస్త్రీయభావాలకు చోటుందా? విద్యా ప్రగతికి బాటుంటుందా?! తాజాగా 'మహర్షి పాణిని సంస్కృతం, వేద విశ్వవిద్యాలయం' కాన్వకేషన్‌లో పాల్గొన్న ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... "ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు సంస్కృతాన్ని చాలా ఇష్టపడతారు. ఇది కంప్యూటర్ల భాషకు సరిపోతుంది. కృత్రిమ మేధస్సు నేర్చుకునే వారు దానిని నేర్చుకుంటారు. గణన కోసం సంస్కృతాన్ని ఎలా ఉపయోగించవచ్చనే దానిపై చాలా పరిశోధనలు జరుగుతున్నాయి" అని సెలవిచ్చారు. సాక్షాత్తు ఇస్రో చైర్మనే ఇలా మాట్లాడితే విద్యార్థులకు సైన్స్ మీద నమ్మకం ఎలా కలుగుతుంది? అసలు ఇలాంటి వ్యక్తికి ఒక్కక్షణమైనా ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా?

డెబ్బైఐదేండ్లుగా స్వాతంత్ర్య దేశంలో మనశక్తిని మనం పెంచుకోవటానికి, సాధికారతను సాధించుకోవటానికి, సొంతఆలోచనతో శాస్త్రసాంకేతికరంగంలో, పరిశోధనలో ప్రగతిని పొందేందుకు తగిన విద్యను మలచుకునేందుకు నిదానంగానైనా కొన్ని అడుగులు పడ్డాయి. కానీ, గత దశాబ్దకాలంగా పరిశోధనలో ఒక్క ముందడుగు లేదు. ప్రపంచానికి భారతదేశం ఆదర్శమనే ప్రచారాలకైతే తక్కువేం లేదు గానీ, దాని వెనకాల ఉన్న చేదునిజాలివి.



ఢిల్లీ విశ్వవిద్యాలయం(డియూ) పాలక మండలి గతవారం రోజులుగా తీసుకుంటున్న నిర్ణయాలు విద్యావేత్తలను, మేధావులను విస్మయానికి గురి చేస్తున్నాయి. మొన్నటి వరకు కర్నాటక పయినించిన బాటలో నేడు డియూ నడుస్తోంది. భారత రాజ్యాంగ నిర్మాత 'అంబేద్కర్ ఫిలాసఫీని', స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తిని పాదుకొల్పిన 'సారే జహాసే అచ్చా' గీత రచయిత ఇక్బాల్‌కు సంబంధించిన 'మోడ్రన్ ఇండియన్ పొలిటికల్ థాట్' అనే చాప్టర్‌ను పొలిటికల్ సైన్స్ నుంచి తొలగింపు నిర్ణయం తీసుకుంది. 'హిందూత్వపై అధ్యయన కేంద్రం', 'దేశ విభజనపై అధ్యయన కేంద్రం' ఏర్పాటుకు యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రాజనీతి శాస్త్రం కోర్సులో ఉన్న మహాత్మాగాంధీ జీవితం, ఆలోచనలపై ఉన్న పాఠ్యాంశాన్ని తొలగించి కరడుకట్టిన హిందూత్వవాది సావర్కర్ పాఠానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇది అత్యంత దారుణమైన గర్హనీయమైన నిర్ణయం. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా యూనివర్సిటీలు కాషాయరంగు పులుముకుంటున్నా యనడాని ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి?

శాస్త్రీయ విద్యావిధానం అమలుకై విద్యావ్యవస్థలో సమూలమార్పులు రావాలని అందరం ఏన్నో ఏండ్లుగా ఆశిస్తున్నాం. దీనిని అదనుగా తీసుకున్న బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అత్యంత లోపభూయిష్టమై విద్యావిధానం అమలుకు పూనుకుంది. దీనికి విద్యావేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా లెక్కచేయకుండా అమలు చేయాలని రాష్ట్రాలపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. నూతనత్వం పేరుతో మధ్యయుగాల నాటి విద్య మళ్లీ రాజ్యమేలబోతోంది. ప్రధాని మొదలుకొని వర్సిటీల ఉపకులపతుల దాకా మూఢత్వంలో కూరుకుపోతున్నారు. తాజాగా ఆ కోవలోకి ఇస్రో కూడా చేరిపోతే అది 21 శతాబ్దపు అత్యంత విషాదం.

దేశ ఔన్నత్యానికి ప్రతీక అయిన భిన్నత్వంలో ఏకత్వం, లౌకికత అంటే పడని పాలకుల కనుసన్నల్లో తయారైన ఈ విద్యావిధానం రానున్న రోజుల్లో భావి భారత విద్యార్థిని మతతత్వంలో మూఢత్వంలో మునిగితేలేలా చేస్తుంది. ఇందుకు అనుగుణంగా కేంద్రమే చరిత్రను పూర్తిగా వక్రీకరించే పనికి పూనుకుంది. ఇప్పటిదాకా ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య ఇకపై కేంద్ర ప్రభుత్వ పెత్తనంలోకి వెళ్లనుండడంతో రాష్ట్రాల హక్కులకు భంగం కలుగనుంది. హిందుత్వ నినాదాలైన 'ఒకే దేశం-ఒకే జాతి- ఒకే మతం-ఒకే దేవుడు-ఒకే భాష.' వరుసలోకి ఒకే విద్య కూడా చేరబోతోంది. అంటే కాషాయీ కరణకు మార్గం సుగమం అవుతోంది.

ప్రగతిశీల భావాలను అడ్డుకుంటూ విశ్వవిద్యాలయాలకు నిధుల్లో కోతలు పెడుతోంది. విద్య కాషాయీకరణ, మతోన్మాద ధోరణులు పెచ్చరిల్లుతున్న క్రమంలో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెడుతోంది. మరింత హీన సంస్కృతిని పెంచి, విద్యను అంగడి సరుకుగా మారుస్తోంది. ఒక ప్రగతిశీల రాజ్యం అవతరణకు శాస్త్రీయ దృక్పథం గల ప్రజలు అవసరం. అందుకే శాస్త్రీయ పురోగతిని సాధించడం మన రాజ్యాంగ లక్ష్యాలలో ఒకటిగా నిర్దేశించుకున్నాం. కానీ ఏడున్నర దశాబ్దాలుగా ఈ లక్ష్యానికి చేరువకావడానికి సాగుతున్న ప్రయత్నాలన్నింటికీ ఇప్పుడు ప్రమాదమేర్పడింది. ఆ ప్రమాదం నుండి తప్పించుకోవటానికి మనకున్న మార్గం దాన్ని ఓడించడమే.

కరెన్సీ మారకపు రేటు - నిజ వేతనాలు



ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యలోటును తగ్గించడానికి ఒకానొక దేశం తన కరెన్సీ మారకపు విలువను తగ్గించుకుంటే, దాని పర్యవసానంగా కార్మికుల నిజవేతనాలు అనివార్యంగా పడిపోతాయి. ఈ వాస్తవాన్ని చాలామంది ఆర్థిక నిపుణులు సైతం గ్రహించడం లేదు. ఇక మామూలు ప్రజానీకానికి అవగతం అయ్యే పరిస్థితి ఎక్కడుంటుంది? ఒక పెట్టుబడిదారీ వ్యవస్థ తన వాణిజ్యంలో ఎగుమతులకు, దిగుమతులకు మధ్య ఉన్న తేడాను తగ్గించుకోవాలంటే ఎగుమతులను బాగా పెంచాలి. అందుకోసం అంతర్జాతీయ మార్కెట్‌లో తను పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకోవాలి. అందుకోసం తన సరుకుల విలువను తగ్గించుకోవాలి. అంటే తన కరెన్సీ మారకపు రేటును తగ్గించుకోవాలి. దాని వలన పెట్టుబడి దారులు నష్టపోకుండా ఉండాలంటే దేశంలో కార్మికుల నిజవేతనాల స్థాయిని తగ్గించాలి. ముందు కరెన్సీ మారకపు రేటును తగ్గిస్తే అప్పుడు అది కార్మికుల నిజవేతనాలను కుదించడానికే దారి తీస్తుంది.

ఈ వాస్తవాన్ని అర్థశాస్త్రానికి సంబంధించిన చాలా పాఠ్యగ్రంథాలు ఎక్కడా చెప్పవు. సాధారణంగా ఆ పుస్తకాలను బూర్జువా అర్థశాస్త్ర కోణం నుండే రాస్తారు. అందులో చిత్రించే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నమూనా వాస్తవంలో ఎక్కడా ఉనికిలో ఉండదు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అంటే కొన్ని మార్కెట్ల సమూహంగా ఆ గ్రంథాలు పరిగణిస్తాయి. ఆ మార్కెట్లలో ధరలు పెరిగితే సరుకులకు ఉండే అదనపు డిమాండ్ తగ్గుతుంది అని చెప్తారు. విదేశీ మారకానికి సంబంధించిన మార్కెట్‌ను సైతం వారు ఆ విధంగానే చూస్తారు. ఆ మార్కెట్‌లో విదేశీ కరెన్సీకి ఎక్కువ డిమాండ్ ఉంటే దానిని తగ్గించడానికి మన దేశీయ కరెన్సీ మారకపు రేటును తగ్గించడం పరిష్కారం అని చెప్తారు. మన కరెన్సీ మారకపు రేటును తగ్గించడం అంటే విదేశీ కరెన్సీ మారకపురేటును పెంచడమే అవుతుందని, ఆ విధంగా విదేశీ కరెన్సీ మారకపు రేటు గనుక పెరిగితే ఆటోమేటిక్‌గా ఆ విదేశీ కరెన్సీకి డిమాండ్ తగ్గిపోతుందని వారు చెప్తారు. అప్పుడు వాణిజ్య లోటు కూడా తగ్గుతుందని చెపుతారు.

కొన్ని సందర్భాలలో నిజవేతనాలు పడిపోయినందువలన కార్మికుల కొనుగోలు శక్తి తగ్గిపోయి, దేశం మొత్తం మీద డిమాండ్ తగ్గిపోతుంది. అప్పుడు సరుకుల ఉత్పత్తి తగ్గుతుంది. దాని పర్యవసానంగా ఆ సరుకుల తయారీలో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతారు. ఆ విధంగా పొరుగుదేశాలను వెనక్కి నెట్టి తాను మాత్రం ముందుకు పోవాలన్న తాపత్రయం ప్రదర్శించే పెట్టుబడిదారీ దేశాలన్నీ అంతకు మునుపు ఉన్న స్థితి కన్నా ఇంకా కిందకి దిగజారిపోతాయి. పెట్టుబడిదారీ విధానం ఎంత అర్థం లేనిదో దీనిని బట్టి విదితమవుతుంది.


ఈ విశ్లేషణ యావత్తూ లోపభూయిష్టంగా ఉంది. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలకు చమురు, సహజవాయువు వంటి ముడి పదార్థాలు దిగుమతులద్వారా రావలసివుంటుంది. చమురు ఉత్పత్తి చేసే దేశాలకు తమవద్ద పండని ఇతర ముడి పదార్థాలు దిగుమతులద్వారానే లభిస్తాయి. అలా దిగుమతులద్వారా సమకూరిన ముడి పదార్థాలకు దేశీయంగా లభించే ఇతర ముడి పదార్థాలను, కార్మికుల శ్రమను కూడా జత చేస్తే అవి మొత్తం పరిశ్రమకు అవసరమైన ఇన్‌పుట్ అవుతుంది. అన్ని పెట్టుబడిదారీ దేశాలలోనూ, సరుకుల ధరలను నిర్ణయించేటప్పుడు ఈ ఇన్‌పుట్ కు అవసరమైన ఖర్చును లెక్కించి దానికి అదనంగా తమ లాభాన్ని జోడిస్తారు. ఇది గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థకు వర్తిస్తుంది. బడా పారిశ్రామిక గుత్త సంస్థలన్నీ ఈ విధంగానే తమ సరుకుల ధరలను నిర్ణయించి, ఆ రేటుకు తమ సరుకులను అమ్మితే ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి ఆమేరకు తమసరుకులను ఉత్పత్తి చేస్తారు. పెట్టుబడిదారీ విధానం మొదటినుంచీ ఇదే మాదిరి పద్ధతిలో నడిచేదని కొందరు వాదిస్తూంటారు. మరికొందరు సాంప్రదాయ పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రంలో స్వేచ్ఛాయుతమైన పోటీ నెలకొనివుండి, సరుకుల రేట్లను మార్కెట్‌లో ఉండే పోటీయే నిర్ణయిస్తుంది తప్ప వ్యక్తులు నిర్ణయించరు అని చెప్తారు. అయితే ఇక్కడ ఈ చర్చ ప్రస్తుతానికి పక్కన పెడదాం. ఇక్కడ మౌలికమైన విషయం ఏమంటే ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థలోనైనా, సరుకుల ధరలను బడా కార్పొరేట్ సంస్థలు నిర్ణయిస్తాయి. తాము ఇన్‌పుట్స్ నిమిత్తం చేసిన ఖర్చుకు అదనంగా తమ లాభాన్ని కలిపి ఆ ధరలను నిర్ణయిస్తాయి.

ఇప్పుడు ఒక కరెన్సీ విలువను 10శాతం మేరకు తగ్గించారనుకుందాం. అప్పుడు దిగుమతి చేసుకున్న విదేశీ సరుకుల విలువ ఈ దేశంలో 10శాతం మేరకు పెరుగుతుంది. ఆ సరుకులను ఇన్‌పుట్స్‌గా వాడి చేసే ఉత్పత్తుల విలువలో ఆ మేరకు (దిగుమతి చేసుకున్న సరుకులను వాడినమేరకు) 10శాతం పెరుగుదల ఉంటుంది. కార్మికుల నిజవేతనాలు యధాతథంగా కొనసాగాలంటే అప్పుడు ఆ వేతనాలు డబ్బు రూపంలో(ప్రస్తుత డబ్బు విలువ ప్రకారం) 10శాతం పెరగాల్సి ఉంటుంది. అప్పుడు ఆ సరుకుల ధరలు కూడా స్థానికంగా 10శాతం మేరకు పెరుగుతాయి. అటువంటప్పుడు కరెన్సీ విలువను 10శాతం తగ్గించినందువలన వాణిజ్య లోటులో ఏ విధంగానూ మార్పు ఉండదు.

కరెన్సీ విలువ 10శాతం మేరకు తగ్గి, దాని పర్యవసానంగా సరుకుల దేశీయ ధరలు 10శాతం పెరిగినప్పుడు విదేశీ మారకంలో ఆ సరుకుల ధరలు ఏ మార్పూ లేకుండా యథాతథంగా ఉంటాయి. అప్పుడు ఎగుమతులలో పెరుగుదల ఏమీ ఉండదు. సరుకుల ధరలు విదేశీ కరెన్సీలో తగ్గితేనే వాటి ఎగుమతులు పెరిగే అవకాశం ఉంటుంది. అదే మాదిరిగా కరెన్సీ విలువ 10శాతం తగ్గిన ఫలితంగా దేశీయ ధరలు 10శాతం పెరిగితే, అప్పుడు దిగుమతి చేసుకునే విదేశీ సరుకుల ధరలు కూడా 10శాతం పెరుగుతాయి. అదే సమయంలో ఇతర స్థానిక సరుకుల ధరలు కూడా 10శాతం పెరుగుతాయి. అందుచేత దిగుమతులు తగ్గిపోవడం అనేది జరగదు. అంటే నిజవేతనాల విలువలు యథాతథంగా కొనసాగినంతకాలం, కరెన్సీ మారకపు రేటును తగ్గించినందువలన ఎగుమతులు పెరేది ఏమీ ఉండదు, అదే విధంగా దిగుమతులు తగ్గేదీ ఏమీ ఉండదు. వాణిజ్యలోటు అంతకు మునుపు ఏ విధంగా ఉండిందో, అదే మోతాదులో ఇప్పుడూ కొనసాగుతుంది.

అందుచేత కరెన్సీ మారకపు రేటు తగ్గించినందువలన వాణిజ్యలోటు తగ్గాలి అంటే, అందుకు ఎగుమతులు పెరగాలి. అంటే తప్పనిసరిగా దేశీయ సరుకుల ధరలు (దేశీయ కరెన్సీలో) పెరగకుండా యధాతథంగా కొనసాగాలి. అవి అలా కొనసాగాలి అంటే కార్మికులకు చెల్లించే వేతనాలు (అప్పటి డబ్బు రూపంలో) పెరగకుండా యధాతథంగా కొనసాగాలి. అంటే వాటి నిజవేతనాల విలువ తగ్గాలి.

ఇదెలాగో చూద్దాం... వాణిజ్యలోటును తగ్గించడానికి కరెన్సీ మారకపు రేటును 10శాతం తగ్గించారు అనుకుందాం. దాని వలన ప్రయోజనం ఉండాలంటే దేశీయంగా ధరలు 10శాతం పెరిగితే ఏ ప్రయోజనమూ ఉండదు (ఈ విషయాన్ని ముందే వివరించాను). కనుక దేశీయంగా సరుకుల ధరలలో పెరుగుదలను అంతకన్నా తక్కువ మోతాదులో, ఉదాహరణకి 7శాతం మేరకు పరిమితం చేయవలసివుంటుంది. ఏదైనా సరుకు తయారీకి అయ్యే ఖర్చులో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది దాని తయారీలో వినియోగించబడిన కార్మికుల శ్రమకు అయ్యే ఖర్చు. రెండవది, ఆ సరుకు తయారీలో ఉపయోగించిన విదేశీ ఇన్‌పుట్స్ ఖర్చు (సరుకు తయారీలో దేశీయంగా లభించే ఇన్‌పుట్స్ కూడా ఉంటాయి. అయితే వాటి ధరలు సరుకు అంతిమంగా అమ్ముడుపోయే రేటు ఏ మేరకు పెరుగుతుందో ఆ నిష్పత్తిలోనే పెరుగుతాయి గనుక వాటిని ఇక్కడ పరిగణనలోకి తీసుకోనవసరం లేదు). సరుకు తయారీలో వాడే విదేశీ ఇన్‌పుట్స్ ధర 10శాతం పెరుగుతుంది. కాబట్టి కార్మికుల శ్రమకు 7శాతం



కన్నా తక్కువ ఖర్చు అయినప్పుడే సరుకు అంతిమ ధరను 7శాతానికి పరిమితం చేయడం సాధ్యపడుతుంది. అందుచేత కార్మికులకు డబ్బు రూపేణా చెల్లించే వేతనాలలో పెరుగుదలను 5శాతానికే పరిమితం చేయవలసివుంటుంది. ధరలు 7శాతం పెరిగి కార్మికుల వేతనాలు 5శాతం మాత్రమే పెరగడం అంటేనే వారి నిజవేతనాలు తగ్గిపోవడం.

కరెన్సీ మారకపు రేటును తగ్గించడం ద్వారా అటు విదేశీ వాణిజ్యలోటు తగ్గాలని, ఇటు కార్మికుల నిజవేతనాలు పడిపోకుండా యధాతథంగా కొనసాగాలని అనుకుంటే అందుకు ఒకటే మార్గం ఉంది. పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవడమే ఆ మార్గం. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవడం అనేది జరగని పని. కాబట్టి కరెన్సీ మారకపు రేటును తగ్గించడం అంటే కార్మికుల నిజవేతనాలను తగ్గించడమే.

ఆ విధంగా తమ నిజవేతనాలు తగ్గినా కార్మికులు ఆ చర్యను ప్రతిఘటించేంత బలంగా లేరనుకుందాం. అప్పుడు వాణిజ్యలోటు తగ్గాలి కదా! కాని గ్యారంటీగా వాణిజ్యలోటు తగ్గుతుందని చెప్పలేం. వాణిజ్యలోటు తగ్గాలంటే దేశీయంగా ఉపాధికల్పన పెరగాలి, దేశీయంగా ఉత్పత్తి పెరగాలి. ఆ విధంగా పెరిగిన ఉత్పత్తిని

కరెన్సీ మారకపు రేటును తగ్గించడం ద్వారా అటు విదేశీ వాణిజ్యలోటు తగ్గాలని, ఇటు కార్మికుల నిజవేతనాలు పడిపోకుండా యధాతథంగా కొనసాగాలని అనుకుంటే అందుకు ఒకటే మార్గం ఉంది. పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవడమే ఆ మార్గం. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవడం అనేది జరగని పని. కాబట్టి కరెన్సీ మారకపు రేటును తగ్గించడం అంటే కార్మికుల నిజవేతనాలను తగ్గించడమే.

అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మి మన వాణిజ్యలోటును తగ్గించుకోవడం జరగాలి. మనదేశంలో ఉత్పత్తి పెరిగి అది అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడుపోవడం అంటే వేరే ఏవో దేశాలలో ఉత్పత్తి అయిన సరుకు ఆ మేరకు అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడుపోకుండా ఉండడం. అంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతరదేశాల వాటా తగ్గి మనదేశ వాటా పెరిగినప్పుడే మన వాణిజ్యలోటు తగ్గుతుంది. దానికి ప్రతిస్పందనగా ఆ దేశాలు కూడా తమ తమ కరెన్సీల మారకపు రేట్లను తగ్గించుకుంటే అప్పుడు ఏమవుతుంది? మళ్లీ వాణిజ్యలోటు మొదటికే వస్తుంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడుతున్న దేశాలు తమ తమ కరెన్సీ మారకపు రేట్లను తగ్గించుకుంటే అప్పుడు ఆ యా దేశాలలోని కార్మికుల నిజ వేతనాలు కూడా పడిపోతాయి. దేశంలో ఆదాయాల పునఃపంపిణీ జరిగి కార్మికుల ఆదాయాలు పెరిగే విధానాలను ప్రభుత్వాలు చేపట్టకుండా, తద్వారా దేశీయంగా కొనుగోలుశక్తిని పెంచకుండా కేవలం కరెన్సీ మారకపు రేటును తగ్గించడానికే పరిమితం అయితే కార్మికుల శ్రమను మరింత చౌకగా పిండుకోవడం తప్ప వేరేమీ జరగదు.

ఒకానొక దేశం కరెన్సీ మారకపు రేటును తగ్గించి తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో తన ఉత్పత్తులను మరింత ఎక్కువగా అమ్ముకోడానికి, తద్వారా వాణిజ్యలోటు తగ్గించుకోడానికి ప్రయత్నించి ఆ క్రమంలో తన దేశంలో మరింత ఎక్కువమందికి ఉపాధి కల్పించడానికి ప్రయత్నించడం అంటే పొరుగుదేశాలను మరింత వెనక్కినెట్టి తాను ముందుకు పోవాలన్న ప్రయత్నమే. ఈ మాదిరి విధానాన్ని అమలు చేసినపెట్టుబడిదారీ దేశాలలో అదనంగా ఉద్యోగాలు ఎక్కడా కల్పించడం అన్నది జరగలేదు కాని అక్కడి కార్మికుల నిజవేతనాలు మాత్రం పడిపోయాయి.

అక్కడితో ఇది ఆగదు. కొన్ని సందర్భాలలో నిజవేతనాలు పడిపోయినందువలన కార్మికుల కొనుగోలు శక్తి తగ్గిపోయి, దేశం మొత్తం మీద డిమాండ్ తగ్గిపోతుంది. అప్పుడు సరుకుల ఉత్పత్తి తగ్గుతుంది. దాని పర్యవసానంగా ఆ సరుకుల తయారీలో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతారు. ఆ విధంగా పొరుగుదేశాలను వెనక్కి నెట్టి తాను మాత్రం ముందుకు పోవాలన్న తాపత్రయం ప్రదర్శించే పెట్టుబడిదారీ దేశాలన్నీ అంతకు మునుపు ఉన్న స్థితి కన్నా ఇంకా కిందకి దిగజారిపోతాయి. పెట్టుబడిదారీ విధానం ఎంత అర్థం లేనిదో దీనిని బట్టి విదితమవుతుంది.

ఈ మాదిరి అనుభవాలు 1930 దశకంలో చాలా ఉన్నప్పటికీ, వాటినుండి నేర్చుకోకుండా ఇప్పుడు మళ్లీ డాలర్ మారకపు రేటును తగ్గించి అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేయాలన్న డిమాండ్ అమెరికాలో వినవస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు దేశాల పర్యటన ముగించుకొని గురువారం భారత్‌కు తిరిగివచ్చారు. రాబోయే మరో 40రోజుల్లో అమెరికాతో సహా పలు దేశాల్లో ఆయన పర్యటించ నున్నారు. అయితే ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది నానుడి. కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ ప్రధాని హోదాలో మోడీ చేస్తున్న విదేశీ పర్యటనలు గమనిస్తే ఇంట ఓడినప్పుడు లేదా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తున్నప్పుడల్లా గోడీ మీడియా బాకాల సహకారంతో 'బయట భళా' అనిపించుకోవడం రివాజుగా మారింది. ప్రస్తుతం దేశంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిరుద్యోగం కోరలు చాచి అంతకంతకూ విస్తరిస్తోంది. ద్రవ్యోల్బణం రంకెలేస్తోంది. కొద్దిరోజులైతే అది సంక్షోభానికి దారితీసే అవకాశం కనిపిస్తోంది. బేటీ బచావో... బేటీ పడావో నినాదాలను అవహేళన చేసేలా అధికార బీజేపీ నేతలే లైంగికదాడులకు ఒడిగడుతున్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపి బ్రిజ్ భూషణ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులను నిరసిస్తూ జంతర్‌మంతర్ వద్ద ప్రఖ్యాత రెజ్లర్లు నిరవధిక ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికీ ఐదు నెలలు గడుస్తున్నా దాని గురించి పట్టించుకునే తీరిక లేదు ఏలికలకు. కర్నాటక ఎన్నికల్లో మతవిద్వేషాలు రాజేసి లబ్ధి పొందాలని చూసినా... అక్కడి ఓటర్లు కార్రు కాల్చి వాతపెట్టడంతో బీజేపీ నాయకులకు ఒక్కసారిగా దిమ్మ తిరిగింది. నూతన పార్లమెంటు ప్రారంభానికి ఆహ్వానించకుండా తొలి ఆదివాసీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోడీ సర్కార్ అవమానించడంపై విమర్శలు బహిరంగంగానే వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. వరుసగా చుట్టుముట్టిన ఈ ఇబ్బందులు, పరాభవాల నుంచి ప్రజల దృష్టి మళ్లించి 'లోకనాయకుడి'గా టామ్‌టామ్ చేసుకునేందుకు మోడీ తన విదేశీ పర్యటనలను రూపొందిం చినట్లు ఆయన పర్యటనల తీరు చూస్తుంటే తెలిసిపోతోంది.

దేశాభివృద్ధి కోసం ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు తప్పనిసరి. దేశాధినేతల పర్యటనలు ఇందుకు దోహదం చేస్తాయి. కానీ ఇరుగుపొరుగు దేశాలతో మైత్రిని పెంపొందించుకొని బహుళ ధ్రువ ప్రపంచాన్ని కోరుకునేలా దౌత్యనీతిని, విదేశాంగ విధానాలను మలచుకోవడం సార్వభౌమత్వం కలిగిన ఏ దేశమైనా చేసే పని. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా ప్రాపకం కోసం పాకులాడు తున్నారు. ఏ దేశానికి వెళ్లినా భారీ సభలు నిర్వహించడం, ప్రవాస భారతీయులతో వేడుకలు జరుపుకోవడం ఆయన పర్యటనలో తప్పనిసరి. తాజా విదేశీ పర్యటనల్లోనూ అదే కనిపించింది. జపాన్ ఆహ్వానంతో జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ హాజరుకావడం, చైనాకు వ్యతిరేకంగా ఆ దేశాలు చేసిన తీర్మానానికి ఔననలేక, కాదనలేక ఇబ్బందులు పడటం చూశాం. అక్కడితో మోడీ తన పర్యటనను సరిపెట్టివుంటే పెద్ద చర్చనీయాంశం అయ్యేది కాదు. జీ7 సమావేశాల తర్వాత పపువా న్యూగినియాకు వెళ్లి అక్కడ జరిగిన భారత్-పసిఫిక్ దీవుల దేశాధినేతల సమావేశంలోనూ పాలు పంచుకున్నారు. అమెరికా విదేశాంగ మంత్రి పపువా న్యూగినియాతో రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న మరుసటి రోజే మోడీ ఈ దేశాన్ని సందర్శించడంలో ఉద్దేశం తెలియనదేమీ కాదు.

చైనాకు పక్కలో బల్లెంలా నాటో అనుబంధ సైనిక కూటమి తయారీ లక్ష్యంగా అమెరికా రూపొందించిన వ్యూహంలో భాగమే ఇది. చతుష్టీయ కూటమి (క్వాడ్) దేశాల సమావేశం రద్దు అయినా అమెరికా నిర్దేశించిన లక్ష్యాన్ని మోడీ భుజాన వేసుకున్నట్లు కనిపిస్తోంది. ఆ తర్వాత మోడీ ఆస్ట్రేలియాలో పర్యటించారు. కోవిడ్ వైరస్ సృష్టించి ప్రపంచాన్ని చైనా నాశనం చేస్తోందంటూ మహమ్మారి విజృంభణ సమయంలో అమెరికా చేసిన దుష్ప్రచారానికి వంత పాడిన దేశాల్లో ఆస్ట్రేలియా కూడా ఒకటి. మోడీ పర్యటనకు ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అమితానందంతో స్వాగతం పలికారు. 'బాస్' అంటూ కీర్తించారు. మోడీ సన్నిహితుడు గౌతమ్ అదానీకి విద్యుత్ ప్రాజెక్టులను ఆస్ట్రేలియాలో కట్టబెట్టడం, పర్యావరణం నాశనమవుతోందని అక్కడి ప్రజలు తీవ్ర వ్యతిరేకత తెలిపినా మునుపటి మోరిసన్ సర్కార్ అదానీ సేవలో తరించడం, ఇప్పుడు ఆయన వారసుడు మోడీకి ఘన స్వాగతం పలికారా? అమెరికాకు అంటకాగుతూ 'ఆశ్రిత' మిత్రుల ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకే మోడీ విదేశీ పర్యటనలు అని ఇవన్నీ చూస్తే అర్థమైపోతుంది.

- పీఫర్స్ అండ్ పాలిటిక్స్

సత్య

సరిలేరు నీకెవ్వరూ 'మోడీ' రాజా..!

షీ ఇన్ అనే ఒక చైనా కంపెనీతో మన దేశ బడాసంస్థ రిలయన్స్ కుదుర్చుకున్న ఒప్పందానికి కేంద్రం ఆమోద ముద్రవేసినట్లు వార్త. దీని గురించి మీడియా చాలా పరిమితంగా మాత్రమే వార్తలు ఇచ్చింది. పెద్ద హడావుడి లేదు. ఎందుకంటే చైనా వ్యతిరేకతను వెల్లడించటమే అసలు సిసలు దేశ భక్తి అన్నట్లు అవకాశం దొరికినప్పుడల్లా ప్రదర్శిస్తున్న వారికి ఇది తేలుకుట్టిన దొంగ పరిస్థితే మరి. అమెజాన్ మన మార్కెట్‌ను పూర్తిగా ఆక్రమించకుండా తనకు మద్దతు ఇస్తున్న అంబానీ కంపెనీ కోసం నరేంద్రమోడీ సర్కార్ శాయశక్తులా చూస్తోంది.గతంలో అమెజాన్ అధిపతి బెజోఫ్ ఢిల్లీ వచ్చినప్పుడు కలిసేందుకు అంగీకరించ కుండా పడిగాపులు పడేట్లు చేసి నరేంద్రమోడీ నాడు అంబానీకి సంతోషం కలిగించారు. ఇంతకీ షీ ఇన్ కంపెనీ, దాని యాప్ మీద ఇప్పుడు అంబానీలకు ఎందుకు కన్ను పడిందంటే మూడేండ్ల క్రితం దాన్ని నిషేధించినా అమెజాన్ కంపెనీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తూ లాభపడుతున్నది. ఆ లబ్దిని తామే నేరుగా ఎందుకు పొందకూడదన్నది ముకేష్ అంబానీ కుటుంబ ఆలోచన. డబ్బు ఎవరికి చేదు. వారు తలచుకుంటే దేశభక్తి స్వభావం, రూపమే మారిపో తుంది. జనానికి జ్ఞాపకశక్తి తక్కువ, అసలు ఉండదు అన్నది కొందరి ప్రగాఢ విశ్వాసం. నరేంద్రమోడీ లేదా మోడీని తీర్చిదిద్దిన సంఘ పరివార్ కూడా అంబానీల ముందు మోకరిల్లాల్సిందే. వారి దేశ భక్తి అలాంటిది. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీకి తోడుగా నిలిచిన బిర్లా కుటుంబం గురించి తెలిసిందే. స్వామి కార్యంతో పాటు స్వకార్యాన్ని కూడా నెరవేర్చు కోవచ్చన్నది బిర్లా కుటుంబ ఆలోచన. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అదే జరిగింది. ఇప్పుడూ జరుగుతున్నది అదే, కాకుంటే లబ్దిదారు అంబానీ. నరేంద్రమోడీతో 2014లో అసలైన స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పేవారి గురించి తెలిసిందే.

తాజాగా అంబానీకి అందిస్తున్న లబ్ది గురించి చూద్దాం. చైనాకు చెందిన షీ ఇన్ కంపెనీ ప్రపంచంలో అతిపెద్ద ఆన్‌లైన్ ఫాషన్ దుస్తుల విక్రయాల కంపెనీ. 2022 ఏప్రిల్ నాటికి 150 దేశాల్లో దాని లావాదేవీల విలువ 100బిలియన్ డాలర్లు. ఫ్యాషన్ దుస్తులను తక్కువ ధరలతో అందుబాటులోకి తెచ్చి కుర్రకారుకు దగ్గరైన సదరు సంస్థ అనేక దేశాల నుంచి మార్కెట్లో దుస్తులను కొనుగోలు చేసి విక్రయించటంలో పేరుగాంచింది. దాని వెబ్‌సైట్, యాప్‌తోనే లావా దేవీలు జరుపుతుంది. గత ఏడాది నాటికి మూడువేల సరఫరాదారుల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. షీ ఇన్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇప్పుడు సింగపూర్‌లో ఉంది కనుక గతంలో మన ప్రభుత్వం దానిపై విధించిన నిషేధం ఇప్పుడు వర్తించదు గనుక రిలయన్స్ దానితో ఒప్పందం చేసుకోవచ్చని, మన ప్రభుత్వం తిరిగి అనుమతించనున్నదని పత్రికలు రాశాయి. ఒక పత్రికలో " షీ ఇన్ తిరిగి భారత్‌కు వస్తున్నది, గతంలో దాన్ని ఎందుకు నిషేధించారు" అంటూ రాసిన వార్తలో అదే రాశారు. ఈ కంపెనీ ఇంకేమాత్రం చైనాకు చెందినదిగా భారత్ భావించకపోవచ్చని పేర్కొన్నారు. అసలు సంగతి ఏమంటే మరింతగా విస్తరించేందుకు, పన్నుల భారాన్ని తగ్గించుకొనేందుకు గాను తన ప్రధాన కార్యాలయాన్ని 2019లోనే చైనా నుంచి సింగపూర్‌కు మార్చుకుంది. 2020లో నిషేధం విధించేటపుడు అది చైనా కంపెనీ అని చూశారు తప్ప దాని ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉందని కాదు. ఇప్పటికీ అది చైనా కంపెనీనే కదా ! రిలయన్స్ దానితో ఒప్పందం చేసుకోనుంది గనుక దాని ఒత్తిడి మేరకు సింగపూర్ పేరును ముందుకు తెచ్చారు.

గాల్వాన్ ఉదంతం తరువాత 2020 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం షీ ఇన్‌తో పాటు చైనాకు చెందిన 58యాప్‌లను నిషేధించింది. వీటి ద్వారా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, రక్షణ, భద్రతలకు ముప్పు తలెత్తినట్లు కారణంగా చెప్పారు. ఐటి చట్టంలోని సెక్షన్ 69ఏ ప్రకారం చేసినట్లు వెల్లడించారు. ఆ తరువాత నిషేధిత జాబితాను 270కి పెంచారు. ఇప్పటికీ అదే అమల్లో ఉంది. షీ ఇన్ కంపెనీ దెబ్బకు అనేక దేశాల్లోని సంస్థలకు దిమ్మతిరిగింది. దాంతో దాన్ని అడ్డుకోనేందుకు అనేక సాకులను ముందుకు తెచ్చి అడ్డుకోనేందుకు చూశారు. వివిధ దేశాల సమాచారాన్ని అపహరిస్తున్నదని, మూడో పక్షానికి దాన్ని విక్రయిస్తున్నదన్నది వాటిలో ఒకటి. సమగ్ర సమాచారం ఇవ్వలేదనే పేరుతో అమెరికాలో 19లక్షల డాలర్ల జరిమానా విధించారు. మేథోసంపత్తి హక్కులను ఉల్లంఘించిందని, వేరే బ్రాండ్లను పోలిన బ్రాండ్లను ముందుకు తెచ్చిందని, ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని, ఇతరుల డిజైన్లను కాపీ కొట్టిందని, బలవంతంగా కార్మికులతో పని చేయించి కార్మికుల హక్కులను ఉల్లంఘించిందని, చైనాలోని ఉఘీర్ ముస్లింలతో బలవంతగా పనులు చేయించిందని, ఇలా అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు చైనా మీద చేస్తున్న ఆరోపణలన్నింటినీ ఈ కంపెనీకి కూడా ఆపాదించి అడ్డుకోవాలని చూశారు.



ఇక రిలయన్స్‌తో ఒప్పందానికి వస్తే పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం రిలయన్స్ రిటెయిల్స్ సేకరణ సామర్థ్యాలు, గోదాములు, రవాణా సదుపాయాలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దుకాణాలు షీ ఇన్‌కు అందుబాటులోకి వస్తాయి. ఇతర వివరాలేమీ చెప్పం గానీ రిలయన్స్‌తో మా భాగస్వామ్యం పక్కా అని షీ ఇన్ ప్రతినిధి చెప్పినట్లు, రిలయన్స్ స్పందించలేదని, ఈ లావాదేవీ గురించి తొలుత వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించిందని ఫైనాన్షియల్ టైమ్స్ తాజాగా తన విశ్లేషణలో పేర్కొన్నది. గత ఏడాది మన దేశంలో జరిగిన ఆన్‌లైన్ ఫ్యాషన్ దుస్తుల లావాదేవీల విలువ పది బిలియ డాలర్లు ఉండవచ్చని అంచనా. చైనాతో తలెత్తిన విబేధాల కారణంగా అమెరికా, ఐరోపాలో షీఇన్ మార్కెట్ తగ్గుతున్నందున ఇతర చోట్లకు విస్తరించాలని అది చూస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మన దేశంలో మైంత్రా ప్రధాన విక్రేతగా ఉంది. షీ ఇన్‌కు అనుమతిస్తే దాని మార్కెట్‌ను సవాలు చేస్తుందని చెబుతున్నారు.

ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్న దాని ప్రకారం లైసెన్సు ఒప్పందాన్ని ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. భారత్‌లో ద్వారా వచ్చే లాభాల్లో కొంతశాతం షి ఇన్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. చైనాలో ఉన్న తన 8వేల మంది సరఫరాదారుల నుంచి సేకరించే దుస్తులతో పాటు భారత్‌లో రిలయన్స్ సేకరించే వాటిని కూడా ప్రపంచమంతటా విక్రయిస్తుంది. ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య వంటి వారు సి ప్లస్ 1 అంటే చైనా ప్లస్ ఒకటి అనే అవగాహన ప్రకారం మన దేశంలోని ఐదు పెద్ద రిలయన్స్, టాటా, బిర్లా, అదానీ, భారతీ గ్రూపు కంపెనీలు లబ్ది పొందవచ్చని చెబుతున్నారు. చైనాలో పెట్టుబడులతో పాటు మరొక దేశంలో పెట్టుబడులు పెట్టటమే దీని అర్థం. మన దేశంలోని బడా కంపెనీలు చిన్న చిన్నవాటిని మింగివేస్తున్నాయి. ప్రభుత్వం వాటికి రక్షణలు కల్పిస్తున్నది. ఉదాహరణకు అమెజాన్ నుంచి రిలయన్స్‌కు రక్షణగా నిలుస్తున్న మాదిరి అని చెప్పవచ్చు. చైనాలో 2010 తరువాత వేతనాలు, అక్కడి కార్పొరేట్ కంపెనీలపై పన్నులు గణనీయంగా పెరిగాయి. ఈ పూర్వరంగంలో 2013లోనే అంటే నరేంద్రమోడీ అధికారానికి రాకముందే సి ప్లస్ 1 అనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. అది ఇటీవలి కాలంలో పెరిగింది. ఇది మరింత విస్తరిస్తే పెట్టుబడులు భారత్‌కు రావచ్చని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ

ఇతర దేశాలలో పెట్టుబడులు పెట్టటంతో పాటు ఆ చైనాలో పెరిగిన కంపెనీలతోనే చేతులు కలిపి కూడా లాభాలు పొందవచ్చని రిలయన్స్ ముందుకు వచ్చింది. అమెజాన్‌తో పోటీని తట్టుకోవాలంటే దాన్ని ఢీకొట్టే మరో కంపెనీ అవసరం అని గుర్తించటమే దీనికి కారణం. అందుకే అంబానీ ఒత్తిడికి లొంగి నిషేధించిన చైనా కంపెనీని తిరిగి నరేంద్రమోడీ అనుమతించారన్నది స్పష్టం. ఒకటి మాత్రం నిజం, అంగీకరించక తప్పదు. ఒకసారి చెప్పిందాన్ని మరోసారి ప్రస్తావించకపోవటం, ఎప్పటికప్పుడు కొత్త అంశాలతో జనాన్ని ఎలా రెచ్చగొట్టాలో, మనోభావాలను ముందుకు తెచ్చి వారితో ఎలా ఆడుకోవాలో, ఓట్లు ఎలా దండుకోవాలో, అంబానీ, అదానీల వంటి కార్పొరేట్లను ఎలా వాడుకోవాలో నరేంద్రమోడీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు.

ఇతర దేశాలకు తరలుతున్నాయి. ఇతర దేశాలలో పెట్టుబడులు పెట్టటంతో పాటు ఆ చైనాలో పెరిగిన కంపెనీలతోనే చేతులు కలిపి కూడా లాభాలు పొందవచ్చని రిలయన్స్ ముందుకు వచ్చింది. అమెజాన్‌తో పోటీని తట్టుకోవాలంటే దాన్ని ఢీకొట్టే మరో కంపెనీ అవసరం అని గుర్తించటమే దీనికి కారణం. అందుకే అంబానీ ఒత్తిడికి లొంగి నిషేధించిన చైనా కంపెనీని తిరిగి నరేంద్రమోడీ అనుమతించారన్నది స్పష్టం. ఒకటి మాత్రం నిజం, అంగీకరించక తప్పదు. ఒకసారి చెప్పిందాన్ని మరోసారి ప్రస్తావించకపోవటం, ఎప్పటికప్పుడు కొత్త అంశాలతో జనాన్ని ఎలా రెచ్చగొట్టాలో, మనోభావాలను ముందుకు తెచ్చి వారితో ఎలా ఆడుకోవాలో, ఓట్లు ఎలా దండుకోవాలో, అంబానీ, అదానీల వంటి కార్పొరేట్లను ఎలా వాడుకోవాలో నరేంద్రమోడీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు.

ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు తీసుకొచ్చిన మల్లయోధులు. న్యాయం కోసం రోడ్డెక్కారు. భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింప చేసిన క్రీడాకారిణులు... 'ఇలాంటి రోజులు చూడడానికేనా మేము పతకాలు గెలిచింది?' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. వీరి కంటనీరు యావత్ దేశాన్ని కదిలించింది. తమపై లైంగిక దాడులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎండ, వాన, చలిని లెక్క చేయక 36 రోజుల నుండి ఆందోళన చేస్తున్నారు. వారికి దేశం నలుమూలల నుండి మద్దతు లభిస్తుంది. కానీ నూతన పార్లమెంటు భవనం సాక్షిగా పోలీసులు వారిపై దమనకాండకు పాల్పడ్డారు. న్యాయం అడుగుతున్న ఆడబిడ్డలను ఈడ్చికెళ్ళి ఘోరంగా అవమానించారు.

అదరం... బెదరం....

భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ అయిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లను "లైంగిక వేధిస్తున్నారంటూ" వినేశ్ ఫొగట్ ఈ ఏడాది జనవరి 18న ఢిల్లీలో నిరసనకు దిగారు. ఎముకలు కొరికే చలిలో జంతర్ మంతర్ వద్ద కూర్చుని ఆమె మూడు రోజులు నిరసన తెలిపారు. సాక్షి మలిక్, బజ్‌రంగ్ పూనియాతో పాటు ఇతర క్రీడాకారులు వినేశ్ ఫొగట్‌కు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు.

రెజ్లర్ల డిమాండ్స్

బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక దోపిడీకి పాల్పడ్డాడని పది మంది మహిళా రెజ్లర్లు తనతో చెప్పారని వినేశ్ ఫొగట్ చెప్పారు. 2012 నుంచి 2022 వరకూ పదేండ్లలో చాలు సార్లు మహిళా రెజ్లర్లను అతను లైంగికంగా వేధించాడు. అయితే వారి భద్రతా కారణాలను దృష్టిలో పెట్టుకొని లైంగిక దోపిడీకి గురైన యువతుల వివరాలను బయటకు చెప్పలేదు. లైంగిక వేధింపులకు గురైన బాధితుల్లో ఒక మైనర్ బాలిక కూడా ఉంది. నిరసన ప్రారంభించిన తర్వాత తమను కూడా మానసికంగా వేధించారని, చంపేస్తామని బెదిరించారని బజ్‌రంగ్, వినేశ్ అనేక సార్లు మీడియా ముందు బహిరంగంగా చెప్పారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి, అతన్ని అధికారిక పదవుల నుంచి తొలగించాలి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ కమిటీ ఏర్పాటు

రెజ్లర్లు ఢిల్లీలో ఆందోన మొదలుపెట్టిన తర్వాత ఇది అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వెళ్ళింది. దాంతో తప్పని సరి పరిస్థితుల్లో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇండియన్ రెజ్లింగ్ ఫెడరేషన్ మీద వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు జనవరి 23న ఆరుగురు సభ్యులతో బాక్సర్ మేరీకోమ్ అధ్యక్షతన విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ వేసిన కొన్ని రోజుల తర్వాత వినేష్ స్పందిస్తూ "నాకు ఒక విషయం అర్థం కావడం లేదు. కమిటీకి మేరీ కోమ్‌ను అధ్యక్షురాలిగా నియమించే ముందు, ఆమె అందుబాటులో ఉంటారో ఉండరో ఎందుకు అడగలేదు. ఆమె ఎప్పుడూ అందుబాటులో లేరు" అని చెప్పారు.

విచారణలో ఏం తేలింది?

బ్రిజ్ భూషణ్, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా కమిటీని క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఆ గడువును తర్వాత పొడిగించారు. విచారణ పూర్తి చేసిన కమిటీ ఏప్రిల్ మొదటి వారంలో తన నివేదికను అందజేసింది. అయితే విచారణ కమిటీ అందజేసిన నివేదికలోని విషయాలు నేటికీ బయటికి రాలేదు. ఆ తర్వాత రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎన్నికలు జరగనున్నట్లు ప్రకటించారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఏప్రిల్ 21న రెజ్లర్లు పోలీస్ స్టేషన్‌కి వెళ్లారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 23న మళ్లీ నిరసనకు దిగారు. రెజ్లర్లు కేవలం రాజకీయాలు చేస్తున్నారంటూ పాలకులు వారి పోరాటాన్ని కొట్టిపారేశారు.

బాధ చెప్పడం తప్పా..?

రెండోసారి పోరాటం మొదలు పెట్టడంతో సుప్రీం జోక్యం చేసుకుంది. రెజ్లర్ల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఏప్రిల్ 28న ఆదేశాలు జారీ చేశారు. అంతే కాదు ఈ కేసులో ఉన్న మైనర్ బాలికకు భద్రత కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. సుప్రీం ఆదేశాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ అరెస్టు మాత్రం చేయలేదు. "ఒకవేళ బ్రిజ్ భూషణ్ బయట ఉంటే భవిష్యత్‌లో మేమెలా రెజ్లింగ్ ఆడగలం. మేం మా బాధను తెలిపాం. అలా తెలప కూడదా? మా కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. ఆయన్ని అరెస్ట్ చేస్తారా? లేదా? ఒకవేళ ఆయనస్థానంలో ఒక సాధారణమైన వ్యక్తి ఉండుంటే, ఇప్పటికి ఆయన్ని అరెస్ట్ చేసేవారా? లేదా?" అని వినేశ్ ప్రశ్నించారు.

ఏ మాత్రం కుంగిపోకుండా...

లైంగిక దాడులకు పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసినంత మాత్రాన తమకు న్యాయం జరిగినట్టు కాదని తమకు న్యాయం జరిగే వరకూ జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తామని చెప్పారు. అలా రెజ్లర్లు తమ శాంతియుత నిరసన మొదలుపెట్టి నేటికి 37 రోజులు. ఈ మధ్య కాలంలో ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వ అండతో రెజ్లర్లతో అమానుషంగా ప్రవర్తించారు. అమ్మాయిలని కూడా చూడకుండా నానా దుర్భాషలాడారు. అయినా ఏ మాత్రం కుంగిపోకుండా తమకు న్యాయం జరిగే వరకు అక్కడి నుండి కదలమని దృఢ సంకల్పంతో ఉన్నారు. రెజ్లర్లు మళ్లీ నిరసనకు దిగడంతో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యకలాపాల నిర్వహణకు అడ్‌హక్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని క్రీడా మంత్రిత్వ శాఖ ఐఓఏకు లేఖ రాసింది. దీంతో ఏప్రిల్ 27న ఐఓఏ అడ్‌హక్ ప్యానెల్‌ను ప్రకటించింది.

సోషల్ మీడియాలో...

రెజ్లర్ల నిరసనను ఐఓఏ ప్రెసిడెంట్ పీటీ ఉష తప్పుబట్టారు. క్రీడాకారులు క్రమశిక్షణ పాటించాలంటూ మాట్లాడారు. అయితే దేశంలోని పలువురు ప్రముఖ క్రీడాకారులు లైంగిక వేధింపుల వివాదంపై స్పందించారు. రెజ్లర్లకు మద్దతుగా సోషల్ మీడియాలో తమ గళం విప్పారు. ఒలింపిక్ బంగారు పతక విజేత నీరజ్ చోప్రా, మాజీ టెన్నిస్ ప్లేయర్ సానియా మీర్జా వంటి వారు వారిలో ఉన్నారు. అలాగే రైతులు కూడా వీరి పోరాటానికి ప్రత్యేక్షంగా మద్దతు ఇస్తున్నారు.

పోలీసుల దమనకాండ

ఒక పక్క ఢిల్లీ నడి వీధుల్లో అమ్మాయిలు లైంగిక వేధింపుల నుండి తమను కాపాడమంటూ ఆందోళన చేస్తున్నారు. మరో పక్క మన దేశ ప్రధాని పార్లమెంటు కొత్త భవన ప్రారంభోత్సవ వేడుకల్లో మునిగిపోయారు. అందుకే రెజ్లర్లు తమకు మద్దతుగా వచ్చిన వేలాది మంది మహిళలతో కలిసి న్యాయం చేయమంటూ నూతన పార్లమెంటు భవనం వైపు ప్రదర్శనగా బయలుదేరారు. పోలీసులు వారిని ఈడ్చుకుంటూ స్టేషన్లకు తరలించారు. రెజ్లర్ల శిబిరాన్ని కూడా నామరూపాలు లేకుండా చేశారు. అయినా అదరక, బెదరక పోలీస్ స్టేషన్ నుండి వచ్చి తిరిగి తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు అంటున్నారు.

- సలీమ

రేపు మాకూ జరగొచ్చు

తుగ్లకబాద్‌కి చెందిన సానియా కబడ్డి క్రీడాకారిణి. ఆమె కూడా ఢిల్లీ వచ్చి రెజ్లర్లకు మద్దతు తెలిపారు. సానియా మూడేండ్లుగా కబడ్డి ఆడుతున్నారు. "మొదట్లో కబడ్డి కేవలం నా హాబీ మాత్రమే. ఇప్పుడు దీన్ని కొనసాగించాలనుకుంటున్నాను. కబడ్డిలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలని ఉంది. అయితే ఈ రోజు వారికి జరిగింది, రేపు మాకూ జరగొచ్చు. అమ్మాయిలందరూ వచ్చి, ఇక్కడ కూర్చుని వారికి మద్దతు ఇవ్వాలని నేను కోరుకుంటున్నాను. ఈ రోజు నేను ఒక్కదాన్నే వచ్చాను. రేపు నేను నా టీమ్ మొత్తాన్ని తీసుకొస్తాను" అని సానియా చెప్పారు.

నియంతృత్వ ప్రభుత్వం

"రెజ్లర్లకు సపోర్ట్ చేసేందుకు శనివారం రాత్రి 8 గంటలకు జంతర్ మంతర్ వద్ద మీరట్ నుంచి మేం ఐదారుగురం మహిళలం వచ్చాం. మా ఇతర సహచరులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు చేసింది చాలా తప్పు. మమ్మల్ని ఈడ్చుకెళ్లారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. రెజ్లర్లకు న్యాయం లభించే వరకు, వారు తిరిగి ఇంటికి వెళ్లరు" అని మీరట్ నుంచి వచ్చిన గీతా చౌదరి చెప్పారు.

అమానుష సంఘటన

మొదటి నుండి డబ్ల్యూఎఫ్ఐలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఉందంటున్నారు. కానీ అందులో నలుగురు మగవాళ్ళే ఉన్నారు. ఒక జాతీయ స్థాయి సంస్థ చట్టపరంగా నడవాలి. ఆ రూల్స్‌ను వీరు పాటించ లేదు. పని ప్రదేశాల్లో ఇద్దరు వచ్చి తమపై లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేస్తే చాలా సీరియస్‌గా తీసుకోవాలి. అలాంటిది ఇక్కడ ఏడుగురు అమ్మాయిలు కంప్లైయిట్ ఇచ్చారు. అందులో ఒక మైనర్ బాలిక కూడా ఉంది. ఎప్పుడెప్పుడు ఏం జరిగిందో వాళ్ళు వివరంగా రాసి చెప్పారు. ఈ విషయాలన్నీ అందరికీ తెలుసు. అయినా ఏ చట్టం పని చేయడం లేదు. పైగా న్యాయం చేయమని అడిగిన వాళ్ళనే అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. దేశంలో కొత్త పార్లమెంటు సాక్షిగా చట్టాలు ఎలా అమలు కాబోతున్నాయో అనడానికి ఇదొక ఉదాహరణ. రాజదండాలు స్వీకరిస్తే రాజుల మాదిరిగానే వాళ్ళకు ఏంతోస్తే అదే చేస్తారు. చట్టాలను పట్టించుకోరు. లైంగిక వేధింపులు లేకుండా జీవించాలనుకునే ప్రతి భారతీయ మహిళా ఎప్పటికీ గుర్తుపెట్టుకోవల్సిన ఘటన ఆదివారం రెజ్లర్లపై జరిగిన అమానుష సంఘటన.

- దేవి, సమాజిక కార్యకర్త









శాంతిభద్రతల సంరక్షణ మీ బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

శాంతి భద్రతలను కాపాడటం మీ బాధ్యత అని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వి.కె సక్సేనాను కోరుతూ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. "ఢిల్లీలో బాలిక దారుణంగా హత్యకు గురైంది. ఇది చాలా బాధాకరం, దురదృష్టకరం. నేరస్థులు నిర్భయంగా మారారు. పోలీసుల భయం లేదు. ఎల్జీ సార్, శాంతిభద్రతలు మీ బాధ్యత, ఏదైనా చేయండి" అని ఢిల్లీ సీఎం పేర్కొన్నారు. ఎల్జీకి రాజ్యాంగం కేంద్రపాలిత ప్రాంత ప్రజలను రక్షించే బాధ్యతను ఇచ్చిందని ఆప్ సీనియర్ నాయకురాలు అతిషి ట్వీట్ చేశారు. వాయువ్య ఢిల్లీలోని షహబాద్ డెయిరీలో 16 ఏండ్ల బాలికను ఆమె ప్రియుడు కత్తితో పొడిచి చంపాడనీ, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

నాకే రివర్స్ కౌన్సిలింగ్ ఇస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. తాను బీజేపీలో పదవులు ఆశించి చేరలేదనీ, ఏ పని అప్పగించినా అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. తనకు ఏ పదవి ఇవ్వాలో అధిష్టానానికి తెలుసన్నారు. ఈటల వ్యాఖ్యలతో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు చేరబోవటం లేదనే విషయంపై మరింత స్పష్టత ఏర్పడింది.

బడిబాట షెడ్యూల్‌లో మార్పులు చేయాలి : టీఎస్టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎండలు తీవ్రంగా మండుతున్న సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట షెడ్యూల్‌లో స్వల్పమైన మార్పులు చేయాలని టీఎస్టీయూ అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ప్రభుత్వ ఆలోచనకు ఆశయానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలందరికీ ఇండ్ల స్థలాలు పంచాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని వాగ్దానం చేసి ఆచరణలో అమలు చేయకపో వడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని పోరాటాలు చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అధ్యక్షతన సోమవారం వరంగల్ జిల్లా శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు జి.రాములతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాల్లో 60 వేల మంది ఇండ్లు లేని నిరుపేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని ఏడాది కాలంగా జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 58 ప్రకారం పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇల్లులు కట్టిస్తున్నామని చెప్పుతున్నారే తప్ప.. ఏ ఒక్కరికీ ఇచ్చిన పాపాన పోలేదని, చిత్తశుద్ధి ఉంటే ప్రతి పేద గుడిసె వాసులకి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందించి వారి ఇల్లుల నిర్మాణానికి సహకరించాలన్నారు. జి. రాములు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో ఎన్నో భూ పోరాటాలు చేసి పేదలకు ఇండ్లు ఇప్పించిన ఘన చరిత్ర పార్టీకి ఉందన్నారు. పేదలకు ఇండ్లు ఇప్పించడంతోపాటు ప్రభుత్వ స్థలాలను ప్రయివేటు వ్యక్తులు కబ్జాలు చేస్తే వారి నుంచి స్థలాలను కాపాడేందుకు కోర్టు మెట్లు ఎక్కి ప్రభుత్వానికి అందించిన చరిత్ర కూడా సీపీఐ(ఎం) ఉందని గుర్తుచేశారు. పేదల సొంతింటి కల సాకారం కోసం ఎంత దూరమైనా ఎవరితోనైనా పోరాటాలు చేయడానికి సీపీఐ(ఎం) ఎల్లవేళలా ముందుంటుందని స్పష్టంచేశారు. సంవత్సరం క్రితం జక్కలొద్దితో పాటు శివనగర్ తదితర ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు, స్థలాలకు పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. దీనిపైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని, లేకుంటే పట్టాలు అందించే వరకు పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నలగంటి రత్నమాల, సింగారపు బాబు, జిల్లా కమిటీ సభ్యులు మాలోతు సాగర్, ఆరూరి కుమార్, ఖిలా వరంగల్ ఏరియా కమిటీ సభ్యులు దుర్గయ్య, సారంగపాణి, వేణు, దయ, వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.

భూపోరాట పేదలపై ఖాకీ జులుం



(మొదటిపేజీ తరువాయి)

నాయకుడు లెల్లెల బాలకృష్ణను చుట్టుముట్టి ఈడ్చుకెళ్లి స్టేషన్‌కు తరలించారు. దీంతో కోపోద్రిక్తులైన మహిళలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరువురి మధ్య తోపులాట చోటుచేసుకుంది. 'నిలువనీడ లేని మాకు కనీసం 60గజాల స్థలం ఇవ్వరా?' అంటూ నిలదీశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెబుతున్నారే తప్ప ఎక్కడా ఒక్క ఇల్లు ఇచ్చిందని లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో విలువైన భూములను పెద్దలు కబ్జా చేసినా పట్టించుకోని సర్కారు నిలువ నీడ కోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న తమపై దాడులు చేయటం న్యాయమేనా? అంటూ ఆగ్రహించారు. అప్పటికే పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు మహిళలను చెదరగొట్టారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ, జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, పట్టణ కన్వీనర్ పోచయ్య ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ గుమ్మడి రమేష్ సహా 36 మంది పేదలను అరెస్టు చేశారు.

నిర్విరామ పోరాటం

కోరుట్ల పట్టణంలో సుమారు వెయ్యి మందికిపైగా పేదలు సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు లెల్లెల బాలకృష్ణ, జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని భూపోరాటం చేస్తున్నారు. ఏప్రిల్ 10వ తేదీన ప్రారంభమైన ఈ భూపోరాటం 49 రోజులుగా సాగుతోంది. పోరాటం ప్రారంభమైన పది రోజులకే అధికారపార్టీ కౌన్సిలర్, అతని అనుచరులు సీపీఐ(ఎం) నాయకునిపై దాడి చేశారు. చంపుతామనీ బెదిరించారు. వెన్నుచూపని దీరుల్లా ఎర్రజెండా నాయకులు తమ పోరాటం ఆగబోదని స్పష్టం చేస్తూ పేదలతో కలిసి మరింత ఉధృతం చేశారు. గుడిసెలు వేసుకున్న భూమిలో పేదలంతా కలిసి ఓ బావిని సైతం తవ్వుకున్నారు. అక్కడే నివసిస్తున్నారు.


కలెక్టర్, ఆర్డీఓతోపాటు అధికారులందరికీ వినతులు ఇస్తూ వస్తున్నారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా పిల్లాపాపలతో మహిళలు పెద్దఎత్తున గుడిసెలు వేసున్న స్థలంలోనే నివసిస్తున్నారు. ఆ స్థలానికి పూలే, అంబేద్కర్‌నగర్ పేర్లు పెట్టుకుని 49 రోజులుగా అక్కడే ఉంటూ పనులకు వెళ్తున్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని ఖండన

కోరుట్లలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చేసి మహిళలు, నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. అక్కడి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్రం విద్వేషపూరిత వైఖరిని ప్రతిబింబిస్తుంది

- రుణ పరిమితి కోత నిర్ణయం సరికాదు
- ఈ సమస్య దేశం మొత్తాన్నీ ప్రభావితం చేస్తుంది : కేరళ సీఎం విజయన్



తిరువనంతపురం : కేరళ రుణ పరిమితిని భారీగా తగ్గించాలని మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయం రాష్ట్రం పట్ల కేంద్రం విద్వేషపూరిత వైఖరిని ప్రతిబింబిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. కేంద్రం చేస్తున్న ఇలాంటి చర్యలు దేశంలోని సమాఖ్య పాలనా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. కేరళలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న విజయన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం జీఎస్టీ వంటి తమ(కేరళ) ఆదాయ వనరులను తగ్గించిందనీ, కేరళ అభివృద్ధి అవకాశాల పట్ల వారి(కేంద్రం) వైఖరి ప్రతికూలంగా ఉన్నదని ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. " గత కొన్నేండ్లుగా మనం ఎన్నో విపత్తులను ఎదుర్కొన్నాం. కష్టకాలంలోనూ కేంద్రం మా హక్కు అయిన సహాయాన్ని నిరాకరించింది. ఒక రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం ఇలాంటి విద్వేష వైఖరిని అనుసరించటం సరికాదు" అని కేరళ సీఎం అన్నారు. ఈ సమస్య తమ రాష్ట్ర ప్రభుత్వ పరిధిని దాటి దేశం మొత్తాన్నీ ప్రభావితం చేస్తుందని ఉద్ఘాటించారు. మౌనం వహించటం వల్ల కలిగే పరిణామాలపై ఆలోచించాలనీ, బాధ్యుల అసలు రంగును గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. ఇటీవల సంవత్సరాలలో ఇప్పటికే అనేక ప్రకృతి వైపరీత్యాలను చవిచూసిన కేరళ ప్రజలకు కేంద్రం విధానం మరో విపత్తుగా మారిందని విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు.

వీఓఏల డిమాండ్లు నెరవేర్చాల్సిందే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మెలో న్యాయముందనీ, వారి డిమాండ్లను రాష్ట్ర సర్కారు నెరవేర్చాల్సిందేనని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కోరారు. న్యాయం చేయకపోతే వచ్చే ఎన్నికల్లో వీఓఏల సత్తా ఏంటో చూపుతారని హెచ్చరించారు. 18 వేల మందికి వేతనాలు పెంచాలని చేస్తున్న పోరాటంపై తప్పుడు ప్రచారం చేస్తున్న పాలకవర్గాల గులాంగిరీ సంఘాలు తమ ధోరణిని మానుకోవాలని హితవు పలికారు. చేతనైతే సహాయం చేయాలనీ, లేకుంటే సైలెంట్‌గా ఉండాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అధికారులు బెదిరింపులకు దిగినా, పోలీసులు అడ్డగించినా, అరెస్టులు చేసినా ఈ మహాధర్నాకు వేలాది మంది వీఓఏలు తరలొచ్చి జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. వీఓఏలనుద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ..తమ జీతాలు పెంచాలని వీఓఏలు ఏడాదిగా పోరాడుతున్నా సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులకు, సెర్ప్ అధికారులకు, ఎమ్మెల్యేలందరికీ తమ బాధలను మొరపెట్టుకుని చివరకు గత్యంతరం లేకనే వారు సమ్మెలోకి వెళ్లారన్నారు. దీనిపై కొన్ని సంఘాలు అసత్య ప్రచారాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సెక్రటరియేట్, పార్లమెంట్‌లో వాటాలొద్దనీ, సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇస్తున్నట్టు లక్షల రూపాయల వేతనాలు అడగట్లేదని చెప్పారు. రూ.3,900 వేతనంతో ఎట్లా బతుకుతారు? కనీస వేతనం అమలు చేయాలని అడగటం నేరమా? అని ప్రశ్నించారు. మహాధర్నాకు అనుమతి ఇచ్చి వీఓఏలను ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. పూటగడవక కడుపుకాలి రోడ్డెక్కిన వాళ్లను అణచజూస్తే పాలకులకు పుట్టగతులుండవని హెచ్చరించారు.



కూరలో కరివేపాకులాగా వీఓల పరిస్థితి : ఎస్వీ.రమ, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు

రాష్ట్ర ప్రభుత్వం అన్ని అవసరాలకు వాడుకుంటూ వీఓఏల కష్టాలు, బాధలను ఏమాత్రం పట్టించుకోవడం లేదనీ, రాష్ట్రంలో వారి పరిస్థితి కూరలో కరివేపాకులాగా తయారైందని ఐకేపీ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరె కష్టపడి పనిచేస్తున్నాం...రోజు కూరగాయలకే రూ.60,70 ఖర్చవుతున్నాయి...రోజుకు రూ.130 వేతనంతో ఎట్లా బతుకుతాం...వేతనాలు పెంచాలంటే తప్పా' అని నిలదీశారు. అవే వేతనాలతో బతికి చూపాలని సెర్ప్‌లోని ఉన్నతోద్యోగులకు సవాల్ విసిరారు. వీఓఏలు తెరపైకి తెచ్చిన తొమ్మిది డిమాండ్లు న్యాయమైనవేననీ, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 43 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర సర్కారు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు.

వేతనాల విషయంలో కేరళను ఆదర్శంగా తీసుకోండి : జె.మల్లిఖార్జున్, కనీస వేతనాల సలహామండలి బోర్డు సభ్యులు

కనీస వేతనాల విషయంలో కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలో వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవాలని కనీస వేతనాల సలహా మండలి బోర్డు సభ్యులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లిఖార్జున్ సూచించారు. కేరళ ప్రభుత్వం కూలీలకు రోజువారీ కనీస కూలి రూ.600 ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కడుపుగాలి ఎర్రటెండను సైతం లెక్కచేయకుండా పట్టుదలతో వీఓఏలు చేస్తున్న పోరాటాన్ని తక్కువ అంచనా వేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. వీఓఏలు ఢిల్లీ రైతాంగ పోరాటం స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సమ్మె కూడా యుద్ధం లాంటిందే : జె.వెంకటేశ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

సమ్మె కూడా యుద్ధం లాంటిందేననీ, తమ డిమాండ్ల పరిష్కారానికి అన్ని దారులూ మూసుకుపోయిన నేపథ్యంలో కార్మికులు ప్రదర్శించే ఆయుధమే సమ్మె అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ అన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు పొదుపు డబ్బులు, రుణాలు సకాలంలో కట్టేలా చూడటంలో వీఓఏల పాత్రను మరువొద్దన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్న వీఓఏలు కడు పేదరికంలో బతకడం బాధాకరమన్నారు. వీఓఏల సమ్మె పట్ల సోషల్‌మీడియాలో కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు.

రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలి : నగేశ్, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీఓఏల న్యాయమైన డిమాండ్లయిన కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్ డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఐడీ కార్డులు,యూనిఫాం ఇవ్వటం తదితర డిమాండ్లను నెరవేర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్, వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సుమలత, అనిత, శరత్‌కుమార్, సుధాకర్, రమేష్, వెంకటయ్య, జ్యోతి, శోభారాణి, అరుణ, అంజి, రాములు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌తో చర్చలు

మహాధర్నా నేపథ్యంలో ఐకెపి వీఓఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ నేతలను సెర్ప్ ఉన్నతాధికారులు పిలిచి చర్చించారు. ఈ చర్చలు సెర్ప్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సూర్యారావు సమక్షంలో జరిగాయి. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్లను వివరిస్తూ సెర్ప్ పరిధిలో ఆర్థికేతర, ప్రభుత్వమే పరిష్కరించాల్సిన ఆర్థికపరమైన వాటిని కూలంకషంగా తెలిపారు. దీనికి సూర్యారావు స్పందిస్తూ వీఓఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సెర్ప్ సీఈఓ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తక్షణమే తీసుకెళ్తామని హామీనిచ్చారు. ఈ చర్చల్లో భాస్కర్‌తో పాటు జె. వెంకటేష్, ఎస్వీ.రమ, ఎం. నగేష్, కె. రాజ్‌కుమార్, సుమలత పాల్గొన్నారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్ 12 రాకెట్ ప్రయోగం సక్సెస్



సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో రాకెట్‌ను విజయవంతగా ప్రయోగించింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి సోమవారం ఉదయం 10 గంటల 42 నిమిషాలకు జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగించారు. ఈ ప్రయోగానికి ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. 27.30 గంటలపాటు కౌంట్ డౌన్ ప్రక్రియ కొనసాగిన అనంతరం జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరిగింది. 2232 కిలోల బరువు ఉండే ఎన్‌వీఎస్-01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని భూధ్రువ కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహంలో రుబిడియం అణుగడియారం ఉంది. ఈ టెక్నాలజీని భారత్ సొంతంగా అభివృద్ధి చేసింది. ఇటువంటి టెక్నాలజీ అతితక్కువ దేశాల వద్ద మాత్రమే ఉంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పలు ఉపగ్రహాలు అటామిక్ క్లాక్ పనిచేయడం మానేయగానే డేటా పంపడం ఆపేస్తాయి. కచ్చితమైన ట్రాకింగ్‌ను కూడా అందించలేవు. 2018లో కూడా ఇలా పనిచేయని ఉపగ్రహాన్ని మరో శాటిలైట్ పంపి భర్తీ చేశారు. ప్రస్తుతం నాలుగు ఐఆర్ఎన్ఎస్ ఉపగ్రహాలు మాత్రమే లొకేషన్ సర్వీసులను అందిస్తున్నాయి. దేశీయంగా అభివద్ధి చేసిన ప్రాంతీయ నేవిగేషన్ వ్యవస్థలను తక్కువ విద్యుత్తు, సిగ్నల్ ఫ్రీక్వెన్సీ ఉన్న చిప్స్ అమర్చే పరికరాల్లో, పర్సనల్ ట్రాకర్లలో మరింత మెరుగ్గా వినియోగించుకొనే అవకాశం లభించనుంది. ఈ ఏడాది ఇప్పటికే నెలకు ఒక రాకెట్ చొప్పున ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా నాలుగు రాకెట్లను ప్రయోగించగా అవన్నీ విభిన్న తరహా రాకెట్లు కావడం విశేషం.

త్వరలో మరో 4 నావిగేషన్ ఉపగ్రహాలు : ఇస్రో ఛైర్మన్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శ్రీహరికోట నుంచి సోమవారం జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ప్రయోగం విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-01 నావిగేషన్ ఉపగ్రహాన్ని 18 నిమిషాల 45 సెకండ్ల వ్యవధిలో నిర్దిష్ట కక్ష్యలోకి చేర్చింది. ఈ సందర్భంగా మీడియా సెంటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష కక్షలో ఉన్న ఐ.ఆర్.ఎన్.ఎస్.ఎస్ ఉపగ్రహాలు కాలంచెల్లి పోతున్న నేపథ్యంలో మరో నాలుగు నావిగేషన్ ఉపగ్రహాలను 6 నెలలు, 6 నెలల వ్యవధిలో ప్రయోగించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ డైరెక్టర్ గిరి, స్పేస్ క్రాఫ్ట్ డైరెక్టర్ కెవిఎస్ భాస్కర్, శాక్ డైరెక్టర్ నీలేష్ ఎన్ దేశాయ్, యు ఆర్ఎస్‌సి డైరెక్టర్ శంకరన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్నికష్ణన్ నాయర్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ నారాయణన్

కుల వృత్తులకు ఆర్థికసాయంపై రెండు రోజుల్లో విధివిధానాలు



(మొదటిపేజీ తరువాయి)


సీఎస్ శాంతకుమారిని, సంబంధిత ఉన్నతాధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు.

అన్ని శాఖల హెచ్‌వోడీలు ఒకే చోట...

సచివాలయం పూర్తిస్థాయిలో పని విధానంలోకి వచ్చిన నేపథ్యంలో, ఆయా ప్రభుత్వ విభాగాధిపతుల (హెచ్‌వోడీ) కార్యాలయాలను ఒకే చోటకు చేర్చడం గురించి సీఎం చర్చించారు. హెచ్‌వోడీ అధికారులకు సెక్రటేరియట్‌తో తరచుగా పని ఉంటున్న నేపథ్యంలో వారి కార్యాలయాలను కూడా సెక్రటేరియట్‌కు దగ్గరలో సమీకృతంగా ఒకే చోట నిర్మించేందుకు ఆయన నిర్ణయించారు. అన్ని రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖల్లోని హెచ్‌వోడీలు, వాటి ఆధ్వర్యంలో పని చేస్తున్న పూర్తిస్థాయి సిబ్బంది సంఖ్య, తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెక్రటేరియట్‌కు అందుబాటులో విశాలవంతమైన ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడున్నాయనే విషయాన్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. స్థల నిర్ధారణ తర్వాత అవసరం మేరకు, హెచ్‌వోడీలన్నీ ఒకే చోట ఉండేలా ట్విన్ టవర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు కేసీఆర్ తెలిపారు. సమీక్షా సమావేశం అనంతరం అమరుల స్మారకం వద్దకు సీఎం వెళ్లారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తూ కలియ తిరిగారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే పనులన్నీ పూర్తయి... చివరిదశ సుందరీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లకు సీఎం పలు సూచనలు చేశారు. అమరుల స్మారకానికి ముందున్న విశాలమైన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహానికి రెండు వైపులా అత్యద్భుతమైన ఫౌంటేన్లతో సుందరంగా తీర్చిదిద్దాలని ఆర్ అండ్ బి ఇంజనీర్ శశిధర్‌ను ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాలు జరిగినన్ని రోజులూ అమరుల స్మారకం వద్దకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్కడి నుంచి బీఆర్‌కే భవన్ వద్ద నిర్మించిన వంతెనల నిర్మాణాన్ని సీఎం పరిశీలించారు. నూతన సచివాలయ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసేందుకు ఈ వంతెనలను నిర్మించారు. సీఎం వెంట మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, పల్లా రాజేశ్వరరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డితోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులున్నారు.

డికె శివకుమార్‌తో షర్మిల భేటీ

- రాజకీయాలపై చర్చ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారి మధ్య రాజకీయ చర్చ జరిగినట్టు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాధ్యతలు తీసుకుని వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని డికె శివకుమార్ షర్మిలను కోరినట్టు తెలిసింది. ఏపీలో వైఎస్ఆర్, టీడీపీలను ఎదుర్కొనేందుకు షర్మిల బలమైన నేతగా కాంగ్రెస్ భావిస్తున్నది. ఇప్పటికే ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ కూడా షర్మిలతో మాట్లాడినట్టు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ పొత్తు పెట్టుకునేందుకు డికే రాయబారం చేస్తున్నట్టు మరో వాదన కూడా వినిపిస్తున్నది. 15 రోజుల్లోనే డికేతో షర్మిల రెండుసార్లు భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతున్నది. .

ఢిల్లీ పోలీసుల కస్టడీలో జంతర్ మంతర్

అగ్రశ్రేణి రెజ్లర్లతో సహా 12 మందిపై కేసు నమోదు

- కాల్చి చంపుతామని రిటైర్డ్ ఐపీఎస్ బెదిరింపులు
- మా ఫిర్యాదుపై కేసు నమోదుకు ఏడు రోజులు, మాపై మాత్రం ఏడు గంటల్లోనే : వినేశ్ ఫోగట్
- 1న దేశవ్యాప్త ఆందోళనలు : పది కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు

న్యూఢిల్లీ : పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం రోజునే.. అగ్రశ్రేణి రెజ్లర్ల ఆందోళనను పోలీసులు అడ్డుకున్న తీరు యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. లైగింక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని ఆందోళన చేస్తున్న రెజ్లర్లు.. ఆదివారం కొత్త పార్లమెంట్ వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు సిద్ధమవ్వగా.. వారిని పోలీసులు క్రూరంగా అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. వారి ఆందోళన కొనసాగితే దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని పోలీసులు తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అగ్రశ్రేణి రెజ్లర్లతో సహా 12 మందిపై కేసు నమోదు

అల్లర్లకు పాల్పడటం, ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకోవడం వంటి ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్రశ్రేణి రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా సహా 12 మందిపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. దీన్ని రెజ్లర్లు తీవ్రంగా ఖండించారు. "బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మేం ఫిర్యాదు చేస్తే ఆయనపై కేసు నమోదు చేసేందుకు ఢిల్లీ పోలీసులకు ఏడు రోజులు పట్టింది. కానీ శాంతియుతంగా నిరసన చేస్తున్న మాపై ఏడు గంటల్లోనే కేసు పెట్టారు" అని వినేశ్ ఫోగట్ ఆవేదన వ్యక్తం చేశారు.

మార్ఫింగ్ ఫొటోలు వైరల్..

ఇదిలా ఉండగా.. రెజ్లర్లను బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిని బస్సుల్లో ఎక్కించి వేర్వేరు చోట్లకు తరలించారు. అయితే ఆ ఫొటోలను కొందరు మార్ఫింగ్ చేయడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ మార్ఫింగ్ ఫొటోల్లో వినేశ్ ఫోగట్, సంగీత ఫోగట్ పోలీసు వ్యాన్లో కూర్చుని నవ్వుతూ సెల్ఫీ తీసుకున్నట్లుగా ఉంది. దీనిపై సాక్షి మాలిక్ స్పందిస్తూ.. 'అవి నిజమైన ఫొటోలు కాదు. కొందరు కావాలనే మార్ఫింగ్ చేశారు. అలాంటి వారికి సిగ్గు లేదు. మాకు చెడ్డపేరు తీసుకొచ్చేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఆ మార్ఫింగ్ ఫొటోతో నిజమైన ఫోటోను జత చేసి రెజ్లర్లకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

జంతర్ మంతర్ వద్ద అనుమతి లేదు: ఢిల్లీ పోలీసులు

రెజ్లర్ల ఆందోళనపై ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ తాజాగా స్పందించారు. 'గత 38 రోజులుగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేసిన రెజ్లర్లకు మేం అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం. కానీ, వారు చట్టాన్ని అతిక్రమించారు. మేం చెప్పినా వారు వినిపించుకోలేదు. అందుకే అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది. రెజ్లర్లు తమ దీక్షను కొనసాగించాలనుకుంటే అందుకు అనుమతి కోరుతూ అప్లికేషన్ ఇవ్వొచ్చు. అయితే జంతర్ మంతర్ వద్ద మాత్రం దీక్షకు అనుమతినివ్వలేం. అది కాకుండా మరో చోట వారికి అనుమతి కల్పిస్తాం' అని అన్నారు.

పోలీస్ కస్టడీలో జంతర్ మంతర్

ఆదివారం ఘటన తరువాత జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల సభాస్థలిని పోలీసులు ధ్వంసం చేశారు. రెజ్లర్ల సామాగ్రిని అక్కడ నుంచి ఖాళీ చేయించారు. ప్రస్తుతం అక్కడ 144 సెక్షన్ విధించారు. ఆందోళనకారులు, ఇతరులను జంతర్ మంతర్ లోపలికి అనుమతించట్లేదు. జంతర్ మంతర్ మొత్తం పోలీస్ కస్టడీలో ఉంది. వందలాది పోలీసుల పహారాలో ఆ ప్రాంతం ఉంది.

కాల్చి చంపుతామని రిటైర్డ్ ఐపీఎస్ బెదిరింపులు

ఈ వ్యవహారంపై రిటైర్డ్ ఐపీఎస్ ఒకరు ట్విట్టర్‌లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు ఒలింపిక్ పతకం విజేత బజరంగ్ పూనియా ధీటుగా బదులిచ్చారు. రిటైర్డ్ ఐపీఎస్, కేరళ పోలీస్ మాజీ చీఫ్ ఎన్ సి ఆస్తానా ఈ ట్వీట్ చేశారు. 'పరిస్థితులు బట్టి మీపై కాల్పులు జరుపుతారు. తప్ప మీరు చెబితే కాదు. ఒక బస్తా చెత్తను పడేసినట్లే.. మిమ్మల్ని లాగి పడవేస్తాం. సెక్షన్ 129 ప్రకారం పోలీసులకు కాల్పులు జరిపే అధికారం ఉంది.

సమయం వస్తే ఆ కోరిక నెరవేరుతుంది. పోస్ట్‌మార్టం టేబుల్‌పై మళ్లీ కలుద్దాం' అంటూ రెజర్లను ఉద్దేశించి ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ట్వీట్ పై భజరంగ్ పునియా స్పందిస్తూ.. 'ఈ ఐపీఎస్ అధికారి మమ్మల్ని కాల్చడం గురించి మాట్లాడుతున్నారు. సోదరా, మేము మీ ముందున్నాం. ఎక్కడికి రావాలో చెప్పండి. మీ బుల్లెట్లకు మా ఛాతీని చూపుతామని మీకు ప్రమాణం చేస్తున్నా. ఇప్పటి వరకు రెజర్లు బుల్లెట్లు మినహా మిగతావన్నింటినీ ఎదుర్కొన్నారు. ఇక మిగిలింది అదొక్కటే, అది కూడా తీసుకురండి' అంటూ హిందీలో ట్వీట్ చేశారు.

జూన్ 1న దేశవ్యాప్త ఆందోళనలు

పది కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు

లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ పై కాకుండా, దానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మల్లయోధులపై అణచివేతను నిరసించాలని పది కేం ద్ర కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చాయి. రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన అణచివేతను ఖండించాలనీ, దానికి వ్యతిరేకంగా జూన్1న నిరసన కార్యక్రమా లు చేపట్టాలని కేంద్ర కార్మిక సంఘాలు తమ అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చా యి. ఈ మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, ఎల్పీఎఫ్, యూటీయూసీ సంఘాలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి.

మహిళా లోకానికి ఇదేం సందేశం?

(మొదటిపేజీ తరువాయి)

ఛాంపియన్‌షిప్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు...ఇలా అనేక క్రీడా వేదికలపై దేశ పేరు ప్రఖ్యాతులను దశదిశలా ఇనుమడింపజేసిన మహిళా క్రీడాకారుల పట్ల పోలీసులు కనీసం గౌరవం చూపలేదు సరికదా తీవ్రమైన కాఠిన్యం ప్రదర్శించారు. మహిళలు భరతమాత ముద్దుబిడ్డలంటూ పొగడ్తలతో ముంచెత్తే పాలకులు రెజ్లర్లపై చూపించే గౌరవం ఇదేనా అని క్రీడాకారులు నిలదీస్తున్నారు. 'ఇదంతా చూసి నేను చాలా విచారించాను. భారత క్రీడా రంగానికే ఇది చీకటి రోజు' అని టోక్యో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా వ్యాఖ్యానించారు. పోలీసులు ఇలా ప్రవర్తించి ఉండాల్సింది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. నిజమే.. పరిస్థితిని చక్కదిద్దడానికి రెజ్లర్లు ప్రభుత్వా నికి కావాల్సినంత సమయం ఇచ్చారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవాలంటూ రెజ్లర్లు జనవరిలోనే గళం విప్పారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు ఒలింపిక్ పతక విజేతలు ఎంసీ మేరీకోమ్, యోగేశ్వర్ దత్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అదే నెల 23న ప్రకటన చేసింది.

మేరీకోమ్ బీజేపీ మాజీ ఎంపీ కాగా దత్ ఆ పార్టీ సభ్యుడు. విచారణ కోసం భారత ఒలింపిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కమిటీలో కూడా వీరిద్దరూ సభ్యులే. ఇలాంటి ఆరోపణలు వచ్చిన సందర్భాలలో జరిపే విచారణల్లో క్రీడా శాఖ, ఒలింపిక్ అసోసియేషన్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి. గత సంవత్సరం సైక్లింగ్ కోచ్, సెయిలింగ్ కోచ్‌లపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినప్పుడు క్రీడా శాఖ వెంటనే స్పందించింది. ఫిర్యాదు అందగానే వీరిద్దరి కాంట్రాక్టులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. అంతేకాక మహిళా అథ్లెట్లకు బాసటగా నిలిచే విషయంలో జాతీయ క్రీడా సమాఖ్యలకు మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ ఇద్దరు కోచ్‌లకూ రాజకీయాలతో సంబంధం లేదు. అందుకే అధికారులు వేగంగా స్పందించారు. కానీ ఇప్పుడు ఆరోపణలు వచ్చింది సాక్షాత్తూ అధికార పార్టీ ఎంపీ పైన. ఆయనపై విచారణ కోసం ఏర్పాటు చేసిన రెండు కమిటీలు నివేదికలు అందించినా వాటిని నేటి వరకూ బయటపెట్టలేదు. కనీసం ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు సైతం ఇవ్వలేదు. ఇది చాలదన్నట్లు భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ క్రీడాకారిణి పీటీ ఉష రెజ్లర్లపైనే మండిపడ్డారు. వారిలో క్రమశిక్షణ లోపించిందని ఆరోపించారు.

బీజేపీతో 2015 నుండి సంబంధాలున్న అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే కూడా రంగంలోకి దిగారు. రెజ్లర్లు దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తు న్నారంటూ ఆయన దుయ్యబట్టారు. మహిళా రెజ్లర్లకు పతకాలు వచ్చినప్పుడు వారిని పొగడ్తలతో ముంచెత్తిన ప్రధాని మోడీ ఇప్పుడు మౌనముద్రలోకి జారుకున్నారు. ఇలాంటి నాయకులు మహిళా లోకానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారో గమనించా ల్సిన అవసరం ఉంది.

ఏం సాధించారు?

(మొదటిపేజీ తరువాయి)

7.59 మధ్య కొనసాగింది.

ఆరోగ్య రంగంపై శీతకన్ను

మోడీ ప్రభుత్వం ఆరోగ్య రంగంపై శీతకన్ను వేసింది. కోవిడ్ మహమ్మారి దేశాన్ని కుదిపేసినా ఈ రంగంపై చేసిన ఖర్చులో పెరుగుదల కన్పించడం లేదు. 2014-15 నుండి 2022-23 వరకూ ఈ రంగంపై పెట్టిన ఖర్చు జీడీపీలో కేవలం 1.2%-2.2% మధ్యే ఉంది. ప్రజారోగ్యంపై పెడుతున్న ఖర్చులో కేంద్ర ప్రభుత్వ వాటా కేవలం 12 శాతమే. కానీ దేశ ప్రజలు మాత్రం తమ ఆదాయంలో 52% వరకూ ఆరోగ్యంపై ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

పెద్ద నోట్ల రద్దుతో ఒరిగింది శూన్యం

పెద్ద నోట్ల రద్దు ఓ పెద్ద సాహసోపేత నిర్ణయమని ప్రభుత్వం డాంబికాలు పలికినా ఒరిగింది ఏమీలేకపోగా ఆర్థికవ్యవస్థకు నష్టమే మిగిల్చింది. నల్లధనాన్ని వెలికితీయడం మాట అటుంచితే పన్ను-జీడీపీ దామాషా ఏ మాత్రం పెరగలేదు. నగదు వినియోగం కూడా తగ్గలేదు. ఉదాహరణకు గత తొమ్మిది సంవత్సరాలలో పన్ను-జీడీపీ నిష్పత్తి 4.78-6.02% మధ్యన ఉన్నది. దీనికి భిన్నంగా కరెన్సీ-జీడీపీ నిష్పత్తి 2014-15లో 11.6% ఉంటే 2020-21లో 14.4 శాతానికి పెరిగింది. అయితే ఆ తర్వాతి సంవత్సరం అది కొంత తగ్గింది. డిజిటల్ లావాదేవీలను ఎంతగా ప్రోత్సహించినప్పటికీ ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

ఎగుమతులూ అంతంతే

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి చర్యలు ఎన్ని తీసుకుంటున్నప్పటికీ దేశం నుండి సరుకుల ఎగుమతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రపంచ సరుకుల ఎగుమతులలో మన వాటా 2014లో 1.69% ఉంటే 2021 నాటికి 1.77% మాత్రమే పెరిగింది.

నత్తనడకన భారీ ప్రాజెక్టులు

దేశంలో మౌలిక సదుపాయాల రంగంలో భారీ ప్రాజెక్టులు ఇప్పటికీ నత్తనడకనే సాగుతున్నాయి. బులెట్ ట్రైన్ ప్రాజెక్ట్ అయితే ఇంకా పట్టాలు ఎక్కనే లేదు.

ఎఫ్‌డీఐలు పెరిగినా...

మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో (ఎఫ్‌డీఐలు) పెరుగుదల కన్పించింది. 2014-15లో 45 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎఫ్‌డీఐలు 2021-22 నాటికి 84.83 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే 2022-23లో మన దేశానికి 70 బిలియన్ డాలర్ల ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం ముద్ర యోజన, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన వంటి పలు పథకాలు ప్రవేశపెట్టినా అవి పేదల బతుకులను ఏ మాత్రం మార్చలేకపోయాయనే చెప్పాలి.

జూన్ 2న గన్‌పార్కు నుంచి గాంధీభవన్‌కు ర్యాలీ : మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని జూన్ 2న గన్‌పార్కు నుంచి గాంధీభవన్‌కు ర్యాలీ నిర్వహిస్తామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అందుకోసం పార్టీ పక్షాన కమిటీని నియమిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎవరివల్ల వచ్చిందో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత అందరూ ఎలా మోసపోయారనే విషయాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర సాధన కోసం కష్టపడిన ఎంపీలు, ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు సన్మానం చేస్తామన్నారు. కేసీఆర్ కుటుంబానికి తప్ప రాష్ట్రంలోని ఉద్యమకారులకు ఉద్యోగాలు దక్కలేదన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు ఇంకా సహాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. బంగారు తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయన్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి కేసీఆర్ ప్రజలందరినీ మోసం చేశారని చెప్పా రు. కేసీఆర్‌కు ఓటేస్తే తెలంగాణ భూములు ఆక్రమించుకున్నారని విమర్శించారు. సోనియా స్థానంలో ఇంకెవరూ ఉన్న తెలంగాణ వచ్చేది కాదన్నారు.

కర్నాటక సీఎంను కలిసిన వీహెచ్

కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి మాజీ ఎంపీ వి హనుమంతరావు సోమవారం కలిశారు. జూన్‌లో తెలంగాణలో జరగనున్న బీసీ గర్జన సభకు ముఖ్యఅతిథిగా రావాలని ఆయన్ను కోరారు. ఇదే విషయమై తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేత కూడా ఆహ్వానం అందిస్తారని తెలిపారు.వీహెచ్ వెంట తమిళనాడు పీసీసీ అధ్యక్షులు కె.ఎస్.అళగిరి తదితరులు ఉన్నారు. కర్నాటక సీఎంగా ఎంపికైనందుకు ఆయనకు వీహెచ్ అభినందనలు తెలిపారు.

కబ్జాదారులకు అండగా పోలీసులు

'కోరుట్ల' లాఠీచార్జిని ఖండిస్తున్నాం : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నక్రమంలో వారిపై అర్ధరాత్రి పోలీసులు జులూం ప్రదర్శించడం, దొంగలను అరెస్టు చేసినట్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య విమర్శించారు. ప్రజాప్రతినిధులు, కబ్జాదారులకు అండగా ఉంటున్న పోలీసులు పేదలపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాఠీచార్జిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, జగిత్యాల నాయకులు తిరుపతినాయక్, ఐదుగురు మహిళలతో సహా పది మంది తీవ్రంగా గాయపడ్డారని, ఓ మహిళ పన్ను విరిగిందని తెలిపారు. 50మందిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్లలో నిర్బందించారని అన్నారు. ఇది హేయమైన చర్యగా పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న 40మంది గుడిసెవాసులను అక్రమంగా అరెస్టు చేశారనీ, వారిని విడుదల చేయాలని కోరారు. ఆర్‌డీఓ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నాకు ప్రయత్నించిన వారిని పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారని తెలిపారు. గుడిసెవాసుల మీద నిర్బందం ఆపాలని, వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మంత్రి జోక్యం చేసుకోవాలి

ప్రజాసంఘాల పోరాట వేదిక వినతి

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జెమ్మిగద్దె సర్వే నెం.923లో 52 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించడానికి రియల్టర్లు ప్రయతిస్తుంటే, సీపీఐ(ఎం), ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో దాన్ని అడ్డుకున్నవారిపై లాఠీఛార్జి చేయడం శోచనీయమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రజకవృతిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య అన్నారు. ఈ మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వారు సోమవారం వినతి పత్రం సమర్పించారు. లేఖ రాశారు. ఈ విషయంపై జోక్యం చేసుకుని అరెస్టు చేసినవారిని విడుదల చేయించాలని, గుడిసెవాసులందరికి పటాలను ఇప్పించాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ సమస్యను త్వరిగతిన పరిష్కరిస్తామని హామినిచ్చారు. స్థానిక పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు.

పోలీసు నిర్బంధకాండ ఆపాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే వారిని పోలీసులు అర్ధరాత్రి దొంగలను అరెస్టు చేసినట్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్ రాములు అన్నారు. అరెస్టు చేసిన గుడిసెవాసులను, నాయకత్వం వహిస్తున్న సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకష్ణ, జగిత్యాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులను, నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులను, ఎమ్మెల్యే అనుచరులను ఏమీ చేయలేని పోలీసులు పేదలపై తమ ప్రతాపం చూపటం దారుణమన్నారు. రెవెన్యూ భూమికి, సివిల్ పోలీసులకు ఉన్న సంబంధమేంటో తెలిపాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పేదలందరూ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉండడం నేరం ఎలా అవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి, పేదలపై దౌర్జన్యం, బెదిరింపులకు దిగుతున్న పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గిరిజన ఆశ్రమ సీఆర్టీలకు 12 నెలల వేతనం

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్టీ)కు 12 నెలల వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం వారికి 10.5 నెలలకు మాత్రమే వేతనం ఇస్తున్నామని తెలిపారు. ఇతర గురుకులాల తరహాలో 2022-23 విద్యాసంవత్సరం నుంచే 12 నెలల వేతనం ఉత్తర్వులను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ హర్షం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు 12 నెలల వేతనం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి హర్షం ప్రకటించారు.

సీఎంకు కృతజ్ఞతలు : పీఆర్టీయూటీఎస్

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు 12 నెలల వేతనం మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు టి హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌కు పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

'అమరవీరులను కించ పరిచేలా హరీశ్‌రావు వ్యాఖ్యలు '

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవవేడుకలు చేయడం హాస్యాస్పదమంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించడం ద్వారా అమర వీరులను కించపరిచారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

జూన్ 3 నుంచి జయశంకర్ బడిబాట

- 17 వరకు నిర్వహణ : పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల జూన్ మూడు నుంచి 17వ తేదీ వరకు జయశంకర్ బడిబాట కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన సోమవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. రాష్ట్రంలో పాఠశాలలు వచ్చేనెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అన్ని ఆవాస ప్రాంతాల్లో గల బడిఈడు పిల్లలందర్నీ గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, నాణ్యమైన విద్యను అందించడమే బడిబాట లక్ష్యమని పేర్కొన్నారు. సమాజ భాగస్వామ్యంతో సర్కారు బడులను బలోపేతం చేయాలని కోరారు. సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేండ్ల వయస్సు పూర్తి చేసుకున్న పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న పిల్లల్ని ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వీఈఆర్)ను అప్‌డేట్ చేయాలని కోరారు. తక్కువ ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలను గుర్తించి విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగ్గ తరగతిలో చేర్పించాలని కోరారు. మండలం, జిల్లాల్లోని పాఠశాలల వారీగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ముందస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. వచ్చేనెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు విద్యార్థుల నమోదు ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఇంటింటికీ తిరిగి క్యాంపెయిన్ చేపట్టాలని సూచించారు. వచ్చేనెల 12 నుంచి 17వ తేదీ వరకు రోజువారీ కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈనెల 31న జిల్లాస్థాయి సమావేశాన్ని కలెక్టర్ల నేతృత్వంలో నిర్వహించాలని తెలిపారు. జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మెన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్లు, ఇతర ప్రజాప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానించాలని ఆదేశించారు. వచ్చేనెల ఒకటో తేదీన మండల, పాఠశాల స్థాయి సమావేశాలను నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. కలెక్టర్ల నేతృత్వంలో డీఈవోలు కోఆర్డినేటర్లుగా వ్యవహరించాలని, ఉపాధ్యాయ సంఘాలను, సామాజిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

జయశంకర్ బడిబాట వివరాలు

తేది	కార్యక్రమం
12.6.2023	మన ఊరు-మనబడి/ మనబస్తీ-మనబడి
13.6.2023	తొలిమెట్టు
14.6.2023	సామూహిక అక్షరాభ్యాసం
15.5.2023	ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు
16.5.2023	ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రాధాన్యత
17.5.2023	బాలికా విద్య, కెరీర్ గైడెన్స్

ఆ కాంట్రాక్టు అధ్యాపకులనూ
క్రమబద్ధీకరించాలి

- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో రెగ్యులరైజ్ కాని కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జనరల్, ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు కొంతమందిని రెగ్యులరైజ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ఇంకా కొద్దిమంది క్రమబద్ధీకరణ కాలేదని పేర్కొన్నారు. వారికి కూడా తగిన సడలింపులివ్వాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 184 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లను మాత్రమే క్రమబద్ధీకరించారని వివరించారు. ఇంకా 417 మందిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో సుమారు 823 మంది కాంట్రాక్టు అధ్యాపకులు 20 ఏండ్లుగా పనిచేస్తుంటే, కేవలం 270 మంది మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. వివిధ కారణాలతో 553 మంది కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ కాలేదని తెలిపారు.

డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు

రాష్ట్రంలో 494 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీ అదనపు విద్యార్హతలు లేవనే కారణంతో క్రమబద్ధీకరణ జాబితాలో చేర్చలేదని తమ్మినేని తెలిపారు. వారందరూ 2014, జూన్ రెండో తేదీకి ముందే విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. గతంలో కూడా జూనియర్ లెక్చరర్ల నుంచి డిగ్రీ లెక్చరర్లుగా పదోన్నతి ఇచ్చే సమయంలో అదనపు విద్యార్హతలకు కొంత కాలపరిమితి ఇచ్చారని వివరించారు. మిర్యాలగూడలోని కేఎన్ఎం అన్‌ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను 2018, ఏప్రిల్ ఆరో తేదీన జీవోనెంబర్ 10 ప్రకారం స్వాధీనం చేసినపుడు 18 మంది బోధన సిబ్బంది, అదనపు విద్యార్హతతో నెట్, సెట్ మినహాయింపుతో తీసుకుని రాష్ట్ర పేస్కేళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. 2022, జులై 23న జీవోనెంబర్ 27 ద్వారా చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబ్‌నగర్ అన్ ఎయిడెడ్ కాలేజీని స్వాధీనం చేసినపుడు ఎనిమిది మంది బోధనా సిబ్బందికి నెట్, సెట్ అదనపు విద్యార్హతలో మినహాయింపులిచ్చి రాష్ట్ర పేస్కేల్లు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మిగిలిపోయిన వారికి కూడా ఐదేండ్ల కాలపరిమితినిచ్చి క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. 2014, జూన్ రెండో తేదీ కంటే ముందే 33 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం నెట్, సెట్, పీహెచ్‌డీ సంపాదించారని పేర్కొన్నారు. కానీ క్రమబద్ధీకరణ జాబితాలో వారి పేర్లు ఉన్నత విద్యాశాఖకు అందలేదని పేర్కొన్నారు. వారిని కూడా జాబితాలో చేర్చాల్సిన అవసరముందని సూచించారు. 2014, జూన్ రెండో తేదీ తర్వాత 26 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్నారని, నెట్, సెట్, పీహెచ్‌డీ విద్యార్హతలున్నాయని, వారికి సడలింపులివ్వాలని కోరారు.

జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు :

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులరైజ్ కాకుండా మిగిలిపోయిన సుమారు 417 మంది ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులను మంజూరు చేసి, అర్హతల్లో సడలింపులిచ్చి క్రమబద్ధీకరించాలని తమ్మినేని తెలిపారు. జనరల్ కోర్సుల్లో పనిచేస్తున్న 23 మందికి అవార్డ్ ఆఫ్ పాస్ డివిజన్ సమస్య ఉన్నదని పేర్కొన్నారు. అలాగే మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) బోధిస్తున్న 15 మంది కాంట్రాక్టు అధ్యాపకుల విషయంలో 60 శాతం మార్కులు దాటి ఉన్నప్పటికీ 'అవార్డ్ ఆఫ్ పాస్' డివిజన్ లేదనే కారణంతో రెగ్యులరైజ్ చేయలేదని తెలిపారు. వారి విషయంలో మార్కులను పరిగణనలోకి తీసుకుని క్రమబద్ధీకరించాలని కోరారు.

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత, రూ.10 లక్షల బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని తెలిపారు. గుర్తింపు కార్డులివ్వాలని, అర్హులైన వీవోఏలను సీసీలుగా పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఇతర న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మైనారిటీలపై మతోన్మాదుల దమనకాండ

- 31న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం :ఆవాజ్, తెలంగాణ గిరిజన, ఆదివాసీ గిరిజన సంఘాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై జరుగుతున్న దమనకాండను ఆపాలని ఆవాజ్, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలు సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, గృహ దహనాలు ఆపాలనీ, మణిపూర్‌లో శాంతియుత పరిస్థితి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశాయి. ప్రజాస్వామ్యానికి ప్రతీకైన పార్లమెంటు భవనాన్ని ఘనంగా ప్రారంభించుకున్న వేళ, మణిపూర్ ఆదివాసీ గిరిజనుల ఆర్తనాదాలతో దద్దరిల్లిందని తెలిపాయి. కాల్పుల్లో అనేకమంది చనిపోయారనీ, అసమ్మతిని దాడులతో అణిచివేయడం తగదని ఆయా సంఘాల నేతలు హితవు పలికారు. బుధవారం ఈ అంశంపై ఆవాజ్, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అబ్బాస్, ఆర్ శ్రీరాం నాయక్, పూసం సచిన్ తెలిపారు.

దశాబ్ది వేడుకలకు రైతు వేదికలను ముస్తాబు చేయండి : మంత్రి నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 3న రైతువేదికలను ముస్తాబు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. దశాబ్ది ఉత్సవాలు వ్యవసాయ శాఖతో ప్రారంభం కావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో దశాబ్ది ఉత్సవాలు, వ్యవసాయ శాఖ చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి, రైతాంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాలు చారిత్రక జ్ఞాపకంగా మిగిలిపోవాలని ఆదేశించారు.

హజ్‌యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హజ్‌యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైదరాబాద్‌లోని హజ్ కమిటీ భవనంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హజ్‌యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎయిర్ పోర్టు, రవాణా, పోలీసులు, జీహెచ్ఎంసీ, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వం అన్ని వసతులూ సమకూర్చినట్టు తెలిపారు. హజ్‌హౌస్‌లో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నుంచి వివిధ శాఖల సహకారంతో ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రికులకు వసతి, బస, విమానాల టికెట్ బుకింగ్, బోర్డింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. హజ్‌హౌస్‌లో పాసులు, సామాను స్క్రీనింగ్, సామగ్రి చెక్‌ఇన్, మెడికల్, టీకా వంటి వసతులను అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. శంషాబాద్ జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రత్యేక టెర్మినల్‌ను యాత్రికుల కోసమే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారని వివరించారు. డయాస్, సిట్టింగ్ ఏర్పాట్లు, బస్ పాయింట్లలో దిగడం, సామగ్రి స్క్రీనింగ్, చెక్ ఇన్ కౌంటర్లు, మొదలైనవి హజ్‌హౌస్‌లో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దాదాపు 7వేల మంది హైదరాబాద్ నుంచి హజ్‌యాత్రకు వెళ్లనున్నారని తెలిపారు. జూన్ 5 నుంచి నుంచి హజ్ చార్టర్ విమానాలు నడుపుతారని, యాత్రికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఈ-బుకింగ్ సిస్టమ్‌తోపాటు, మాన్యువల్ బుకింగ్ సిస్టమ్‌ను సౌకర్యాన్ని కూడా కల్పించినట్టు తెలిపారు.

సివిల్స్‌లో మెరిసిన నగర తేజం



ఐదో ప్రయత్నంలో అద్భుత విజయం

నవతెలంగాణ-బోడుప్పల్

పట్టుదల ఉంటే సాధించలేని ఏదీ లేదు అని నిరూపించాడు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మూడవ డివిజన్‌లో నివాసముంటున్న శివ శంకర్ రెడ్డి, రజితల కుమారుడు శ్రావణ్ కుమార్ రెడ్డి.. నాలుగు ప్రయత్నాల్లో ఫెయిలైనా.. ఐదో ప్రయత్నంలో సూపర్ సక్సస్ అయ్యాడు. సివిల్స్ లో మెరిశారు. ఆల్ ఇండియా 426వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు బైటింటి శారదా ఈశ్వర్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి , నాయకులు ఈశ్వర్ రెడ్డితో కలిసి వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనుమానస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్‌లో అనుమాన స్పద స్థితిలో ఓ యువకుడి మృత దేహం లభ్యమైంది. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అంబర్‌పేట నగర పంచాయతీ పరిధి కుంట్లూర్‌లోని పాపాయి గూడ చౌరస్తా వద్ద కుళ్లిన మృత దేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ స్థలం వద్ద లభించిన ఫోన్ ఆధారంగా, వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ములుగు జిల్లా పంచోతుకుల పల్లి కి చెందిన అల్లేవుల రాజేష్(24)గా గుర్తించారు. 2021లో ఇబ్రాహీం పట్నం నియోజకవర్గ పరిధిలోని శ్రీ ఇందు కళాశాలలో బీ టెక్ పూర్తి చేశాడు. కానీ ఏ ఉద్యోగం రాలేదు. కొన్ని రోజుల తర్వాత అతను తన స్నేహితుడు అయిన సాయి ప్రసాద్‌తో కలిసి హాస్టల్ లో ఉంటున్నాడు. తన కొడుకు ఈ నెల 26న తనతో ఫోన్ లో మాట్లాడారని..29న శవమై కనిపించినట్లు మృతుడి తండ్రి పరుశురాములు విలపించారు. అతని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తా



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్‌కు గతంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. దానిలో భాగంగా సోమవారం ఒక కోటీ 85 లక్షలా 80 వేల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సద్గురు నగర్ రోడ్డు నంబర్ 2, రోడ్డు నంబర్ 1 వద్ద సీసీ రోడ్డు, వనస్థలిపురంలోని కాంప్లెక్స్ ఏరియాలోని ప్లాట్ నెంబర్ బి-202 నుండి ప్లాట్ నెంబర్ బి -196(జడ్పీహెచ్‌ఎస్ వనస్థలిపురం పక్కన) వరకు సీసీ రోడ్డు, హస్తినాపురం ఈస్ట్ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద సిగ్నల్ నుండి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు, పీఎల్‌నెం.64 నుండి కమ్యూనిటీ హాల్ వరకు, పీఎల్‌నెం.102 నుండి పీఎల్‌నెం.94/ఎ పీఎల్‌నెం వరకు సీసీ రోడ్డు, శ్రీ శ్రీనివాసపురం రోడ్డు నెంబర్ 11 వద్ద బీటీ రోడ్లకు మరమ్మతులు, పద్మావతి కాలనీ బస్ స్టాప్ నుండి ఆర్టీసీ కాలనీ జంక్షన్ వరకు, వనస్థలిపురంలోని అభ్యుదయ నగర్ కాలనీ వద్ద బాగా దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరించడం తదితర పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రజలకు కొంత మేర ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు ముద్ద కళ్యాణ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, గడ్డం మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, సంజయ్, గడాల రాజు, నవీద్, క్రాంతి, పలువురు పాల్గొన్నారు.

కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా



- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

కాలనీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 2 లో చేపట్టిన సీసీ రోడ్ పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ డీఈ దామోదరరావుతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పీవీటీ డి.శర్మ, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సుబ్బారావు, పార్టీ డివిజన్ కార్యవర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, పవన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్కర్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ డయాగ్నొస్టిక్స్ పేదలకు వరం

- మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ పేదలకు వరం అని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'తెలంగాణ డయాగ్నొస్టిక్స్' పథకంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ బస్తీ దవాఖాన నందు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ కేంద్రాన్ని డిప్యుటీ డీఎంహెచ్‌వో నారాయణ రావు, కమిషనర్ వంశీ కృష్ణలతో మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం మాత్రమే కాదు, నాణ్యమైన రోగ నిర్ధారణ పరీక్షలు సైతం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇక్కడ 51 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు అందుబాటులో మరో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల అవసరాల దృష్ట్యా పీర్జాదిగుడలో ఒక డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య అధికారాలకు విజ్ఞప్తి చేశారు. క్షయ రహిత సమాజమే లక్ష్యంగా డబ్యూహెచ్ వో వారి సహకారంతో టీబీ వ్యాప్తి గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి నిర్ధారణ, నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. తర్వాత వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మాట్లాడుతూ పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయని...ఇలాంటి సమయాల్లో ఈ కేంద్రం వారికి ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు మాట్లాడుతూ తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రం ద్వారా అన్ని రకాల రక్త పరీక్షలు, షుగర్, థైరాయిడ్, బీపీ, కిడ్నీ, లివర్, కొవ్వుతో పాటు 45 రకాల సాధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. ప్రజలందరూ దీని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు సుబాష్ నాయక్, కౌడే పోచయ్య, నవీన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బండారి రవీందర్, శ్యామల సాయిలు, డాక్టర్ భార్గవి, సీనియర్ నర్స్ మోనిక, ప్రజలు తదితరలు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ హాల్‌ను ఆక్రమించి

శాశ్వత వార్డు కార్యాలయంగా మార్చే ప్రక్రియను అడ్డుకుంటాం'



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు ఆక్రమించి శాశ్వతంగా వార్డు కార్యాలయంగా మార్చే ప్రక్రియ అన్యాయమని, దీనిని అడ్డుకుంటామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల కిందట మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో కాలనీ వాసుల వెల్ఫేర్ అసోసియేషన్ సొంత నిధులు 50 శాతం, గవర్నమెంట్ నిధులు 50 శాతంతో ఇంద్రప్రస్థ కమ్యూనిటీ హాల్ ను నిర్మించినట్లు గుర్తుచేశారు. దీనిని కాలనీ వాసులు యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు, మతపరమైన పండుగలు, పెళ్లిళ్లు, వివిధ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారని వివరించారు. అధికార దాహంతో జీహెచ్‌ఎంసీ అధికారులు కాలనీ ప్రజలను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ హాల్‌ను కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను వార్డ్ ఆఫీస్ గా మార్చే ప్రక్రియను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కమ్యూనిటీ హాళ్లను వార్డ్ ఆఫీస్‌లుగా మార్చడానికి పూనుకున్నారని, జీవో 58-59 పేరిట అవకతవకలు జరుగుతున్నాయని, వీటికి పూర్తి బాధ్యత ఎమ్మెల్యే వహించాలని అన్నారు.



అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి వినతి పత్రం అందజేసినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేఖల ప్రదీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పన్యాల జైపాల్ రెడ్డి, కాలనీ వాసులు ఎమ్ విశ్వనాథం, కాలనీ సెక్రటరీ మోహన్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, అంజన్ రెడ్డి, బాబు, హస్తినాపురం కార్యకర్తలు సాయిరాం రెడ్డి, పరమేష్ యాదవ్, పోగుల నర్సింహా, మేడి మహేష్, సచిన్ నాయక్, మన్య క్రిష్ణ, మహేష్, శివ పాల్గొన్నారు.

సొమ్ము ఒకడిది సోకు ఒకడిది

- ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ - ఘట్కేసర్

సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అన్న చందనంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉందని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఘట్కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తు ంటే..రాష్ట్ర ప్రభుత్వం పేరుకే అభివృద్ధి చేస్తున్నట్లు నటిస్తు ందని ఆరోపించారు. ఇప్పటివరకు కేంద్రం డంపింగ్ అడ్, వైకుంఠధామాలకు రూ.12 కోట్లను తెలంగాణ ప్రభుత్వానికి నిధులు కేటాయించి ందని..అందులో ఘట్కేసర్ మండల అభివృద్ధికి రూ.70 లక్షలు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. ఇందుకు బహిరంగ సభలో సాక్షాదారాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డిలు ఏమి అభివృద్ధి పనులు చేశారని ప్రశ్నించారు. నిధుల కేటాయింపుల విషయంలో చర్చకు సిద్ధమా అని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సవాల్ విసిరారు.

ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాడుతాం

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల యాదయ్య





నవతెలంగాణ-తుర్కయాంజల్

అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాడుతామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. తుర్కయాంజల్ మున్సిపల్ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల కోసం ఇటీవల దరఖాస్తులు చేసుకున్న వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తర్వాత సూపరింటెండెంట్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ సీపీఎం మున్సిపల్ కన్వీనర్ డి. కిషన్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య హాజరై మాట్లాడారు. తుర్కయాంజల్ మున్సిపల్ ప్రాంతంలో అనేక గ్రామాల్లో ఇండ్ల స్థలాలు లేక ఎంతో మంది నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులు సుమారు 4000 మంది ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని గుర్తుచేశారు. ఇంకా నిరుపేదలను గుర్తించి ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములలో వారందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను డైరెక్ట్‌గా హెచ్‌ఎండీఏ పేరుతో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ చేసి పెద్దలకు కట్టబెడుతుందని ఆరోపించారు. నిరుపేదలకు స్థలాలు మాత్రం భూములు లేవని అంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు అంతా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకుంటే ప్రభుత్వ భూములను మేమే గుర్తించి...పేదలను సమీకరించి గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జి కవిత, జిల్లా కమిటీ సభ్యులు ఈ నరసింహ, సీపీఎం నాయకులు ఎం. సత్యనారాయణ, ఐ. భాస్కర్, కె.శంకర్, జె.ఆశీర్వాదం, ప్రకాష్ కారత్, పెంటయ్య, శంకరయ్య, మాధవరెడ్డి, కే. శారద, రత్నమ్మ రోజా రాణి, శివ ప్రసాద్, నాగయ్య, పుల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత, అభివృద్ధిలో తగ్గేదేలే



- ఎమ్మెల్యే బలాల

నవతెలంగాణ-సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల అభివృద్ధి, నాణ్యత ప్రమాణాలలో తగ్గేదేలే అని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, హైదరాబాద్ ఎంపీ ఓవైసీ ఆదేశం మేరకు అక్బర్ డివిజన్ పరిధిలోని ఉచిత ఆధార్ కార్డు కార్యక్రమాన్ని సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధార్ కార్డు ఎన్రోల్మెంట్ కరెక్షన్, ఆధారిత మొబైల్ నెంబర్‌ను యువత వినియోగించుకోవాలని కోరారు. నిరుపేదలు ఉచిత ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలపై ఉక్కు పాదం



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కు పాదం మోపారు. మేడిపల్లి తహసీల్దారు మహిపాల్ రెడ్డి అదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత ఆధ్వర్యంలో సర్వే నెంబరు 63/28 నుండి 63/39 వరకు గల ప్రభుత్వ భూముల్లో కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను జేసీబీ సాయంతో సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ బోడుప్పల్ ప్రభుత్వ భూముల్లో నకిలీ పట్టాలు సృష్టించి, కొంత మంది ఇంటి స్థలాలు విక్రయించి నిర్మాణాలు జరుపుతున్నారని తెలిపారు. అలాంటి భూములను ఎవరు కూడా కొనుగోలు చేయకూడదని పలుమార్లు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. కానీ కొంత మంది ఇవేమీ పట్టించుకోకుండా కావాలనే నిర్మాణాలు చేపడుతున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొన్ని నిర్మాణాల అంశం కోర్టు పరిధిలో ఉందని.. న్యాయస్థానంలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించిన అనంతరం కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి

నవతెలంగాణ - ఘట్కేసర్

తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె. మాధవి తెలిపారు. ఘట్కేసర్ మండలం అవుషాపూర్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ సంస్థగత అభివృద్ధికితో పాటు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం ద్వారా మోడీ తొమ్మిదేళ్ళ పాలనలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు మోడీ ప్రజా సంక్షేమ ఫలాల గురించి వివరించడానికి జూన్ 1 నుండి 30 వరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం గడప గడపకూ వెళ్లే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని, దీంతో పాటు బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. అంతకు ముందు జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి మాట్లాడుతూ జోకర్ మంత్రిగా చామకూర మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గం పరువు తీస్తున్నారని, సమస్యలపై మాట్లాడకుండా వాటిని తప్పుదారి పట్టించే విధంగా మంత్రి చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. జిల్లా కలెక్టరేట్‌లో దశాబ్ది ఉత్సవాల సమావేశంలో రైతు సమస్యలపై ప్రశ్నించిన మహిళా ఎంపీటీసీని కలెక్టర్, మంత్రి కండ్ల ముందే బయటకు ఈడ్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గం సభ్యులు నానావత్ బిక్కు నాథ్ నాయక్, ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఇంచార్జి వేమ్ నరేందర్, కార్యదర్శులు విజయ్ కుమార్, తిరుమల్రెడ్డి, విఘ్నేష్, అమర మోహన్ రెడ్డి, కాలేరు రామోజీ, పోచారం మున్సిపల్ కౌన్సిలర్ గొంగళ్ళ మహేష్, నాయకులు గుండ్ల ఆంజనేయులు, ప్రభంజన్ గౌడ్, నానావత్ సురేష్ నాయక్, విప్పర్ల హనుమాన్, ఏనుగు మచ్చేందర్ రెడ్డి, మెట్టు నర్సింహ రెడ్డి, ఇతర మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఓటరు కార్డు పట్ల నిర్లక్ష్యం వద్దు'



నవతెలంగాణ- మీర్‌పేట్

ఓటరు కార్డు పట్ల నిర్లక్ష్యం వద్దు, అది మన బాధ్యత అని మీర్‌పేట్ మున్సిపల్ బీఆర్‌ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కే.శిశుపాల్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ కార్డు గుర్తింపులో సాంకేతిక లోపాలు ఉంటే ఎన్నికల సంఘం సరిచేయాలని కోరారు. ప్రజలందరూ జూలై 1 తేదీ వరకు ఓటర్ లిస్ట్ నమోదు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ఆన్లైన్లో చూసుకోవాలి పేర్కొన్నారు. ఒకవేళ ఓటు హక్కు లేనట్లయితే వెంటనే అధికారిక వెబ్సైట్ లో, మీసేవ కేంద్రాల్లో కొత్త ఓటర్ నమోదు చేసుకోవాలని సూచించారు.

కేసీఆర్ హయాంలో ఆలయాల అభివృద్ధి



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

సీఎం కేసీఆర్ హయాంలో ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ ఆలయ అభివృద్ధి కోసం మంజూరైన కోటి రూపాయల నిధులు, ఆధునీకికరణలపై దేవాలయ చైర్మన్ గొడుగు శ్రీనివాస్, ఎండోమెంట్ డీఈ ఓం ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని ఐదు దేవాలయాలకు రూ.5 కోట్ల నిధులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగానే ఖిల్లా మైసమ్మ దేవాలయానికి కోటి రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఆలయ ఆధునీకికరణ పనులను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాజీద్, సభ్యులు మురళీధర్ రెడ్డి, సునీల్ యాదవ్, దీపు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి

బ్రహ్మోత్సవాల్లో మంత్రి సబిత..

ఆర్కేపురంలోని సౌభాగ్యపురం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, లింగస్వామి గౌడ్, గొడుగు శ్రీనివాస్, సాజీద్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీరాములు, శ్రీనివాస్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజా గర్జనను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్న సీపీఐ ప్రజా గర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీ.జీ సాయిలు గౌడ్ కోరారు. మేడిపల్లిలో జరిగిన కార్యక్రమంలో వచ్చే నెల 4న కొత్త గూడెంలో జరిగే ప్రజా గర్జన గోడ పత్రికను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిలు గౌడ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాలను చేపట్టినట్లు గుర్తుచేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన అనంతరం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసిందని ఆరోపించారు.పేద ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం ఆధాని, అంబానీల ప్రయోజనాల కోసమే మోడీ సర్కారు పనిచేస్తుందని వాపోయారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అయినా పేదల కోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ఎండీ అన్వర్, బీకేయంయూ మండల అధ్యక్షులు భూతం ఐలయ్య, మల్లికార్జున్ నగర్ శాఖ కార్యదర్శి సాంబశివరావు, ఇంద్రానగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య, వీరారెడ్డి నగర్ శాఖ కార్యదర్శి దండు మదర్, హేమ నగర్ శాఖ కార్యదర్శి ఉప్పల కొమురయ్య, కౌన్సిల్ సభ్యులు ఇస్తారి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు



- 15 బైకులు స్వాధీనం

నవతెలంగాణ-బోడుప్పల్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మేడిపల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మల్కాజిగిరి ఎస్వోటీ డీసీపీ ఆర్.గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెందిన గొల్లపూడి చందు..నగరంలో వనస్థలి పురంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఇంటి బయట తాళాలు వేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి, వాటిని అమ్మి అలా వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డాడు. ఇతడు మేడిపల్లి, మల్కాజిగిరి, వనస్థలిపురం పీఎస్‌ల పరిధిలో సుమారు 13 దొంగతనాలకు పాల్పడి 15 ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు తెలిపారు. షాద్ నగర్‌కు చెందిన పి.గోపి నాయక్ మల్కాజిగిరి పరిధిలో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసి గతంలో జైలుకు వెళ్ళాడు. జైలు నుంచి వచ్చిన తరువాత అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. సోమవారం బోడుప్పల్ సిగ్నల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా మేడిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఇతని వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం 15 ద్విచక్ర వాహనాల్లో మూడింటికి మాత్రం ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆర్.గిరిధర్ వివరాలు వెల్లడించారు. అనంతరం నేరస్తులను పట్టుకోవడంలో విశేషంగా కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి, డీఐ డి.ప్రవీణ్ బాబు, మల్కాజిగిరి డీఐ ఎస్.రవి బాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'చలివేంద్రాలు దాహార్తిని తీరుస్తాయి'



నవతెలంగాణ - చైతన్యపురి

చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయని మహేశ్వరం బీజేపీ కన్వీనర్ ధీరజ్ రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ అల్కాపురి కాలనీలో ఏర్పాటు చేసిన మజ్జిగ, చలివేంద్రం కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అందెల శ్రీరాములు, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ స్థలంలో నిర్మాణం కూల్చివేత

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



కీసర మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ స్థల లో ఇంటి నిర్మించడంతో రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చి వేశారు.కీసర ,కీసర దాయరా గ్రామాల సరిహద్దుల్లో 25 ఫీట్ల రోడ్డు ,ప్రభుత్వ భూమి మిగులు ఉండటంతో అప్పట్లో అధికారులు మార్కెట్ యార్డ్‌కు స్థలం కేటాయించి నిధులు సైతం కేటాయించారు. ఆ స్థలం ఖాళీగా ఉండటం తో కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ఆ స్థలంలో రాత్రి కి రాత్రే ఇంటి నిర్మాణం చేసి , బేస్మెంట్ కట్టారు.గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూల్చి వేశారు.ప్రభుత్వ స్థలం లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తప్పవని ఆర్‌డీఓ రవి హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-కంటోన్మెంట్



మనబడి మన ఊరు కార్యక్రమంలో మొదటి దశలోగా ఆదయ నగర్ ప్రైమరీ పాఠశాల అభివద్ధికి నిధులు మంజూరి కావడంతో సోమవారం కార్పొరేటర్ దీపిక, అధికారులు, ప్రిన్సిపాల్ కలిసి అభివద్ధి పనులను ప్రారంభించారు. అంతేకాకుండా నీటి కొరత తీవ్రత ఉండటం వల్ల అభివద్ధి పనులు చేపట్టాలంటే కూడా ఇబ్బంది కలుగుతోందని కాంట్రాక్టర్లు చెప్పడంతో కార్పొరేటర్ అధికారులతో సంప్రదించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

- కలెక్టర్ అమోయ్ కుమార్
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వైభవంగా నిర్వహించాలని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌తో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాట్లాడుతూ 21 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావ రణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకొని, అధికారులకు దిశా నిర్దేశం చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య,జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, డీసీపీ సందీప్‌లు పాల్గొన్నారు.



అనంతరం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిచారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి జూన్ 22 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలలో మన ప్రగతి చాటేలా విధంగా ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రధానంగా క్లస్టర్ పరిధిలో, గ్రామాలలో చేపట్టే పెద్ద కార్యక్రమాలైన రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. నోడల్ అధికారులు తమ శాఖ ఇచ్చే ఆదేశాలతో పాటు కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం 2014కు పూర్వం ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై నియోజక వర్గం వారీగా, గ్రామ, మండల వారీగా నాడు-నేడు పరిస్థితులపై అద్దంపట్టే విధంగా రూపొందించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయుటకు ఆయా రోజులల్లో శాఖ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేస్తారని, లబ్దిదారుల విజయగాధలు, అభిప్రాయాలను నలుగురికి తెలిపేలా కార్యక్రమాలు రూపొందించాలి అని తెలిపారు. చక్కటి ఫ్లవర్ డెకరేషన్ తో పాటు విద్యుత్ దీపాలతో జిల్లాలోని కొన్ని ప్రధాన కార్యాలయాలతో పాటు దేవాలయాలు, చర్చిలు, ప్రార్థన మందిర ప్రదేశాలను 21 రోజులపాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అన్ని మున్సిపాల్టీల్లో జిల్లా ప్రవేశం, ముగింపు ప్రాంతాలలో, జంక్షన్‌లలో ఆర్చీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నా మన్నారు. అదేవిధంగా కార్యక్రమాల నిర్వహణపై డాక్యుమెంటేషన్‌తో పాటు వీడియో చిత్రికరణ చేయాలని ఆదేశించారు. రైతు దినోత్సవం నాడు జిల్లాలో ఉన్న రైతు వేదికలో వేడుకలు జరగాలని, ప్రతీ గ్రామం నుంచి రైతులను డప్పులతో ఘనంగా పండుగ వాతావరణంలో రైతు వేదికలకు తీసుకొని రావాలన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేయాలని తెలిపారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు- నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు.

జూన్ 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బీసి కులవత్తుల ఆర్థిక సహాయం ప్రారంభించాలని అన్నారు. బీసి కుల వత్తుల ఆర్థిక సహాయంపై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ప్రకారం మార్గదర్శకాలు అందిస్తామని, దాని ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో సాధించిన ప్రగతి, కొత్త ఆస్పత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు సేవలను వివరించాలని, వైద్య, ఆరోగ్య శాఖ దినోత్సవం నాడు కేసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటాలని అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయాలని, సఫాయిన్న సలాం అన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు.

మిషన్ భగీరథ కింద ఇంటింటికి తాగునీటి సరఫరా, గిరిజ నోత్సవం, పెరిగిన పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి పక్కాగా తెలియజేయాలని, ఆధ్యాత్మిక రంగంలో సాధించిన ప్రగతి, అమరుల సంస్కరణ కార్యక్రమాలు పకడ్బందీగా జరగాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, సీపీవో మోహన్ రావు , ఆర్డీవోలు మల్లయ్య, రవి, డిఆర్డీవో పద్మజా రాణీ, జిల్లావైద్య అధికారి శ్రీనివాస్,జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి, వ్యవసాయ శాఖ అధికారి మేరీరేఖ, డీసీవో శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి జానకీరామ్, జిల్లా ఉద్యానవన శాఖ నీరజ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు 'నకిలీ ఐటీ అధికారులు'..?

- మరో నలుగురి కోసం గాలింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో సంచలనం రేపిన బంగారం దుకాణం చోరీ కేసులో నలుగురు 'నకిలీ ఐటీ అధికారులు' నిందితులను పోలీ సులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. గత శనివారం రెజిమెంటల్ బజార్ సికింద్రాబాద్ మోండా మార్కెట్లోని హర్ష బంగారం దుకాణంలో ఐటీ అధికారుల ముసుగులో ఐదుగురు నిందితులు 1700గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన విషయం తెలిసిందే. పట్టపగలు సినీ ఫక్కీలో జరిగిన చోరీ కేసును టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ మొదలు పెట్టారు. ఈ క్రమంలో నిందితులు మహారాష్ట్రకు పారిపోయినట్టు గుర్తించిన టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని అనుసరిస్తూ వెళ్లారు. నిందితులు జాకీర్, రహీమ్, ప్రవీణ్, అక్షయ్ పోలీసులకు చిక్కినట్టు తెలిసింది. మరో నలుగురి కోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న నిందితులను టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో విచారిస్తున్నట్లు తెలిసింది.

పథకం ప్రకారం రెక్కీ

నగరంలోని బంగారం దుకాణాల్లో చోరీ చేయాలని నిర్ణయించుకున్న నిందితులు పథకం ప్రకారం రెక్కీ నిర్వహించినట్టు తెలుస్తోంది. ఈ నెల 20 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని ప్యాట్నీ సెంటర్లో ఉన్న ఓ లాడ్జిలో నిందితులు బస చేసినట్టు తెలిసింది. 24న ఉదయం 7.30 గంటల సమయంలో నలుగురు, మధ్యాహ్నం 3.30 గంటలకు మరో నలుగురు లాడ్జ్‌కు వచ్చారు. ఎవరికీ అనుమానం రాకుండా రెండు బందాలుగా వచ్చి రెండు వేర్వేరు గదుల్లో బస చేశారు. లాడ్జ్ మేనేజర్‌కు ఎలాంటి అనుమానం రాకుండా ఒకరికొకరు పరిచయం లేనట్టుగానే వ్యవహరించారు. లాడ్జి గది తీసుకునే ముందు మేనేజర్ తిరుపతికి వారి ఆధార్ కార్డులు వాట్సాప్ ద్వారా పంపించారు. వాట్సాప్ చేసిన ఆధార్ కార్డులను రెండు రోజుల తర్వాత 'డిలీట్ ఫర్ ఎవ్రీవన్' కొట్టేశారని తెలిసింది. 27న ఉదయం 10.30గంటలకు ఒక నిందితుడు తన తల్లి మృతి చెందిందని మేనేజర్‌కు చెప్పి హడావుడిగా లాడ్జ్ గదిని ఖాళీ చేశారు. మూడు రోజులకు గాను రూ.3వేలు చెల్లించి లాడ్జ్ నుంచి రెండు బందాలు వెళ్లిపోయాయి. లాడ్జికి 750 మీటర్ల సమీపంలోనే చోరీ జరిగిన దుకాణం ఉంది. పక్కా ప్లాన్‌తోనే రెక్కీ చేసిన ఐదుగురు నిందితులు తాము ఆదాయపన్ను శాఖ(ఐటీ) అధికారులమంటూ ఐడీ కార్డులు చూపించి దుకాణంలోకి వెళ్లగా మిగిలిన ముగ్గురు దుకాణం పరిసరప్రాంతాలను పరిశీలించినట్టు తెలుస్తోంది. నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గోవా, ముంబాయ్ తదితర రాష్ట్రాలల్లో తీవ్రంగా గాలిస్తున్నట్టు తెలిసింది.

'అర్హులైన పేదలకు 'డబుల్' ఇండ్లను కేటాయించాలి'

నవతెలంగాణ-కాప్రా



అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నాళ్లని ప్రశ్నిద్దాం.. పాలకులనే మారుద్దాం.. అంటూ అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయిం చాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కాప్రా సర్కిల్ మున్సిపల్ ఆఫీస్ వరకు భారీగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ పేద ప్రజలను తీవ్ర ఇబ్బంది గురి చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో లక్షలాదిమంది పేద ప్రజలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసమే దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు రాష్ట్రంలో నిర్మాణదశలో కేవలం 50,000 వేల ఇండ్లు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లను అర్హులకు కేటాయించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిఎడ క్షంలో న్యాయపరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కేటాయించిన ఇండ్లను లబ్దిదారులకు అందజేయడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. లబ్దిదారులకు ఇండ్లు కేటాయించే వరకు ప్రభుత్వమే నెలకు రూ.5వేల చొప్పును వారి అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలపై ప్రేమ ఉన్నట్టు నాటకాలాడుతున్నాయని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇండ్లు అందించని యెడల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలతో కలసి భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తమని హెచ్చరించారు. ఈ కార్యక మంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కాంగ్రె స్ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, టీపీసీసీ సెక్రటరీ పసుల ప్రభాకర్ రెడ్డి, రామిరెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మెన్ పత్తి కుమార్, కాంగ్రెస్ నాచారం డివిజన్ ఇన్‌చార్జ్ మేడల మల్లికార్జున గౌడ్, మల్లాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ వంగటి సంజీవరెడ్డి, కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ నెల్లుట్ల శీను గౌడ్ , కంటెస్టడ్ కార్పొరేటర్ గడ్డం యాదగిరి, కాంగ్రెస్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ ప్రెసిడెంట్ సముద్రాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాగ్రత్త.. ఒప్పందం రద్దు చేస్తాం



- స్ట్రీట్ లైట్లపై అసంతృప్తి ఉంది
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలోని స్ట్రీట్ లైట్ పనితీరుపై అసంతృప్తి వస్తోందని వాటి పనితీరులో మెరుగు పర్చాలని, లేని పక్షంలో ఒప్పదం రద్దుచేస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇ.ఇ.ఎస్.ఎల్ ఏజేన్సీని హెచ్చరించారు. సోమవారం మేయర్ ఆధ్వర్యంలో కమిషనర్ డీ.ఎస్.లోకేష్ కుమార్, ఇ.ఎస్.సీ. ఇ.ఇ.ఎస్.ఎల్ ఎలక్ట్రిసిటీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వీధి లైట్ల పనితీరుపై మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎల్ఇడి స్ట్రీట్ లైట్లు పనితీరుపై ప్రజలు, కార్పొరేటర్లు సంతృప్తిగా లేరని, వచ్చిన సమస్యలను కూడా సత్వర పరిష్కారం చేయలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సేవలు అందించని పక్షంలో జీహెచ్ఎంసీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయడానికి వెనుకాడమని ఆమె హెచ్చరించారు. పలువురు కార్పొరేటర్‌లు వారీ వార్డుకు సంభందించిన ఫిర్యాదులు చేస్తున్నారని స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశంలో కూడా సభ్యులు ప్రశ్నించడం జరుగుతుందన్నారు. కనీసం స్ట్రీట్ లైట్ పెట్టలేక పోతున్నామనే ఆవేదన చెందుతున్నారని ఇకనైనా సరైన సేవలు అందించేందుకు మెన్, మెటీరియల్ స్టాక్ సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఈ విషయంలో వార్డు వారీగా బాధ్యులైన అధికారి నియమించాలని కోరారు. స్టాండింగ్ కమిటీకి హాజరైన కార్పొరేటర్‌లు జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఉన్న సమస్యలను, లోపాలను మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదు చేసినా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, అసలు ఎవరు బాధ్యులని కార్పొరేటర్లు ఇ.ఇ.ఎస్.ఎల్ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా కమిషనర్ డీ.ఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ... నెలనెలా బిల్లులు చెల్లిస్తామని, ఆ నిధులను జీహెచ్ఎంసీ సంబంధించిన సేవలకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. గత ఎనిమిది నెలల నుండి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఇకనైనా మెరుగుపర్చాలన్నారు. ప్రతి సర్కిల్‌కి రెండు చొప్పున ల్యాడర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓల్టేజ్ బల్బులు కొరత ఉన్నందున రెండు వారాల్లో 3000 బల్బులు ఆ తర్వాత మరో 3 వేల బల్బులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎప్పటికీ బల్బుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒప్పందం ప్రకారం 5 శాతం బఫర్ స్టాక్ నిర్వహించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఇ.ఎస్.సీ జియా ఉద్దీన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతి సైజెన్ శేఖర్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహమ్మద్ అబ్దుల్ ముక్తాదర్, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, బండారి రాజ్ కుమార్, వనం సంగీత యాదవ్, రాగం నాగేందర్ యాదవ్, టీ. మహేశ్వరి, ఆర్.సునీత, జోనల్ కమిషనర్లు శంకరయ్య, అశోక్ సామ్రాట్, మమత, పంకజ, శ్రీనివాస్ రెడ్డి, ఇ.ఇ.ఎస్.ఎల్ సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి

నవతెలంగాణ-బేగంపేట్



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని లబ్ధిపొం దాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద సికింద్రాబాద్ మండల పరిధిలోని 29 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పొందిన లబ్దిదారులు వాటిని గురించి తమకు తెలిసిన వారికి వివరించి సద్వినియోగం చేసుకొనే విధంగా సహాయపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ హేమలత, సికింద్రాబాద్ తహసిల్దార్ శైలజ, బీఆర్ఎస్ బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దశాబ్ది వేడుకలు



- మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్ నగర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను అంగరంగ వైభంగా జరుపుకుందామని, అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దేశానికే మోడల్‌గా నిలుస్తుందనిమేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో మురుగు సమస్య లేకుండా చూడాలని అధికారుకు ఆదేశాలు జారీ చేశారు. అభివద్ధి పనులతో జవహర్ నగర్ పూర్తిగా మారిపోయిందని, గతంలో అభివద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, తెలంగాణ ఏర్పాటు తర్వాతనే దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. రూ. 1.3కోట్ల అభివద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రధానంగా కౌన్సిల్ సమావేశ హాల్ కొత్త భవనం, మురుగు కాలువలు శుభ్రం, మ్యాన్‌హోల్ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్వో ప్రభాకర్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-మల్కాజిగిరి



దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం ఆనంద్ భాగ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ దశబ్ది ఉత్సావాల సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావే శం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్,సునీత రామూయాదవ్,మీనా ఉపేందర్ రెడ్డి,జితేంద్ర నాథ్,అనిల్ కిషోర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు డీసీ రాజు,ఆల్వాల్ నాగమణి, ఎమ్మార్వో వెంకటేశ్వరులు, డీవై ఎమ్మార్వో రేణుక,ఐరిగేషన్ డీఈ పవన్,ఏఈ పద్మ, హెచ్ఎండీఏ ఈ ఈ పద్మా,డీఈ వెంకట్ రమణ,ఎలక్ట్రికల్ డీఈ సుభాష్,ఏఈ యాదగిరి,మేనేజర్ జీఎం సునీల్ కుమార్, డీజీఎం భాస్కర్, ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐలు రవి కుమార్,నాగరాజు, ఏసీపీ గజనంద్, డీఈ లు మహేష్, లౌక్యా,ఎంటమలాజీ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్ ఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, ఎస్సీ సోషల్ వెల్ఫేర్ వినోద్, ఎంఈఓ మధన చారి, పీ ఓ మల్లికార్జున్,ఆల్వాల్ పీ ఓ మధుసూదన్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై కీసర ఎంపీపీ సమీక్ష

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు .సోమవారం కీసర మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై అధికారులు ,ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అవతరణ వేడుకలు వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలను ,అధికారులను భాగస్వామ్యం చేస్తూ ఉత్సవాలు ఘనంగా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్ ,తహశీల్దార్ గౌరీ వత్సల్యా ,వైస్ చైర్మెన్ బి.సత్తి రెడ్డి, ఎంపీఓ నంద కిషోర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ,అధికారులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి



- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, సంతోష్

నవతెలంగాణ-కాప్రా

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బ్యాగరి వెంకటేష్, రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. అదే విధంగా యూనిఫార్మ్, బుక్స్, టై, బెల్టు, విద్యాసంస్థల్లో కిరాణా షాప్‌లో అమ్మిన ట్టుగా అమ్ముతున్న విద్యాధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఈసీఐఎల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు బ్యాగరి వెంకటేష్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల ప్రయివేటు, కార్పొరేట్ యజమాన్యాలు వారి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. కావున మండల, జిల్లా అధికారులు స్పందించి బ్రాంచీల పేరుతో ప్రారంభిస్తున్న పాఠశాలల పైన చర్యలు తీసుకొని మూసివేయాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకున్నా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, అడ్మిషన్ బోర్డు పెడుతున్నా కనీసం మండల, జిల్లా విద్య అధికారులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. రాథోడ్ సంతోష్ మాట్లాడవుతూ.. హాస్టల్ బుకింగ్ పేరిట విద్యా ర్థుల దగ్గర నుంచి ముందుగానే డబ్బులు వసూలు చేస్తున్నా చూసి చూడనట్టుగా విద్యాధికారులు వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముందుగానే యూనిఫామ్స్,బుక్స్, టై, బెల్ట్, తీసుకోవాలని మెసేజ్‌లు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యధికారులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యవహారాలపై స్పందించకపోతే పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తాం అని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాము, మనోజ్, సహయకార్యదర్శి అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కల.. నెరవేరిన వేళ



- కూచిపూడి, అల్లికలు, చిత్రలేఖనం, కుట్టడంలో ప్రత్యేక క్లాసులు
- శిబిరంలో 50మంది చిన్నారులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



మలక్‌పేట్‌లోని చంచల్‌గూడ కాలడేరా పాఠశాల ప్రాంగణంలో బాలభవన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం చిన్నారులతో సందడి గా మారింది. వేసవి సెలవుల్లో చిన్నారు ల్లోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ఉచితంగా కూచిపూడి నృత్య శిక్షణ

ఈ క్రమంలో చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్ భవన్ కేంద్రంలో కాలడేరా పాఠశాల ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య శిక్షణ, అల్లికలు, చిత్రలేఖనం, కుట్టడం వంటి అంశాల్లో ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. పాతబస్తీ నుంచి సుమారు 50మంది చిన్నారులు శిబిరంలో శిక్షణ పొందుతున్నారు.

అదేవిధంగా ఖర్చుతో కూడుకున్న కూచిపూడి నృత్య శిక్షణను బాల్ భవన్ కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వడంతో చాలామంది చిన్నారులు ఉత్సాహం చూపిస్తున్నట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు. చిత్రలేఖనంలోనూ చిన్నారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారు. ఉన్ని దారాలతో చిన్న చిన్న అల్లికలతో కాకుండా వృధాగా పడేసిన డబ్బాలు ప్లాస్టిక్ గ్లాసులతో అందమైన వస్తువుల ను తయారు చేసేందుకు ఈ శిబిరంలో ప్రత్యేక శిక్షణ అంది స్తున్నట్టు బాల్ భవన కేంద్రం సూపరిటెండెంట్ ఆకుల విజయలక్ష్మి వివరించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నాటి నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరాన్ని జూన్ రెండు వరకు కొనసాగిస్తామని తెలిపారు.

3 ఏండ్లుగా నిర్వహిస్తున్నాం

ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని మూడేండ్లుగా నిర్వహిస్తున్నాం. ప్రతియేటా వేసవి సెలవుల్లో ఈ శిబిరాన్ని కొనసాగి స్తాం. ఈ శిక్షణ శిబిరాన్ని ప్రతీ ఒక్క విద్యార్థి ఉపయోగిం చుకోవాలని, వారి వారి ప్రతిభా సృజ నాత్మకతను వెలికి తీసేందుకు ఇదోక మంచి అవకాశం. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని కోరుతున్నాం.

-ఎం. వెంకట్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు,



మంత్రిని కలిసిన స్కౌట్స్ అధికారులు

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ ఫైర్ సిబ్బంది అక్రమంగా తమ గేట్‌ను కూల్చివేశారని ఆరోపిస్తూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను స్కౌట్స్ అధికారులు సోమవారం కలిసి తమ వ్యధను వెళ్ళ బుచ్చుకున్నారు. సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులో 1930 నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయం కొనసాగుతుంది. కాగా 70వ దశకంలో ఈ కార్యాలయం ముందు ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా పక్కనే మరో భవానాన్ని నిర్మించారు. ఈ క్రమంలో రెండు భవనాలకు మధ్యన స్కౌట్స్ అండ్ గైడ్స్ కు చెంది ఉన్న బౌట్ గేట్ ను శనివారం ఉదయం డీఎఫ్ఓ, ఎస్ఎఫ్ఓ వారి సిబ్బంది తో కలిసి కూల్చివేసి దారిని మూసివేశారు. ఇదే విషయం స్కౌట్స్ అధికారులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దష్టికి తీసుకు వెళ్లగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి రమేష్ చందర్, సహాయ జిల్లా కమిషనర్ డాక్టర్ ఎం.హెచ్.బతేన, జిల్లా కార్యనిర్వాహక కమిషనర్ ఎస్ విజయభాస్కర్, స్కౌట్ మాస్టర్లు విష్ణు ప్రసాద్, వనం రాజులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-కాప్రా



ఏఎస్ రావు నగర్ డివిజన్‌లో వివిధ కాలనీల్లో రూ. 227.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి , కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డిలు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్‌లోని మహేష్ నగర్ కాలనీలో రూ. 35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, జపనీస్ పార్క్ లో రూ. 39 . 50 లక్షల వ్యయంతో వాచ్మెన్ రూము, టాయిలెట్ల పనులు , రూ. 12 . 50 లక్షల వ్యయంతో సీనియర్ సిటిజన్ గ్రౌండ్, ఏఎస్ రావు నగర్ లో జిమ్ పరికరాల ఏర్పాటు పనులు , రూ. 20 లక్షల వ్యయంతో జీ బ్లాక్ ఏఎస్ రావు నగర్ లో సీసీ రోడ్లు, అరుల్ కాలనీలో రూ. 38.50 లక్షల వ్యయం తో సీసీ రోడ్లు, భవాని నగర్ లో రూ. 12.50 లక్షలతో జిమ్ పరికరాల ఏర్పాటు, చంద్ర నగర్ లో రూ. 41.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం , గాంధీనగర్ లోని స్మశాన వాటిక అభివద్ధి కొరకు రూ. 28 లక్షలతో పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ పాజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కాప్రా డీసీ శంకర్ , కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు , భద్రయ్య,, ఈఈ హరిలాల్ , ఏఈ కీర్తి , బీఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

మంచినీటి కోసం విద్యార్థినీల రాస్తారోకో

నవతెలంగాణ-ఓయూ:



ఉస్మానియా విశ్వవిద్యాలయం లేడీస్ హాస్టల్ పీహెచ్డీ బ్లాక్ లో తాగునీరు, వినియోగించు కోవడనికి నీరు గత నాలుగు రోజుల నుండి లేక పోవడంతో పీహెచ్డీ విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం నుండి సాయంత్రం 7 వరకు ఓయూలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుండి డ్రికింగ్ వాటర్ లేక పోవడంతో వేసవికాలం కావడంతో బయట నుండి నీళ్ల తెచ్చుకొని తాగుతున్నట్లు తెలిపారు. పీహెచ్డీ విద్యార్థులకు ప్రత్యేకంగా మెస్ ఏర్పాటు చేయాలని, పీహెచ్డీ బ్లాక్‌లో వాటర్ సంపు ఏర్పాటు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలో నీరు లేకుండా ఎలా ఉండాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన లేడీస్ హాస్టల్ డైరెక్టర్ కళ్యాణ లక్ష్మీ, స్టూడెంట్ డీన్ ప్రో.ప్రో.రాజేందర్ నాయక్ వచ్చిన విద్యార్థులు వారితో వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు వసతులు కల్పించాలని అప్పటి వరకు ఉద్యమిస్తాం అని వారు హెచ్చరించారు.

ఓయూలో పీహెచ్డీ 2017 బ్యాచ్‌కు డిజైన్ సెమినార్ డెడ్‌లైన్ ఎత్తివేయాలి : బహుజన విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీలో 2017 సంవత్సరం పరిశోధన విద్యార్థులకు ఏప్రిల్ 27 వరకు డైజైన్ సెమినార్ ఇవ్వాలని డెడ్ లైన్ పెట్టడాన్ని బహుజన విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయమై సోమవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణను కలిసి పరిశోధన విద్యార్థులకు విధించిన డెడ్‌లైన్ ఎత్తివేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారని, ఒకవేల డెడ్‌లైన్ ఎత్తి వేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మరియు బహుజన స్టూడెంట్స్ జాక్ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, బీఎస్ఫ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిగంటి వేణుగోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ. 2లక్షల కోట్లకు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య
- జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గం గారాంను ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 75 సంవత్సరాలు గడిచినా 56 శాతం జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం ఈ కులాల అభివృద్ధి జరగడం లేదు అని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు 2 వేల కోట్లు కేటాయించి 56 శాతం జనాభా ను అవమానించారని అన్నారు. కేంద్ర బడ్జెట్ 45 లక్షల 50 వేల కోట్లు ఉంటే 56 శాతం జనాభా గల బీసీలకు కేవలం 2 వేల కోట్లు కేటాయించారు. ఇది ఏ మూలకు సరిపోతుంది అని ప్రశ్నించారు. ఐ.ఐ.టి - ఐ.ఐ.యం - నీట్ లాంటి ముఖ్యమైన కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు ఈ కోర్సుల ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నవి. ఒక లక్షా 30 వేల నుండి ఒక లక్షా 70 వేల వరకు ఫీజులు ఉన్నాయి. పైగా బీసీలకు క్రిమిలేయర్ ఆర్థిక పరిమితి విధించారు అత్యంత వెనకబడిన కులాల వారు సీట్లు పొందినప్పటికీ ఫీజు కట్టే స్తోమత లేక చదువును మధ్యలోనే మానుకుంటున్నారన్నారు. పరిశ్రమలు రావడం, యాంత్రీకరణ చెందడం మూలంగా కులవృత్తులు - చేతివృత్తులు దెబ్బతిన్నాయన్నారు. దీనితో ఈ కుల వృత్తుల వారు వృత్తులు కోల్పోయి ఆకలి చావులకు గురవుతున్నారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతీ కుటుంబానికి 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాజీవ్ ఫెలో షిప్ పథకం కింద అర్హులైన స్కాలర్స్ అందరికీ స్టై ఫండు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని కోరారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ హంసరాజ్ గంగారాం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్చలలో, బీద మస్తాన్‌రావు, కర్రి వేణుమాధవ్, డాక్టర్ పద్మలత, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

'జీవో నెంబర్ 58, 59 స్థలాల క్రమబద్ధీకరణలో

ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని, ఇండ్లు కట్టుకుని జీవిస్తున్న పేదలకు జీవో నెంబర్ 58, 59 ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ ఆరోపించారు. నిరుపేద స్థలాలను క్రమబద్ధికరిం చేందుకు మురికి వాడలకు వెంటనే వెళ్లి అధికారులు పరిశీలించి అక్కడే ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్, సత్యనారాయణరెడ్డిభవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఈ.టి.నరసింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..హైదరాబాద్ నగరానికి తాగునీటి వనరులైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులు, వాటి పరివాహక ప్రాంతాలను జీఓ.111 రక్షిస్తుందని, ఈ జీఓ రద్దుతో వర్షాలు కురిసే సమయంలో భారీగా నీరు పొంగిపొర్లుతుందని, హైదరాబాద్ నగరానికి భారీ వరదల ముప్పు ఏర్పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీఓ.111 రద్దును ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు తీర్చడంతో పాటు అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని కేవలం శంకుస్థాపన లకే పరిమితమైందని, ముఖ్యంగా మురికి వాడల ప్రజలు కనీస సౌకర్యాలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రాథమిక మౌలిక సదుపాయాలు, మెరుగైన జీవన ప్రమాణలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీలు, బస్తీలు, మురికి వాడల్లో పాదయాత్రలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు నరసింహ పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ..గత జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బిఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కుతుందని విమర్శించారు. ఓపెన్ నాలాలు, మ్యాన్ హోళ్ళు పౌరుల ప్రాణాలను హరిస్తున్నాయని, ఎటు చూసినా రోడ్లపై డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతున్నాయని, రోడ్లు, తాగునీటి సమస్య, గుడిసెల క్రమబద్ధీకరణ, పట్టాల పంపిణీ సమస్యలపై ఇంధన, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై హైదరాబాద్ నగరంలో పూర్తి స్థాయిలో పో రాటలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, పడాల నళిని, షంషుద్దీన్, ఏం.వెంకట్ స్వామి, నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, ఎండి.సలీం పాల్గొన్నారు.

బస్తీలో సమస్యలు స్వయంగా పరిశీలించి..పరిష్కరించండి

- ఆత్మీయ సమ్మేళనంలో నాయకులను కోరిన మహిళలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బస్తీలో తమ జీవనాన్ని పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని ఆత్మీయ సమ్మేళనంలో మహిళలు ప్రజాప్రతినిధులను, నాయకులను కోరారు. సోమవారం బంజారాహిల్స్‌లో బంజారాభవన్, జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. స్థానిక మహిళలు బస్తీలో సమస్యలపై నాయకులను ప్రశ్నించారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ బస్తీకి వచ్చి సమస్యలు స్వయంగా పరి శీలించాలని, ఎవరో చెప్పుడు మాటలు విని పరిష్కారమైందని భావించవద్దని, సమస్యలను ప్రత్యక్షంగా చూసి తమ జీవనగాథను వినాలని ఆత్మీయ సమ్మేళనంలో కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు దాసోజు శ్రవణ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాజీ కార్పొరేటర్ మా మిడి నరసింహారావు, కాజా సూర్యానారాయణలు పాల్గొని ప్రసంగించారు. ఆత్మీయ సమ్మేళనాలు కుటుంబ వాతావరణాన్ని ఏర్పర్చడానికి ఏర్పాటు చేసేవని వారు అన్నారు. రాబోయే రెండు రోజుల్లో ఫిలింనగర్ 18 బస్తీలను, ఇందిరానగర్, గాయత్రి హిల్స్, అంబేద్కర్‌నగర్ బస్తీలను పర్యటించి సమస్యలను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందక పోతే నేరుగా తమను సంప్రదించాలని ఎ మ్మెల్యే కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ చైర్మన్ ప్రసన్న కుమారి, జూబ్లీహిల్స్ డివిజన్ పరిధి లోని నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలు వీధుల్లో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ:



టీఆర్‌టీ క్వార్టర్స్, వీరయ్య వీధిలో సోమవారం సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చాలా సంవత్సరాలుగా పురాతనమైన ఇంట్లో నుండి చెత్త దుర్వాసన, దోమలతో ఇబ్బందుల పడుతున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి ఆ ఇంటి పరిసర ప్రాంతంలో పొడవైన చెట్టు వల్ల కరెంట్ వైర్లకు తగులుతున్నాయని తెలుపగా వెంటనే కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్, హార్టికల్చర్ అధికారి సురేష్, బి ఆర్ ఎస్ నాయకులు బాలాజీ, వేణు, పాల్గొన్నారు.

వేణు అడ్డకట్లకు ఓయూ డాక్టరేట్..



నవతెలంగాణ-ఓయూ :

ఉస్మానియా యూని వర్సి టీ కామర్స్ విభాగంలోని ప్రొ. డాక్టర్ కమతం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో వేణు అడ్డకట్ల ఫైనాన్షి యల్ పెర్ఫార్మన్స్ అఫ్ హౌసి ంగ్ ఫైనాన్స్ కంపెనీస్ ఇన్ ఇం డియా ఏ స్టడీ అఫ్ హెచ్‌డి ఎఫ్‌సి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో పరిశోధన పత్రాన్ని (పీహెచ్డీ) సమర్పించినందుకు యూనివర్సిటీ కామర్స్ విభాగం వేణు అడ్డకట్లకు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొ.డాక్టర్ కమతం శ్రీనివాస్ రీసెర్చ్ పర్యవేక్షణలో సలహాల మేరకు పరిశోధన సాగించినట్లు తెలిపా రు. తనకు డాక్టరేట్ లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రొ.శ్రీనివాస్, కామర్స్ విభాగం అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారిని అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, వేణును అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనం 111 జీవో రద్దు



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని అందుకు నిదర్శనమే ట్రిబుల్ వన్ జీవో రద్దు చేయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్ బిసి భవన్ లో బీసీ నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరిందన్నారు. అందులో భాగమే ట్రిబుల్ వన్ జీవోను రద్దు ప్రభుత్వ భూములు యథేచ్ఛగా దుర్వినియోగం ఓఆర్‌ఆర్‌లో 40,000 కోట్ల విలువైన టెండర్లను 7380 కోట్లకు అప్పగించడం తదితర నిర్ణ యాలన్నీ తెలిపారు. 400 సంవత్సరాల హైదరాబాద్ పరిరక్షణకు ఉపయోగపడ్డ జూరాల జలాశయ క్యాచ్ మెంట్ శక్తిని హరించి భవిష్యత్తులో గండిపేట మంచినీళ్ల పోగొట్టుకోవడమే కాకుండా వర్షాకాలంలో వరదలతో పట్నం తరచుగా మునిగిపోవడానికి ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ నేతలు కుటుం బీకులు అక్రమంగా సంపాదించిన వేలాది కోట్ల డబ్బులతో దాదాపు 50 వేల ఎకరాలు పైగా అగ్రిమెంట్ చేసుకుని లక్షలాది కోట్ల సంపాదించే దుష్ట పన్నాగమే ఈ నిర్ణయం అని తెలిపారు. అవసరమైన న్యాయమైన పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిజాయితీ నిరూపించుకోవాలంటే పరీవా హక జిల్లాలైన మేడ్చల్ యాదాద్రి రంగారెడ్డి తదితర జిల్లాలకు ఇంటి టాక్స్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించాలని అప్పుడే ఆ ఫలం దక్కుతుందని ఆయన సూచించారు. ఈ అంశాలపై ట్రిబుల్ వన్‌జీవో పరిరక్షణకై జోన్ 1 నిరాహార దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పి.సుధాకర్ ముదిరాజ్ వేముల రామకృష్ణ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు

'రోడ్డుపైన వాహనాలు పార్క్ చేయడం వల్లే ప్రమాదాలు'



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించడం సర్వసాధారణమైపోయింది. ఆదివారం రాత్రి ఒకచోట ఏకంగా డీసీపీకి ట్రాఫిక్ చిక్కులు ఎదురయ్యాయి. ఇది వరకే ఆ ఏరియాలో ఒక పబ్బుపై కేసు నమోదు చేసిన సంఘటన మరువకముందే రహదారులపై ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో అవి నిత్యం రద్దీ గా ఉన్న ప్రధాన రహదారులు కావడంతో ప్రమాదాలు చోటుచేసు కుని ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. వాహనదారులు కానీ పోలీసులు కానీ అప్రమత్తత వహిం చకపోవడం నిర్లక్ష్యమేనని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ ఎల్వీ ప్రసాద్ మార్గం నుండి పంజాగుట్ట వరకు డేంజర్ జోనే వాహనాల రద్దీ ఎక్కువ. అదే సమయంలో ఓపెన్ ప్లేస్ ఉండడంతో అక్కడక్కడ రోడ్డు పక్కన చిరువ్యాపారస్తులు దుకాణాలు ఏ ర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ప్రధాన రహ దారిపై రెయిన్‌బో ఆస్పత్రి వంశీరాం నిర్మాణ సంస్థలు రోడ్డుకు రెండు వైపులా ఉండడంతో ఇక్కడ ప్రైవేట్ వాహ నాల పార్కింగ్ రాత్రిపూట పనులు జరిగే వాహనాల పార్కి ంగ్ ఉదయం వరకు అలాగే ఉంటుంది. హైటెక్ సిటీకి వెళ్లే ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు నిద్రలేక లేదా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ అప్పుడ ప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. సోమవారం ఉదయం 5:40 గంట లకు బంజా రాహిల్స్ రోడ్‌నంబర్ 2లో రెయిన్‌బో దవాఖాన వద్ద ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘ టన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలా నికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డు అందుకున్న అలిశెట్టి

నవతెలంగాణ-బంజారాహిల్స్



కరోనా విలయతాండవం చేస్తున్నవేళ ఆకలితో అలమటిస్తున్న వారి కోసం వేదం ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహించిన అలిశెట్టి అరవింద్ ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ లెజెండరీ నేషనల్ అవా ర్డును అందుకున్నారు. ప్రపంచాన్ని పట్టి పీడించిన కరోనా సమయంలో ఉస్మానియా, గాంధీ నిమ్స్, ఎంఎన్జే క్యాన్సర్ ఆస్పత్రి, నీలోఫర్ ఆస్పత్రితో పాటు వివిధ ప్రాంతాలలో వేలాది మంది ఆకలి తీర్చడంతో అవార్డుకు ఎంపిక చేశారు. ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డుల ప్రదాన ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ నటుడు నిర్మాత మురళీమోహన్ అవార్డును అందజేశారు. సామాజిక సేవా విభాగంలో అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అరవింద్ అన్నారు.

గజ వాహనంపై శ్రీవారి ఊరేగింపు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హిమాయత్‌నగర్ లోని టిటిడి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం ఉదయం గజ వాహనం, శాంతి కల్యాణం ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని హిమాయత్‌నగర్ పురవీధుల్లో వేలాది మంది భక్తుల నడుమ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు బ్రహ్మోత్సవాల లోకల్ అడ్వైజరీ కమిటీ హైదరాబాద్ అధ్యక్షులు జి.వి భాస్కర్ రావు, ఉపాధ్యక్షులు వై.రవిప్రసాద్, కొమ్మిర వెంకట్ రెడ్డి, టిటిడి ఏఈఓ రమేష్ బాబు, కమిటీ సభ్యులు బి.వెంకటరమణ రెడ్డి తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ పాల్గొని, ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు అల్పాహారం, తాగునీరు వంటి వసతులు కల్పించారు.

మహిళా రెజ్లర్లపై దాడి అమానుషం



- పీఓడబ్ల్యు, పీడీఎస్‌యు, ఐఎఫ్‌టీయు నాయకులు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-అడిక్‌మెట్

న్యాయ పోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లపై దాడి చేసి, అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడాన్ని అమా నుషం అని పీఓడబ్ల్యు, పీడీఎస్ యు, ఐఎఫ్‌టియు నాయ కులు అన్నారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి ఓ డబ్ల్యు జాతీయ కన్వీనర్ వి సంధ్యక్క మాట్లాడుతూ 28 మే, 2023న న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనం సమీపాన రెజ్లర్ల నిరసన ప్రదర్శన జరుగుగుతున్న సందర్భంగా పోలీసులు రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ తదితరులపై దారుణంగా దాడిచేసి, అక్రమ నిర్బంధానికి గురిచేసి, కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జాతీయ రాజధాని నుండి పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది ఒలంపిక్-పథకాలు గెలు చుకున్న రెజ్లర్‌లను ఈడ్చుకెళ్లి నిర్బంధించినట్లు చూపుతున్న భయంకరమైన దృశ్యాలు దేశ ప్రజానీకానికి, మహిళా లోకానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళలలో ఆత్మ విశ్వాసాన్ని, క్రీడా స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు గురైన మహిళా మల్లయోధులు, మరికొందరు క్రీడాకారులు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయమని అడిగిన పాపానికి ఒలి ంపిక్ ఛాంపియన్స్ సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ తదితరు లును పార్లమెంటు భవనానికి కూతవేటు దూరంలో అరెస్టు చేశారు. పోలీసుల చేత దాడులకు, అరెస్టులకు గురయ్యారు అని తెలిపారు. బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ని అరెస్టు చేసి పార్లమెంట్ సభ్యత్వాన్ని, రాజకీయ ప్రాతినిధ్యంతో సహా అన్ని పదవుల నుండి అతనిని తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై జరిగిన లైంగిక వేధింపులపై సుప్రీం కోర్టు జడ్జ్ చే సమగ్ర న్యాయ విచారణ జరిపిం చా లి. మేరీ కోమ్ నివేదికను వెల్లడించి తగిన చర్యలు చేప ట్టా లి. పోరాడుతున్న మహిళా మల్ల యోధులకు రక్షణ కల్పిం చాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధ, పిఓడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ, బండారు విజయ, పిడిఎస్యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు, జిల్లా నాయకురాలు ధరణి, సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, ఝాన్సీ, సర్వేశ్, అశోక్, రేణుక పాల్గొన్నారు.

మహిళలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ



అంబర్‌పేట : తమకు న్యాయం చేయాలనీ ఢిల్లీలో శాంతి యుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా రెజ్ల ర్లపై క్రూరమైన బలప్రయోగం చేసి నిర్బంధించడం తీవ్రమైన మానవ హ క్కుల ఉల్లంఘన అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రె స్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఆగ్రహం వ్యక్తం చేసారు. హైదరాబాద్ తన కార్యాలయం నుండి సోమవారం ఒక ప్రక టనలో ప్రధాని మోడీ పాలనలో భారత దేశం నేడు మహి ళలకు అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా మారిందని రక్షించవలసిన పోలీసులే రాక్షసులుగా వ్యవహరిస్తున్నారని కోట నీలిమ మండిపడ్డారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ చర్యలు తీసుకోవాలని శాంతియుత ప్రదర్శనకా రులను అణిచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న ఢిల్లీ పోలీ సులు క్రూరంగా ప్రవర్తించి వారిని పట్టుకొని దుర్భాషలా డుతూ నిర్బంధించడం, హృదయ విదారకమైన దృశ్యలు చూసి మోడీ నియంతృత్వ పాలనా, అప్రజాస్వామిక సం స్కృతి అసలు రూపం బయటపడిందని ఆమె తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 36 రోజుల పాటు కొనసాగిన మహిళా రెజ్లర్ల నిరసనను మే 28న దారుణంగా అడ్డుకొని అణిచివేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలను అగౌరవపరిచే విధా నాలు అవలంబించడం కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో మహి ళలంతా ఏకమై ఓడించి తీరుతారని కోట నీలిమ హెచ్చరించారు.

'ప్రజల వద్దకే కార్పొరేటర్'కు విశేష స్పందన



- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రజల వద్దకే కార్పొరేటర్ కార్య క్రమానికి విశేష స్పందన లభిస్తుంది అని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రజల వద్దకే కార్పొరేటర్ కార్యక్ర మంలో భాగంగా గాంధీనగర్‌లోని అరుంధతి నగర్,సబర్మతి నగర్, అన్నా నగర్ బస్తీల్లో కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలోని ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీల్లో డ్రైనేజీ వ్యవస్థ కలుషిత మంచినీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సమస్య ఉన్న చోట త్వరలో పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. డివిజన్‌లో ఎక్కడ సమస్యలు వున్న వెంటనే తమ కార్యాలయం నెంబర్ 7799819991ను సంప్రదించాలని, ప్రజల వద్దకే కార్పొరేటర్" కార్యక్రమంలో నేరుగా తనను కలిసి సమస్యలను వివరిం చవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకు లు. వినయ్‌కుమార్, బీజేపీ నేతలు, మహమూద్, ఎం.ఉమేష్, నవీన్ కుమార్, సురేష్, రహమాత్ అలీ, కుమార్, డేవిడ్, ప్రశాంత్, బస్తీల నాయకులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు కారణాలు తెలపండి

- కరాటే కళ్యాణి..



నవతెలంగాణ-బంజారాహిల్స్

తాను ఎవరిని విమర్శించలేదని ఆయన తనకు సస్పెన్షన్ నోటీసు అలాగే మా అసోసియేషన్ నుండి సస్పెండ్ చేసే విధానం ఎందుకు జరిగిందో తెలియడం లేదని ప్రముఖ నాటి కరాటే కళ్యాణి ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచారు. ఆమె సస్పెన్షన్ సరైన విధానం కాదని ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ ఆదిపట్ల శ్రీ కళాపీఠం వారి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో రామచందర్ యాదవ హక్కుల పోరాట సమితి, భారత యాదవ హక్కుల పోరాట సమితి, హిందూ సంఘాలు, పెద్ద ఎత్తున మద్దతు తెలియజేస్తూ సినీ ప్రపంచంలో రాజకీయాలు చదవని ఎవరి అండతో ఈ సస్పెన్షన్ ప్రారంభించారో మా అసోసియేషన్ సభ్యులు మంచు విష్ణు తెలియజేయాలన్నారు. ఈ సస్పెన్షన్ వెనక్కు తీసుకుని ఆమెకు న్యాయం చేయాలని లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని యాదవ సంఘాలు వివిధ హిందూ సంఘాలు మా అసోసియేషన్ అధ్యక్షుడికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ జేఏసీ, యాదవ హక్కుల పోరాట సమితి, భారత యాదవ హక్కుల పోరాట సమితి, హిందూ సంఘాలు ఇతర మద్దతు దారులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసు కోవాలని ఇసామియ బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్నేహిక అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో ఆమె మా ట్లాడుతూ.. ప్రజలు ఎండకు బయటకు రావద్దని సూచించారు. దతమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజల ఇంటి వద్దకు తమ ఆశావర్కర్లు విటమిన్-ఏ,జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారన్నారు. ప్రజలు, చిన్నపిల్లలు ఎండకు వెళ్లకూడదని సూచించారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలి అని తెలిపారు. ఎండ వల్ల ప్రజలు డీ-హైడ్రే షన్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇంటింటికి వెళ్లి విటమిన్- ఏ మాత్రలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ఫ్లోరా. పి హెచ్ ఎన్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్తీలో విద్యుత్ అంతరాయాన్ని అరికట్టాలి



- సీఐటీయు నాయకులు మల్లేష్

నవతెలంగాణ-మెహిదీపట్నం

గుడిమల్కాపూర్ బుడగ జంగం బస్తీలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బస్తీ ప్రజలు బుడగ జంగం బస్తీ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాంపల్లి జోన్ కన్వీనర్ సి మల్లేష్ మాట్లాడుతూ గత 60 సంవత్సరా లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న బస్తీ వాసుల కోసం విద్యుత్ అధికా రులు ఏర్పాటు చేసిన ట్రాన్సాఫార్మర్ దగ్గర నీరు నిల్వ ఉంటుందనే కారణంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం సరైనది కాదని అన్నారు. నిన్నటి నుండి విద్యుత్తు ఉన్నత అధి కారులతో మాట్లాడడానికి ప్రయత్నించిన అధికారులు స్పందించకపో వడంతో బస్తీ వాసులు 24 గంటల పాటు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ట్రాన్సాఫార్మర్ దగ్గర బస్తీలో నుండి డ్రైనేజీ వాటర్ వచ్చి అక్కడ నిల్వ ఉండడం తో షాట్ సర్క్యూట్ జరుగుతుందని జీహెచ్‌ఎంసి అధికారులు బస్తీలో డ్రైనేజీల్ పైప్ లైన్లను ఏర్పాటు చేసి బస్తీలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. బుడగ జంగం బస్తీలో ఉన్నటువంటి కుటుంబాలలో ఎక్కువ మంది స్వచ్ఛ ఆటో కార్మికులుగా పనిచేస్తున్నారని హైదరాబాద్ నగరాన్ని చెత్త కుప్పలు లేకుండా చేసేటువంటి వృత్తిలో ఉన్న ఈ కార్మికులకు ప్రభుత్వం సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వాధికారుల పైన ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే డ్రైనేజీ పైప్ లైన్ ను అట్లాగే ట్రాన్స్ఫార్మర్ దగ్గర రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కూకట్ పల్లి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, సెక్టార్ ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ,ఎల్లమ్మబండ పరిధిలోని జయనగర్ ఎల్లమ్మ చెరువులో ,సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహం ఒంటి మీద బ్లూ కలర్ షర్ట్ ,బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, వైట్ కలర్ హాఫ్ బనియన్,ధరించి ఉన్నాడు. అలాగే కుడి చేతి పైన తెలుగులో బాబా శాదుల్లా అనే టాటు ఉంది.



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని, 131 డివిజన్ పరిధిలో "ప్రగతి యాత్ర" లో భాగంగా 71వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్ లలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ తో కలిసి పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ మేరకు రోడ్డు ప్యాచ్‌వర్క్‌ల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న అధికారులకు అందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాపయ్య యాదవ్ నగర్ లో 100% అన్ని పనులు పూర్తయిన నేపథ్యంలో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి ,సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య , యాదవ్ రెడ్డి , రమణ రావు, పాపిరెడ్డి ,వీరేందర్ రెడ్డి , రాజన్న , అయుబ్, పాల్గొన్నారు.



పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రయివేటు వసతి గృహాలు

- దుండిగల్ మున్సిపల్ పరిధిలో సుమారు 100 వరకు ప్రయివేటు హాస్టళ్లు
- లైసెన్స్ తీసుకున్న దాఖలాలు లేని వైనం అధికారుల, సిబ్బంది అలసత్యంపై ప్రజలు ఆగ్రహం
- సంవత్సరాలుగా మున్సిపల్ ఆదాయానికి కోట్ల రూపాయల్లో గండి



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వల్ల ఉమ్మడి కుత్బుల్లాపూర్ గ్రామపంచాయతీల స్థలాలకు ధరలకు రెక్కలు వచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా గండి మైసమ్మ ప్రాంతం ప్రధాన కేంద్రంగా మారడం, చుట్టుపక్క ఇండస్ట్రియల్ తోపాటు ఈ ప్రాంతాలకు ఉపాధి కోసం వచ్చే ప్రజలకు, చుట్టుప్రక్కల అనేక కళాశాలలకు ఈ ప్రాంతం ప్రధాన బిందువుగా ఏర్పాటయింది. ఈ క్రమంలో దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలో వందల సంఖ్యలో విద్యార్థుల కోసం వసతి గృహాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అయితే ఈ హాస్టళ్లు అనుమతులు లేకుండానే నడుస్తున్నాయని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

కొంత బహదూర్ పల్లి కాగా, డి పోచంపల్లి, ప్రాంతాల్లో వీధికొక 2 ,,3 హాస్టల్ కనిపిస్తుంటాయి. ఏ ఒక్క హాస్టల్ కు పుర పాలక సంఘం నుంచి వ్యాపార లైసెన్సులు లేవని ఆరోపణలు ఉన్నాయి. వసతి గృహాల ఏర్పాటుకు తప్పనిసరిగా మునిసిపల్ వ్యాపార అనుమతులు, సంబంధిత పోలీస్ స్టేషన్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ, మున్సిపల్ హెల్త్ ఇన్స్పెక్టర్ అనుమతులు, ఆ భవనానికి సంబంధించి బిల్డింగ్ నిర్మాణ అనుమతులు ఉండాలి. వేరొకరు నిర్వహిస్తున్నట్లయితే రెంటల్ అగ్రిమెంట్‌ల అన్ని నిబంధనలలతో నిర్వహించాలి. ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా ఉందని తెలుస్తోంది. ఏండ్ల తరబడి ప్రతివసతి గృహాలకు లైసెన్సులు, రెన్యువళ్లు చేయలేక పోవడంతో ఒక్కో బిల్డింగు గృహానికి సుమారు 70 వేల అపరాధ రుసుముతో చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి వసతి గృహాలు 100 వరకు దుండిగల్ మున్సిపల్ పరిధిలో ఉండడంతో మున్సిపల్ ఆధాయానికి గండి పడుతోందని విమర్శలు వస్తున్నాయి. వారి వద్ద నుంచి లైసెన్స్ రుసుము వసూలు చేయలేని మున్సిపల్ అధికారుల, సిబ్బంది స్వప్రయోజనాలు అలసత్యంతో కోట్ల రూపాయల ఆదాయం గండి పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే చర్యలు చేపట్టి హాస్టల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తున్నామని మున్సిపల్ సిబ్బంది తెలియజేస్తున్నారు.

వసతి గృహాల యాజమాన్యాలు మాత్రం ఒక భవనంలో ఐదు ఫ్లోర్లు అద్దెలకిస్తూ, దాదాపు రూ. 5,000 వరకు ఒక్కొక్కరి వద్ద వసూలు చేస్తూ ఆ భవనంలో అరకొర వసతులతో ఎటువంటి నిబంధనలు పాటించకుండా, మున్సిపల్ లైసెన్స్ అనుమతులు తీసుకోకపోవడంతో వారి వ్యాపారాలు మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. ప్రజల సౌలభ్యం కోసం మున్సిపాల్టీలు కొత్తగా ఏర్పాటు చేసినా విధులు నిర్వహించే అధికారులు అన్ని విభాగాల్లో లేకపోవడంతో ఏమి చేయలేకపోతున్నామని కొందరు చెబుతూ దాటవేసే ధోరణితో పై అధికారులు వ్యవహరిస్తున్నారు. దుండిగల్ మున్సిపాల్టీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఫుడ్ ఇన్స్పెక్టర్ లేకపోవడం, అలాగే ఇతర విభాగాల్లో టౌన్ ప్లానింగ్ బిల్ కలెక్టర్లు అకౌంట్స్ ఇలా అధికారుల సీట్ల ఖాళీ ఏర్పడడంతో సిబ్బంది చర్యలు చేపట్టకపో వడంతో మున్సిపాలిటీ పరిధిలో అనేకచోట్ల నిబంధనలు పాటించని వసతి గృహాలు ఏర్పడుతున్నాయని విమర్శలు అనేకం వస్తున్నాయి.

వసతి గృహాలు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు. విద్యార్థుల తీరుతెన్నుపై కూడా తల్లిదండ్రుల బాధ్యత సైతం తీసుకోవాలని. ఇటీవల కొన్ని కొన్ని హాస్టల్లో జరుగుతున్న సంఘటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా

- జూన్ 4న కొత్తగూడెంలో లక్షమంది కార్యకర్తలతో ఎర్ర కవాతు
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ .ఉమా మహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా భరోసా ఇస్తుందని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ .మహేష్ అన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే "ప్రజగర్జన"కు లక్షమంది సీపీఐ కార్యకర్తలతో ఎర్ర కవాత్తు నిర్వహిస్తున్నామని, సీపీఐ కుత్బుల్లాపూర్ మండలంలో ఉన్న కార్యకర్తలు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద "చలో కొత్తగూడెం" పోస్టర్ ను ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి తమను గెలిపించండి అని చెపుతూ ప్రజలను మోసం చేయడానికి అనేక పేర్లతో సభలను నిర్వహిస్తూ అబద్ధపు ప్రచారాలను చేస్తున్నాయని ప్రజలను అప్రమత్తం చెయ్యడానికి చైతన్యవంతం చేసి ఈ సారి కమ్యూనిస్టులు కూడా అత్యధిక స్థానాల్లో పోటీచెయ్యడానికి సన్నద్ధం చెయ్యడానికి ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు అందుకు సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు . బీజేపీ ప్రభుత్వం, మోడీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేశారో చెప్పకుండా ఇతర పార్టీల గురించి, మతాల గురించి, శత్రు దేశాల గురించి, దేవుడు పేరుతో ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు కావాల్సింది విద్య,వైద్యం, ఉద్యోగం,ఉద్యోగ భద్రత అని వీటి గురించి మాట్లాడని పార్టీలను రాబోవు ఎన్నికల్లో చిత్తుగా ఓడగొట్టడానికి సీపీఐ గా పని చెయ్యాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ కార్యదర్శి ఎస్. స్వామి, హరినాథ్ రావు,ప్రజానాట్యమండలి కార్యదర్శి ప్రవీన్,మండల కోశాధికారి సదానంద్, మున్సిపల్ అధ్యక్షులు రాములు,సీపీఐ నాయకులు సహదేవ్ రెడ్డి, వంగాల శ్రీనివాస్, జార్జ్, ఖాయమ్, పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజల విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. షాపూర్ నగర్ లోని శుభం కన్వెన్షన్ లో ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సోమవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 20 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో ప్రభుత్వ విభాగానికి సంబంధించిన ప్రత్యేక అంశాలున్న నేపథ్యంలో ఏ రోజుకు ఏ కార్యక్రమం చేపట్టాలో ఈ సన్నాహగా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత పాలకుల హయాంలో పరిస్థితి తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతర పరిస్థితిని కనులకు కట్టే విధంగా ప్రజలకు వివరించడానికి ఆయా ప్రభుత్వ విభాగాలు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇందుకు సిద్ధంగా ఉండి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ సన్నాహక సమావేశంలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మమత, నిజాంపేట్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, ఏసీపీలో గంగారం, డిప్యూటీ కమిషనర్లు మంగతాయారు, మున్సిపాలిటీల కమిషనర్లు సత్యనారాయణ, రామకృష్ణారావు, శ్రీహరి ఎమ్మార్వోలు సంజీవరావు, ఎంఈఓ ఆంజనేయులు మరియు హెచ్ఎండబ్ల్యూటీఎస్ ఐబిసి, ఇరిగేషన్ యుసిడి , సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

ఎస్టీపీ పనులు 80శాతం పూర్తి

- ఫతే నగర్ ఎస్టీపీని సందర్శించిన ఎండీ దానకిశోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



జలమండలి ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ-3లో భాగంగా నిర్మిస్తున్న ఫతేనగర్ మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఎండీ దాన కిశోర్ సోమ వారం సందర్శిం చారు. ఐఎన్డీ, ఇన్‌లెట్ తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్టీపీ పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఇప్పటికే ఎస్బీఆర్, సీసీటీ, సివిల్ పనులు పూర్తి చేసుకుని, యంత్రాలను బిగింపు పనులు మొదలయ్యాయన్నారు. ఐఎన్డీ, బ్లోయర్ రూమ్, పీటీయూ తదితర నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని వివరించారు. ఎస్టీపీ ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం, పచ్చదనం కోసం గార్డెనింగ్, అవసరమైన మొక్కలు నాటాలని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలో పనులు 100 శాతం పూర్తి చేసి ఆగస్టులో అందుబాటులోకి తీసుకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీ సీజీఎం, అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడుతున్న పలువురికి రిమాండ్

- కంట్రీమ్ మేడ్ పిస్తోల్, 5 రౌండ్ల బుల్లెట్లు, కత్తులు స్వాధీనం
- సమావేశంలో బాలానగర్ ఏసీపీ గంగారాం వెల్లడి



నవతెలంగాణ-బాలానగర్

పాత కక్షలను మనసులో పెట్టుకుని తన అన్నను చంపిన వ్యక్తులను చంపేందుకు ప్రయత్నిస్తున్న రెండు గ్యాంగులను బాలానగర్ ఎస్ఓటీ, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అదుపులోనికి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గంగారాం వివరాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాజేష్ సమాచారం మేరకు నిందితుల వద్ద నుండి కంట్రీ మేడ్ పిస్టల్ తోపాటు,5 రౌండ్ల బుల్లెట్స్, బొమ్మ తుపాకీ, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు బాలానగర్ ఏసీపీ గంగారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 2021 లో నవాజ్ అనే వ్యక్తిని హత్య చేసిన లెనిన్ నగర్ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్, మహమ్మద్ ఖలీద్ పటేల్, తెల్ల శ్రీకాంత్, గిరినగర్ ప్రాంతానికి చెందిన రోహిత్ సింగ్ ల పై మృతుడి తమ్ముడు ఆయాజ్ కక్ష పెంచుకుని హత్య చేసేందుకు ప్రయత్నించడంతో పాటు గ్యాంగ్‌లుగా విడిపోయి దాడులకు పాల్పడేందుకు యత్నిస్తున్నారన్న పక్క సమాచారంతో తనిఖీలు చేపట్టి 2 గ్యాంగ్ లను అతి చాకచక్యంగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో మృతుడు నవాజ్ తమ్ముడు ఆయాజ్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలియజేశారు. గతంలో జగద్గిరిగుట్ట, బాలానగర్ పోలీస్ స్టేషన్లలో నిందితుల పై పలు కేసులు ఉన్న నేపథ్యంలో వారి పై పీడీ యాక్ట్ నమోదుకు సిఫార్స్ చేస్తామని ఏసీపీ గంగారాం తెలిపారు.

కూకట్‌పల్లి అసెంబ్లీ ఏ బ్లాక్ ఎస్సీ కన్వీనర్‌గా చింతల ప్రకాష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కాంగ్రెస్ కూకట్‌పల్లి అసెంబ్లీ ఏ బ్లాక్ ఎస్సీ విభాగం కన్వీనర్ గా బాలానగర్ ప్రాంతానికి చెందిన చింతల ప్రకాష్ నియమితులయ్యారు. ఈమేరకు సోమ వారం మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్ ఆధ్వర్యంలో చైర్మెన్ బంధిగ బాల నరసింహా నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా చింతల ప్రకాష్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా నాయకత్వం ఎంతో నాపై నమ్మకంతో పార్టీ సేవలను ఉపయోగించడానికి బరువు బాధ్యతలు నా భుజస్కంధాలపై ఉంచినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు క్రమశిక్షణతో అధికార పార్టీ వ్యతిరేక విధానాలపై పోరాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, ప్రజాభిప్రాయం మేరకు స్థానిక సమస్యలపై పోరాడు తానని ప్రకాష్ హామీ ఇచ్చారు. పదవి విషయంలో కృషి చేసిన వారికి పేరుపేరునా ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మెన్ మధుమోహన్, కన్వీనర్ ముకేందర్, చంద్ర కాంత్, దివాకర్, భారతీ వర్ధన్, వరుణ్ తేజ్(ట్రైనీ) పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో ఉన్నటువంటి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం సోమవారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ నూతన చైర్మెన్‌గా కెపి రాములు సాగర్, అధ్యక్షులుగా జలగం చలపతిరావు, గౌరవ అధ్యక్షులుగా ఏ వెంకట స్వామి సాగర్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ హనుమంతరావు, కోశాధికారిగా కల్లేపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా జీఎస్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఆర్కే దయాసాగర్, ధర్మసాగర్, కార్యదర్శిగా పి ఎల్లారెడ్డి జి వెంకటేష్ సిహెచ్ శ్రీనివాస్ సాగర్, ఏ శ్రీనివాస్ సాగర్ కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఎమ్మెస్ భీమయ్య, సురేష్ కుమార్ గౌరవ సలహాదారులుగా జి భీమయ్య సాగర్, కార్యవర్గ సభ్యులుగా ఆర్ స్వరూప, ఏపీ సంజీవ్ సాగర్ రామచందర్, జి శ్రీనివాస్ సాగర్, తదితరులు ప్రమాణస్వీకారం చేశారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డ్, పింఛన్ల కొరకు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీహెచ్ఎంసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, రేషన్ కార్డులు లేని పేద కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని , వృద్దులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పింఛన్లు వెంటనే అర్హులైన అందరికీ ఇప్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు కొల్లి మాధవి , మూగ జయశ్రీ, బీజేపీ రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆలే భాస్కర్ , బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు హరీష్ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ,బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్, బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కట్ట కుమార్, కార్య కర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 16 వేల కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశాం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ - కూకట్ పల్లి

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నారు అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.సోమవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో 53 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని, నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీసుకుంటున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే దేశంలో పేర్లు మార్చి పెడుతున్నారని అన్నారు. నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహా నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఇప్పటివరకు కూకట్ పల్లి నియోజకవర్గంలో దాదాపు 16,000 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు అందించామని తెలిపారు.

ఘనంగా విజితరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట:

బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు అంబర్ పేట 6నెం.పార్టీ ఆఫీస్‌లో సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి విజితరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్ , సీనియర్ యువ నాయకులు నగేష్ గౌడ్, జీవన్ గౌడ్, జనార్ధన్, రాహుల్, బాబా గౌస్ పాషా, దిలీప్ కుమార్, చం దర్ చారీ,దయానంద్, ప్రకాష్‌రెడ్డి, ఖైయుం, ఖలేదు, వెంకటమ్మ సూర్యలక్ష్మి, లక్ష్మి, అండాలు పాల్గొన్నారు.

జోగి కులస్తుల సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్ర జోగి కుల సంఘం డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్రంలో జోగి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర జోగి కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్ మీర్‌పేట్‌లోని కనకదుర్గ కన్వెన్షన్ హాల్‌లో ఆ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎమ్మెస్ నరహరి, జనరల్ సెక్రటరీ జోగి వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, చౌదరి నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రవణ్ కుమార్, శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలు జె.శ్రీనివాస్, చింతకింది నారాయణ, బాలకృష్ణ, రాజు, ఫైనాన్స్ సెక్రటరీ శ్రీహరి ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ జోగి కులస్తులు వంశపార్యపరంగా వన మూలికలను గుర్తిస్తూ సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. జోగి కులస్తుల వృత్తి దెబ్బతినకుండా, వనమూలికలు అంతరించిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించి వనమూలికల చెట్లను పెంచాలని డిమాండ్ చేశారు. త్వరలోనే స్టేట్ ఎగ్జిక్యూటివ్ బాడీతో పాటు జిల్లా మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఎన్నికల అధికారులుగా పి.శ్రీనివాస్, కె.మల్లప్ప, మల్లికార్జున్, శ్యాంసుందర్, జి.శ్రీనివాస్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం, చర్చలు, పలు తీర్మానాలు చేసి ఆమోదించుకున్నారు.

క్రీడా ప్రాంగణంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



తెలంగాణ క్రీడ సంబరాలు సీఎం కప్- 2023 క్రీడలను ఎల్బీ స్టేడియంలోని బాక్సింగ్ క్రీడ ప్రాంగణంలో హైదరాబాద్ జిల్లా డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు కింగ్ కోఠి క్లస్టర్ వైద్య అధికారులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆర్‌బిఎస్ కే డాక్టర్ వసంత క్రీడాకారులు అస్వస్థకు లోనైతే వెంటనే వైద్యం చేసి మం దులు అందిస్తున్నారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు జ్యోతి. కమల తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- జేటీసీ పాండు రంగ నాయక్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ ఆర్టీఏకు వచ్చే వినియోగదారులతో పాటు చుట్టు పక్కల ఉన్న ప్రజలు కంటి పరీక్షలు చేయించుకొని, ఉచితంగా మందులు పొందాలని సూచించారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు.క్యాంప్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాలిని మాట్లాడుతూ కంటి వెలుగులో భాగంగా మొదటి రోజు 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 30 మందికి ఐ డ్రాప్స్, 25 మంది అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తామని, 20రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఎల్.రాంచందర్, ఎంవీఐ శ్రీనుబాబు, ఏవో శ్రీనివాస్ రావు, కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పెండింగ్ పనులపై మేయర్ కు వినతి

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. పలు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం సుమారు రూ. 4 కోట్ల 44 లక్షల మేర నిధులు కావాలని ఆమె మేయర్ దష్టికి తీసుకెళ్లారు. అలాగే డివిజన్లకు కావలసిన అండర్ గ్రౌండ్ డ్రయినేజ్ నిర్మాణం పనులు, నాలా రీసెల్లింగ్ పనులను కేటాయించేందుకు తన సంపూర్ణ సహకారం అందజేస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

చెన్నై పాంచ్ పటాకా



అట్టహాసంగా సిఎం కప్ ఆరంభ వేడుక

సిఎం కప్‌తో గ్రామీణ ప్రతిభకు పట్టం



నవతెలంగాణ-హైదరాబాద్

సిఎం కప్ 2023 టోర్నీతో యువత చాంపియన్లుగా నిలిచే సువర్ణావకాశం లభించిందని, మూడు అంచెల్లో జరిగిన సిఎం కప్ పోటీలతో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు పట్టం కట్టామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. శాట్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి నిర్వహిస్తున్న సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల ఆరంభ వేడుకలు సోమవారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగాయి. 33 జిల్లాల నుంచి 7500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, అధికారులు ఆరంభ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో 33 జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌లో ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడాకారులను విశేషంగా అలరించాయి. తెలంగాణ జానపదాలకు క్రీడాకారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తెలంగాణ క్రీడా ప్రగతి, ఘన కీర్తి చాటుతూ సాగిన పాటకు సంప్రదాయ నృత్య కళాకారుల ప్రదర్శన ఆరంభ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

అధికారికంగా ఆరంభం : సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారమే లాంఛనంగా ఆరంభమయ్యాయి. శనివారమే జిల్లాల నుంచి క్రీడాకారులు హైదరాబాద్‌కు చేరుకోగా.. ఆదివారం ఉదయం సెషన్లో డ్రా, సాయంత్ర సెషన్లో పోటీలు ప్రారంభించారు. సోమవారం ఉదయం సెషన్లో సైతం పోటీలు జరిగాయి. సాయంత్రం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఆరంభ వేడుకలకు ఆరు స్టేడియాల్లో పోటీపడుతున్న క్రీడాకారులు తరలి వచ్చారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలను అధికారికంగా ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కార్పోరేషన్ల చైర్మెన్లు, శాట్స్ ఉన్నతాధికారులు, కోచ్‌లు తదితరులు హాజరయ్యారు.

- ఐపీఎల్ 16 టైటిల్ సూపర్‌కింగ్స్ సొంతం
- ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠ విజయం
- డిఫెండింగ్ చాంపియన్‌కు తప్పని ఓటమి



నవతెలంగాణ-అహ్మదాబాద్

చెన్నై సూపర్‌కింగ్స్ ఐదేసింది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌పై ఐదు వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించి ఐపీఎల్‌లో ఐదో ట్రోఫీ (2010, 2011, 2018, 2021, 2023) సొంతం చేసుకుంది. వర్షం కారణంగా 15 ఓవర్లలో 171 పరుగులకు కుదించిన లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ అదరగొట్టింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (47, 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (26, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శివం దూబె (32 నాటౌట్, 21 బంతుల్లో 2 సిక్స్‌లు), అజింక్య రహానె (27, 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అంబటి రాయుడు (19, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) సమిష్టిగా రాణించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ టైటిల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించింది. చివరి రెండు బంతులకు పది పరుగులు అవసరం కాగా.. రవీంద్ర జడేజా వరుసగా 6, 4 బాది సూపర్‌కింగ్స్‌కు సంచలన విజయాన్ని అందించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (96, 47 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (54, 39 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో రాణించాడు.

ఆద్యంతం ఉత్కంఠ

215 పరుగుల లక్ష్యంతో బరిలోకి చెన్నై 0.3 ఓవర్లలో 4/0తో ఉండగా వర్షం ఆటంకం కలిగించింది. అర్థరాత్రి 12.10 గంటలకు ఆట ఆరంభం కాగా చెన్నై లక్ష్యాన్ని 15 ఓవర్లలో 171 పరుగులుగా నిర్దేశించారు. పది వికెట్లు చేతిలో ఉండటంతో చెన్నై ఎదురుదాడి చేసింది. ఓపెనర్లు కాన్వే, రుతురాజ్ తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించారు. రహానె, దూబె కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సరైన సమయంలో సిక్సర్లు సంధించి సాధించాల్సిన రన్‌రేట్‌ను అందుబాటులో ఉంచారు. అంబటి రాయుడు (19) మోహిత్ శర్మ ఓవర్లో వరుసగా 6, 4,6 బాదటంతో మ్యాచ్ చెన్నై వశమైందనిపించింది!. కానీ ఆ తర్వాత వరుస బంతుల్లో రాయుడు, ధోని (0) నిష్క్రమణతో టైటాన్స్ రేసులోకి వచ్చింది. చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా.. నాలుగు బంతుల్లో మోహిత్ శర్మ 3 పరుగులే ఇచ్చాడు. చివరి రెండు బంతులను సిక్సర్, ఫోర్‌గా మలిచిన రవీంద్ర జడేజా చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఐదో ఐపీఎల్ టైటిల్ అందించాడు. టైటాన్స్ బౌలర్లలో నూర్ అహ్మద్ (2/17), మోహిత్ శర్మ (3/36) రాణించారు.

సుదర్శన్ మెరుపుల్

తొలుత బ్యాటింగ్ చేసిన టైటాన్స్ భారీ స్కోరు చేసింది. చెన్నై ఫీల్డింగ్ తప్పిదాలను టైటాన్స్ గొప్పగా సద్వినియోగం చేసుకుంది. ఓపెనర్లు సాహా (54), గిల్ (39) శుభారంభం అందించారు. సాయి సుదర్శన్ (96) తుది పోరులో అదిరే ఇన్నింగ్స్ ఆడాడు. ఆరు సిక్స్‌లు, ఎనిమిది ఫోర్లతో 47 బంతుల్లోనే 96 పరుగులు పిండుకున్నాడు. 33 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన సాయి సుదర్శన్.. డెత్ ఓవర్లలో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కెప్టెన్ పాండ్య (21 నాటౌట్) సైతం ఆకట్టుకున్నాడు.

స్కోరు వివరాలు :

గుజరాత్ టైటాన్స్ : 214/4 (సుదర్శన్ 96, వృద్ధిమాన్ 54, గిల్ 39, పతిరణ 2/44)

చెన్నై సూపర్‌కింగ్స్ : 171/5 (కాన్వే 47, దూబె 32, రహానె 27, జడేజా 15, నూర్ అహ్మద్ 2/17)

పిసిబితో ఐసిసి దౌత్యం!

నేడు కరాచీలో క్రికెట్ పెద్దల సమావేశం

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసిసి) రానున్న వన్డే వరల్డ్‌కప్‌పై నెలకొన్న సందిగ్ధతకు తెరదించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. భారత్‌లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో పాల్గొనబోమని ఇటీవల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) చైర్మెన్ నజం సేథి వ్యాఖ్యానించగా.. ఐసీసీ ఉన్నతాధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమయ్యారు. ఐసీసీ చైర్మెన్ గ్రెగ్ బార్క్లే, సీఈవో జెఫ్ అలార్డైస్‌లు రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం కరాచీకి చేరుకోనున్నారు. 2023 ఆసియా కప్ నిర్వహణపై కొనసాగుతున్న సందిగ్ధత.. వన్డే వరల్డ్‌కప్‌పై ప్రభావం చూపుతుంది. ఆసియా కప్ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వద్ద ఉన్నాయి. భద్రత, ద్వైపాక్షిక సంబంధాల కారణంగా భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించదని బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టం చేశారు. ఆసియా కప్‌తో ప్రసార, టికెట్ సొమ్ము ఖాతాలో వేసుకునేందుకు ఎదురుచూస్తున్న పిసిబి.. పాక్ గడ్డపై లీగ్ దశ మ్యాచులైనా నిర్వహించాలనే పట్టుదల చూపిస్తుంది. అందుకు హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదన ముందుకు తీసుకొచ్చింది. భారత జట్టు ఆడే మ్యాచులను పాక్ ఆవల నిర్వహించటం, మిగతా మ్యాచ్‌లను పాకిస్థాన్‌లో జరుపటం. రెండోది.. భారత్ మినహా ఇతర జట్లు ఆడే లీగ్ దశ మ్యాచులను పాకిస్థాన్‌లో నిర్వహించి.. భారత మ్యాచులు, ఫైనల్‌ను తటస్థ వేదికపై ఏర్పాటు చేయటం. ఇందులో తొలి ప్రతిపాదన ఇప్పటికే తిరస్కారానికి గురైంది. రెండో ప్రతిపాదనపై ఇటీవల అహ్మదాబాద్‌లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశంలో బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, శ్రీలంక క్రికెట్ బోర్డులతో జై షా చర్చించారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఆసియా కప్ కోసం భారత జట్టు పాక్ పర్యటనకు నిరాకరించటంతో.. వరల్డ్ కప్ కోసం పాకిస్థాన్ జట్టు సైతం భారత పర్యటనకు రాబోదని పిసిబి పేచి పెట్టింది. ఈ విషయంలో పిసిబి పెద్దలతో చర్చలు జరిపేందుకు ఐసీసీ చైర్మెన్, సీఈవో నేడు కరాచీని రానున్నారు. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ సొంతం చేసుకుంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ జట్టు భారత్‌కు వస్తే.. ప్రతిఫలంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టును పాకిస్థాన్‌కు రప్పిస్తామనే హామీ ఐసీసీ నుంచి లభించే అవకాశం కనిపిస్తోంది. ఆసియా కప్ షెడ్యూల్ ఈ వారంలో వెలువడే అవకాశం ఉండగా.. వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్, వేదికల వివరాలను జూన్ 7-11న ప్రకటించనున్నారు.

ప్రాక్టీస్ మొదలెట్టారు!

- కోహ్లి, సిరాజ్, ఉమేశ్, అశ్విన్ సాధన
- ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్



లండన్ : ప్రతిష్టాత్మక ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కోసం భారత క్రికెటర్లు ప్రాక్టీస్ ప్రారంభించారు. రెండు విడతలుగా ఇంగ్లాండ్‌కు చేరుకున్న భారత క్రికెటర్లు.. అంతిమ సమరం సన్నాహక బరిలోకి దిగారు. విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్, రవిచంద్రన్ అశ్విన్, జయదేవ్ ఉనద్కత్, ఉమేశ్ యాదవ్ సహా కెప్టెన్ రోహిత్ శర్మ రెండో విడత బృందంలో లండన్‌లో కాలుమోపారు. విరాట్ కోహ్లి, జైస్వాల్, అశ్విన్, ఉనద్కత్, ఉమేశ్ యాదవ్‌లు సోమవారమే గ్రౌండ్‌లోకి అడుగుపెట్టగా.. నాయకుడు రోహిత్ శర్మ మంగళవారం నుంచి బ్యాట్ పట్టనున్నాడు. భారత క్రికెటర్లు ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది.

కోహ్లి జోష్ : భారత క్రికెట్ శిబిరంలో విరాట్ కోహ్లి జోష్ వచ్చింది. రెండేండ్ల క్రితం ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో కోహ్లి నాయకత్వంలో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిన టీమ్ ఇండియా.. నేడు విరాట్ బ్యాటింగ్ సారథ్యంలో మరోసారి ఐసీసీ టెస్టు గదపై కన్నేసింది. కిట్‌తో అరుండెల్ క్యాసిల్ క్రికెట్ క్లబ్‌కు వచ్చిన విరాట్ కోహ్లి.. టెస్టు స్పెషలిస్ట్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి కఠోరంగా బ్యాటింగ్ చేశాడు. ఇషాన్ కిషన్, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్‌లు రెగ్యులర్ కసరత్తులు పూర్తి చేసుకుని బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ ఆటగాళ్లతో సుదీర్ఘంగా మాట్లాడుతూ కనిపించారు.

నో వార్మప్ గేమ్ : 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ పోరుకు ముందు ఇటు భారత జట్టుకు, అటు ఆస్ట్రేలియా జట్టుకు ఎటువంటి వార్మప్ మ్యాచులు షెడ్యూల్ చేయలేదు. భారత్, ఆస్ట్రేలియాలు టెస్టు క్రికెట్ అంతిమ సమరం కోసం ఇంగ్లాండ్‌లో అడుగుపెట్టినా.. వార్మప్ మ్యాచులు ఏర్పాటు చేసే బాధ్యత ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసిబి)పై లేదు. ద్వైపాక్షిక సిరీస్‌కు రాకపోవటంతో ఈసిబి వార్మప్ మ్యాచ్‌లపై దృష్టి నిలపలేదు. మరోవైపు ఇంగ్లీష్ కౌంటీ సీజన్ జోరుగా సాగుతున్న దశలో వార్మప్ మ్యాచుల ఏర్పాటు సైతం కష్టసాధ్యమే!. ఆతిథ్య బాధ్యతల దృష్ట్యా ఇరు జట్ల ప్రాక్టీస్‌కు ఈసిబి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

స్టేడియం ఫుల్! : టెస్టు క్రికెట్ అంతిమ సమరానికి లండన్‌లోని ది ఓవల్ మైదానం నిండిపోతుందని ఐసిసి అంచనా వేస్తోంది. ఐదు రోజుల అల్టిమేట్ టెస్టుకు ఓ రోజు అదనంగా రిజర్వ్ చేశారు. వాతావరణ సమస్యలతో నష్టపోయిన ఆటను రిజర్వ్ డే రోజు కొనసాగించే వీలుంటుంది. టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు కనీసం నాలుగు రోజుల పాటు స్టేడియం నిండుకుండలా ఉంటుందని ఐసిసి భావిస్తోంది. 'ప్రపంచ క్రికెట్‌లో రెండు అగ్ర జట్లు పోటీపడుతున్నాయి. రానున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లు సైతం ఇదే ఫార్మాట్‌లో కొనసాగుతాయి. భారత్, ఆస్ట్రేలియా తలపడే టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అభిమానుల నుంచి అపూర్వ స్పందన ఉంటుందని అంచనా వేస్తున్నాం. అందుకోసం ఈసిబితో కలిసి సరైన దిశగా అడుగులు వేస్తున్నామని' ఐసిసి ఓ ప్రకటనలో తెలిపింది.



ప్రభాస్, కృతిసనన్

రామ్ సీతా రామ్..

ప్రభాస్, కృతిసనన్ సీతారాములుగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సినిమా 'ఆదిపురుష్'. ఈ చిత్రం నుంచి సీతారాముల ప్రేమలోని గాఢతను తెలియజేసే 'రామ్ సీతా రామ్' మెలోడియస్ సాంగ్ పూర్తి ట్రాక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. సచేత్-పరంపర స్వరపరచిన ఈ పాట మధురమైన స్వరాలతో నెమ్మదిగా సాగుతూ హృదయాలను తాకేలా ఉంది. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం.. సీతారాముల మధ్య పంచుకున్న లోతైన అనుబంధాన్ని స్పష్టంగా చిత్రీకరిస్తుంది. మంత్రముగ్ధులను చేసే సంగీతం, శ్రావ్యమైన గాత్రాలు, సీతమ్మ, రామయ్య మధ్య సాగే అనుబంధాల విజువల్ ట్రీట్ వెరసి.. ఈ పాట అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ఈ చిత్రం జూన్ 16న విశ్వ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం : సచేత్-పరంపర, నిర్మాతలు : టి సిరీస్ భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్, దర్శకత్వం : ఓమ్ రౌత్



సాయిధరమ్ తేజ్ పవన్‌కళ్యాణ్

నవచిత్రం

స్టూడెంట్స్ పవర్ తెలిపే సినిమా

సాయిచరణ్, పల్లవి జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'ఐక్యూ'. 'పవర్ ఆఫ్ ద స్టూడెంట్' అనేది ఉపశీర్షిక. జీఎల్‌బి శ్రీనివాస్ దర్శకుడు. కె.ఎల్.పి మూవీస్ పతాకంపై కాయగూరల లక్ష్మీపతి నిర్మిస్తున్నారు. బాలకృష్ణ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.




బాలకృష్ణతో 'ఐక్యూ' చిత్ర బృందం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చక్కని సందేశంతో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతం కావాలి. నిర్మాతకు మంచి పేరు, లాభాలు తీసుకురావాలి' అని అన్నారు. 'స్టూడెంట్ పవర్ అంటే ఏంటో చెప్పే చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ, 'చక్కని కథతో సాగే చిత్రమిది. స్టూడెంట్స్ తలచుకుంటే ఏమైనా చేయగలరు అనే ఇతివృత్తంతో దర్శకుడు చక్కగా తెరకెక్కించారు. బాలకృష్ణ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కావడం చాలా ఆనందంగా ఉంది. జూన్ 2న సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం' అని అన్నారు.

యూనిక్ లవ్‌స్టోరీ

హీరో సిద్ధార్థ్ త్వరలో 'టక్కర్' అనే సినిమాతో సరికొత్తగా అలరించనున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ జి.క్రిష్ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్ర ప్రొమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సహనిర్మాత వివేక్ కూచిబొట్ల మాట్లాడుతూ, 'మంచి కంటెంట్‌తో ఉన్న ఈ సినిమా సిద్దార్థ్‌కి మళ్ళీ ఆ స్థాయి హిట్ అవుతుంది. డైరెక్టర్ ఈ సినిమాను చాలా బాగా తీసారు. ఈ సినిమాతో మళ్ళీ మన పాత సిద్దార్థ్‌ని చూస్తాం' అని తెలిపారు.



సిద్ధార్థ్

'ఇప్పటివరకు సిద్దార్థ్‌ను మీరొక లవర్ బాయ్‌గా చేశారు. ఈ సినిమాలో రగ్గడ్ లవర్ బాయ్‌గా చూపించాను. ఈ సినిమా రొటీన్‌గా కాకుండా కొంచెం కొత్తగా ఉండబోతుంది. ఇది న్యూ జనరేషన్ సినిమా' అని దర్శకుడు కార్తీక్ జి క్రిష్ అన్నారు.

హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ,'పూర్తి కమర్షియల్ సినిమాగా కార్తీక్ జి. క్రిష్ దీన్ని తెరకెక్కించాడు. ఈ సినిమాలో నన్ను కార్తీక్ చాలా కొత్తగా చూపించాడు. యాక్షన్ అండ్ రొమాంటిక్ టచ్‌తో ఈ లవ్ స్టోరీ నడుస్తుంది. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుని మరీ ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ చేశాను. 35 రోజుల పాటు యాక్షన్ సీన్స్ తీశాం. ఈ సినిమాలో దివ్యాంశ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇదొక యూనిక్ లవ్ స్టోరీ. ఈ జనరేషన్‌కి ఈ లవ్ స్టోరీ తప్పకుండా కనెక్ట్ అవుతుంది. రాబోయే ఆగస్ట్‌తో 20 ఏండ్ల కెరీర్ పూర్తి కావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం అరడజను సినిమాల్లో నటిస్తున్నాను' అని తెలిపారు.

వాడికి నేనున్నాను.. బ్రో

మామా అల్లుళ్ళు పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ తొలిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై జీ స్టూడియోస్‌తో కలిసి టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పి. సముద్రఖని దర్శకుడు.

దీనికి దర్శకులు త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పవన్‌కళ్యాణ్ ఫస్ట్ లుక్, సాయి ధరమ్ తేజ్ ఫస్ట్ లుక్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి 'బ్రో ద్వయం' పేరుతో పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి ఉన్న పోస్టర్‌ని మేకర్స్ సోమవారం విడుదల చేశారు. పోస్టర్‌లోని ఎట్మాస్ఫియర్ చూస్తే, వాడికి నేనున్నాను.. అనేలా పవర్‌స్టార్ తీరు ఉంటే, ఆయన తీరుకి తగ్గట్టే సాయిధరమ్‌తేజ్ ఎక్స్‌ప్రెషన్స్ ఉన్నాయి. ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. జులై 28న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

అరుదైన గౌరవం దేశానికి అంకితం

తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటిసారి ఒక సంగీత దర్శకుడికి ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్ పార్లమెంట్‌లో గౌరవ జీవిత సాఫల్య పురస్కారం దక్కటం విశేషం. మూడున్నర దశాబ్దాల పాటు తెలుగు పాటల ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన సంగీత దర్శకుడు కోటికి ఈ అరుదైన గౌరవం లభించింది. అత్యద్భుతమైన సంగీతంతో ప్రేక్షకుల గుండెల్లో ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సాలూరి రాజేశ్వరరావు అబ్బాయిగా, మన అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సంగీత దర్శకుడు కోటిగా తెలుగు సినిమా సంగీతానికి చేసిన సేవను గుర్తించి జీవిత సాఫల్య పురస్కారాన్ని జూలియా ఫిన్, మెంబర్ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ పార్లమెంట్ అందించింది. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ, 'ఆస్ట్రేలియా ప్రభుత్వానికి, ఇక్కడి ప్రవాస భారతీయులకు, ఐక్యరాజ్యసమితి సభ్యులకు కృతజ్ఞతలు. ఇదొక గొప్ప గౌరవం. నాకు అన్నీ ఇచ్చిన భారతదేశానికి ఈ అరుదైన గౌరవాన్ని అంకితం ఇస్తున్నాను' అని చెప్పారు.



కోటి

ఊహించని 3 ట్విస్టులు..


'స్వాతిముత్యం' సినిమాతో హీరోగా సక్సెస్‌ఫుల్‌గా అరంగేట్రం చేసిన బెల్లంకొండ గణేష్ 'నేను స్టూడెంట్ సర్'తో థ్రిల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. రాకేష్ ఉప్పలపాటి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్వీ 2 ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'నాంది' సతీష్ వర్మ నిర్మించారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా జూన్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత 'నాంది' సతీష్ వర్మ మీడియాతో మాట్లాడుతూ, "నాంది'తో మా సంస్థకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ గుర్తింపుని ఈ సినిమా మరింత పెంచుతుంది. మంచి థ్రిల్లర్ జోనర్‌లో ఈ సినిమా వెళ్తుంది. బెల్లంకొండ గణేష్ ఈ కథకు చక్కగా సరిపోయారు. కృష్ణ చైతన్య ఈ కథ చెప్పినప్పుడు బాగా కనెక్ట్ అయ్యాను. కథ ఒక మొబైల్ ఫోన్‌తో స్టార్ట్ అవుతుంది. స్టూడెంట్స్ మంచి ఐఫోన్ కొనుక్కోవాలని చాలా తాపత్రయ పడతారు. ఈ క్రమంలో ప్రతి ఇంట్లో ఏం జరుగుతుంది?, అలాగే ఇందులో మూడు మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్‌లు ఉన్నాయి. నితిన్ సినిమాతో కృష్ణ చైతన్య బిజీగా ఉండటంతో రాకేష్ దర్శకత్వం వహించారు. యూనివర్సిటీలో స్టూడెంట్ లైఫ్‌తోపాటు మనం పేపర్‌లో చదివిన ఓ రెండు సంఘటనలు ఇందులో చూపించాం. అవి స్క్రీన్‌పై చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో భాగ్యశ్రీ గారి అమ్మాయి అవంతిక తన పాత్రని చాలా చక్కగా చేసింది. మహతి స్వరసాగర్ మ్యూజిక్ అద్భుతం. ఇందులో చాలా బ్యూటీఫుల్ సాంగ్స్ ఉన్నాయి. బీజీయం నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ఈ సినిమా తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'భాగ్ మిల్కా భాగ్' తరహాలో ఫిక్షనల్ బయోపిక్ చేస్తున్నాను. దీనికి రాకేష్ దర్శకత్వం వహిస్తారు' అని అన్నారు.



సతీష్ వర్మ

ఆ మ్యాజిక్‌ని క్రియేట్ చేసే అహింస

డైరెక్టర్ తేజ దర్శకత్వంలో అభిరామ్ హీరోగా పరిచయం అవుతున్న యూత్ ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అహింస'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గీతికా తివారీ కథానాయిక. జూన్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ,' అహింస సిద్ధాంతం నమ్మే ఓ అబ్బాయిని పరిస్థితులు ఎలా కృష్ణతత్త్వం వైపు లాగాయనేది కథ. ఈ సినిమా కథ చాలా కొత్తది. ఇందులోని పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ తర్వాత ఇంకా మంచి రెస్పాన్స్ వస్తుందని నమ్ముతున్నా. 'జయం' సినిమాలో 'ప్రియతమా' పాట సినిమా విడుదల తర్వాత మరో స్థాయికి వెళ్ళింది. 'అహింస' కూడా అలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందని నమ్ముతున్నాను. తేజ, నా కాంబోలో ఏ రేంజ్ మ్యూజిక్ ఇవ్వాలో ఆ రేంజ్ మ్యూజిక్ చేశాం. దర్శకుడిగా, నటుడిగా ప్రస్తుతం పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. అలాగే కథలు నచ్చితే తప్పకుండా సంగీత దర్శకత్వం కూడా వహిస్తాను' అని తెలిపారు.



ఆర్.పి.పట్నాయక్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

చెరువుల 'కబ్జా'

కనిపించని బఫర్ జోన్లు



మొరంతో పూడ్చేసి ఇండ్ల నిర్మాణాలు
- శిఖం భూములు,ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు, కాలనీలు
- బడా నాయకుల చేతుల్లో శిఖం భూములు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

చెరువులు, కుంటలకు రక్షణ లేకుండా పోయింది. బఫర్ జోన్లు కనిపించడం మాయమవుతున్నాయి.. తూములు కనుమరుగవుతున్నాయి.. భూముల ధరలు పెరగడంతో.. రియల్ మాఫియా చెరువులు, శిఖం భూములను మొరంతో పూడ్చేసి వెంచర్లు, కాలనీలు ఏర్పాటు చేస్తోంది. ఆ పరిధిలో ఇండ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇందులో కొందరు ప్రజా ప్రతినిధులు కూడా ఉంటున్నారు. ఎప్పటికప్పుడూ చెరువులను సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సిన అధికారులు అక్రమార్కులకే సపోర్ట్ చేస్తుండటంతో హద్దులు చెరిగిపోతున్నాయి. దీంతో చెరువుల గొలుసుకట్టు కూడా తెగిపోయి వరద నీరంతా వృథాగా కృష్ణానదిలో కలుస్తోంది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 ఎకరాల్లోపు విస్తీర్ణం ఉన్న చెరువులకు, 9 మీటర్లు, 25 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న చెరువులకు 30 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉండాలి. ఆ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకూ అనుమతి ఇవ్వకూడదు. కానీ ఈ నిబంధనలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. ప్రజాప్రతినిధుల అండతో ఆక్రమణదారులు చెరువులను మొరంతో పూడ్చి ఇండ్లు కట్టి అమ్మకానికి పెడుతున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పెద్దచెరువు, నాగర్‌కర్నూల్ పట్టణ సమీపాన ఉన్న కేసరి సముద్రం, పుట్నాల చెరువు, తెలకపల్లి పెద్ద చెరువు ఆక్రమణలకు గురవుతున్నాయి. 60 ఎకరాలకు పైగా ఉండాల్సిన మహబూబ్‌నగర్ పెద్ద చెరువు 20 ఎకరాలకు కుచించుకుపోయింది. నాగర్ కర్నూల్ కేసరి సముద్రం ఆక్రమణల కారణంగా ప్రస్తుతం 30 ఎకరాలకు పరిమితమైంది.

ఆగని ఆక్రమణలు

అక్రమార్కులు చెరువులను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి సమీపాన ఉన్న వడ్లోనికుంట గతంలో 70 ఎకరాలకు సాగు ఇచ్చేది. లింగాల పట్టణానికి చెందిన ఓ ప్రముఖ నాయకుడు ఈ చెరువు శిఖం భూములన్నీ రియల్ ఎస్టేట్‌గా మార్చి అమ్ముకున్నారు. వ్యవసాయ బావులను సైతం ధ్వంసం చేశారు. నాగర్ కర్నూల్, కొల్లాపూర్ రహదారి సమీపాన జరుగుతున్న ఈ అక్రమాలు అధికారులకుగానీ ప్రజాప్రతినిధులకుగానీ కనబడకపోవడం విచిత్రం. ఇక్కడి భూముల్లో వెనుకబడిన తరగతులకు చెందిన వారివే అధికంగా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామ సమీపాన నరసింహ కుంటను కొందరు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మొరంతో పూడ్చివేసి రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జేసీబీలు టిప్పర్లతో రాత్రింబవళ్లు చెరువును పూడ్చుతున్నారు. గతంలో ఈ చెరువు కింద 50 ఎకరాలకు పైగా సాగు అయ్యేది. ప్రస్తుతం చెరువును పూడ్చడంతో ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. ఈ చెరువు పూడ్చివేతలో స్థానిక ప్రజాప్రతినిధుల హస్తమున్నట్టు సమాచారం. ఇదే గ్రామంలోఉన్న శేషయ్య చెరువు కూడా పూర్తిగా ఆక్రమణకు గురి కావడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయాయి. తూములు బంద్ చేసి అలుగులు విప్పేశారు. సాతాపూర్ గ్రామ సమీపాన ఉన్న రసూల్ కుంట పాతినేని చెరువు సైతం కనుమరుగవుతున్నాయి. గతంలో ఈ చెరువుల నుంచి సాగునీరు వచ్చి పంట పొలాలు కళకళలాడేవి. నేడు నీళ్ల లేక పశుపక్షాదులకు దాహార్తి కూడా తీరడం లేదు.

తెగిన గొలుసుకట్టు

ప్రజల సాగు, తాగునీటి అవసరాల కోసం కాకతీయులు అప్పట్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 6575 గొలుసుకట్టు చెరువులు, కుంటలు నిర్మించారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ విస్తరించడం, కబ్జాలు పెరిగిపోవడం వల్ల సుమారు 1250 చెరువులు, కుంటలు పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో గొలుసుకట్టు తెగిపోయి అధిక వర్షాలు వస్తే నీరంతా కృష్ణానది పాలవుతుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మొత్తం పంట పొలాలు నీట మునిగాయి. చెరువులు, ఆనకట్టలు ఉంటే వరదలు తగ్గేవి.

కబ్జాదారులను కట్టడి చేయాలి
వర్ధం పర్వతాలు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి- నాగర్‌కర్నూల్

నాగర్ కర్నూల్ జిల్లాలో ఊరకుంటలు, చెరువులు కబ్జా అవుతున్నాయి. ముఖ్యంగా కేసరి సముద్రాన్ని కొంతమంది కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. ప్రతిపక్షాలు ఆందోళనలు చేయడంతో బఫర్ జోన్ పరిమితిని నియమించారు. అయినా అక్రమాలు ఆగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎఫ్‌టిఎల్ నిర్ణయించి ఆక్రమణ నుంచి రక్షించాలి.

వీఓఏలను అడ్డుకున్న పోలీసులు..అరెస్టులు



నవతెలంగాణ- విలేకరులు

ఐకేపీ వీఓఏల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు బయలుదేరిన వీఓఏలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డగించారు. తెల్లవారుజామునే నాయకులను అరెస్టు చేశారు. అరెస్టులను నిరసిస్తూ పలుచోట్ల వీఓఏలు ధర్నా చేశారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో సీఐటీయూ నాయకులను, వీఓఏలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలానికి చెందిన వీఓఏలను పోలీసులు అరెస్టు చేసి నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోనూ మహాధర్నాకు సిద్ధమై వెళ్తున్న వీఓఏలను అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలానికి చెందిన ముగ్గురు గ్రామ దీపికలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు గ్రామదీపికలను ఆదివారం రాత్రే పోలీసులు నిర్బంధించారు. ఇంత నిరంధం విధించినా వీఓఏలు మొక్కవోని దీక్షతో తెగించి హైదరాబాద్ ఇందిరాపార్కు వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు.

మాడ్గులపల్లిలో..

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లోని వీఓఏలు హైదరాబాద్‌కు బయలుదేరగా.. మార్గమధ్యంలో మాడుగులపల్లి మండల కేంద్రంలో టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డగించి అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి టోల్‌గేట్ వద్దకు చేరుకుని వీవోఏలతోపాటు ధర్నాలో పాల్గొన్నారు. ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు అనుమతి ఉన్నప్పటికీ అడ్డుకోవడం.. అరెస్టు చేయడం ఏంటని పోలీసులను నిలదీశారు. వీఓఏలను పంపించాలని పోలీసు ఉన్నతాధికారితో ఫోన్‌లో రంగారెడ్డి మాట్లాడారు. అనంతరం వీవోఏలందరినీ వాహనాలు ఎక్కించి హైదరాబాద్ పంపించారు

నల్లగొండల్లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్యను, జిల్లా ఉపాధ్యక్షులు నారబోయిన శ్రీనివాసులు, తిప్పర్తి, చిట్యాల, మాడుగులపల్లి, అనేక చోట్ల వీవోఏలను హైదరాబాదు వెళ్లకుండా అడ్డుకొని ముందస్తు అరెస్టులు చేశారు. చిట్యాలలో సోమవారం తెల్లవారు జామున ఐదు గంటలకు సీపీఐ(ఎం), సీఐటీయూ జిట్ట నగేష్, నారబోయిన శ్రీనివాస్‌ను ఇండ్ల వద్దే అరెస్టు చేశారు.

రాచరికాన్ని ముందుకు తెస్తున్న మోడీ సర్కార్

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ -రామన్నపేట

రాజ్యాంగ విలువల్ని కాలరాసి రాచరికాన్ని ముందుకు తెస్తున్న మోడీ సర్కార్ విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడం గ్రామంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నూతన భవన నిర్మాణానికి చెరుపల్లి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొదటి ప్రతిపక్ష నాయకుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య పేరున నిర్మించే విజ్ఞాన కేంద్రం గ్రామంలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన, సామాజిక సేవాదృక్పథం పెంపొందిస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మనదన్నారు. పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలో భారత లౌకిక, సారభౌమత్వానికి వ్యతిరేకంగా క్రతువులు నిర్వహించి, దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాచరికపు కాలంనాటి రాజదండాన్ని పట్టుకుని మత మౌఢ్యంతో పూజలు నిర్వహించడం, భారత రాష్ట్రపతిని ఆహ్వానించకుండా సాధువులు, సన్యాసుల కాళ్లకు దండం పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మోడీ నియంతలా వ్యవహరిస్తూ దేశ ప్రతిష్టతను దేబ్బతీశారని విమర్శించారు. చట్టాలను రూపొందించే భారత పార్లమెంటును మత ఛాందసాల కేంద్రంగా మార్చడంలో బీజేపీ పాలన లక్ష్యం ఎమిటో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అదే సమయంలో నిరసన తెలిపిన రెజ్లర్లపై దాడి హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహా చారి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైవేపై..దొంగల ముఠా హల్‌చల్

- రెండు రౌండ్ల కాల్పులు జరిపిన పోలీసులు
- కారు వదిలి పారిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీ దుండగులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

అర్ధరాత్రి వేళ.. 44వ జాతీయ రహదారిపై దొంగలముఠా హల్‌చల్ చేసింది. కొన్ని రోజులుగా వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, కాపర్ వైర్‌లను దొంగిలిస్తున్న ముఠా.. వస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి వేళ కాపు కాశారు. బారీ కేడ్‌లను పెట్టి తనిఖీలు చేపట్టగా.. ఒక కారు వేగంగా వచ్చి బారికేడ్‌లను ఢీకొట్టి వెళ్తుండగా.. పోలీసులు రెండు రౌండ్‌లు కాల్పులు జరిపారు. కొద్ది దూరం వరకు వెళ్లిన దుండగులు కారును వదిలేసి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

వ్యవసాయ క్షేత్రాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను దొంగల ముఠా చోరీకి పాల్పడుతోంది. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు సైతం నమోదు కావడంతో పోలీసులు ఈ ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో జరిగిన దొంగతనాల్లో ఒక కారును పోలీసులు అనుమానించారు. ఆ కారు ఆదివారం రాత్రి ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచరిస్తున్నట్టు అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించి అలర్ట్ చేశారు. దానిలో భాగంగానే టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ధర్పల్లి సీఐతో పాటు డిచ్‌పల్లి, ఇందల్వాయి, జాక్రన్ పల్లి, దర్పల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు గంటల సమయంలో రాజస్థాన్‌కు చెందిన కారు వస్తుండటంతో గమనించిన ధర్పల్లి ఎస్ఐ వంశీ కృష్ణారెడ్డి కారుని ఆపే ప్రయత్నం చేయగా పక్కనే ఉన్న బారీకేడ్‌లను కారు ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. వెంటనే ఎస్ఐ గాల్లో రెండు రౌండ్ల కాల్పులు జరపడంతో వెంటనే అక్కడ ఉన్న పోలీసులు అలర్టయ్యారు. కారును పట్టుకోవడానికి పోలీసులు ఛేజ్ చేయగా.. నిందితులు సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లుపేట్ వద్ద కారు వదిలేసి నలుగురు దుండగులు పారిపోయారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాజస్థాన్ దొంగల ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. సదాశివనగర్ మండలంలోని మల్లుపేట వద్ద కారును గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లిన కొద్దిసేపటికి పోలీసులు మల్లుపేట చేరుకొని కారును స్వాధీనం చేసుకొని ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్పల్లి ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ముఠాపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

సదాశివనగర్ : మండలంలోని మల్లాపేట్ గ్రామ శివారులో ఆదివారం రాజస్థాన్ దొంగల ముఠా కారును వదిలి పారిపోయారు. దుండగులను పట్టుకునేందుకు ఇందల్‌వాయి టోల్‌గేట్ నుంచి పోలీసులు చేజ్ చేస్తుండగా.. వారు కారును సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామ శివారులో వదిలిపారిపోయినట్టు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. గ్రామస్తులు, సర్పంచ్‌లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

10 శాతం తరుగు డబ్బులను రైతుకు చెల్లించాలి

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు
- కలెక్టరేట్ ముట్టడి



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని, తరుగు పేరుతో కోతపెట్టిన 10 శాతం ధాన్యం డబ్బులను రైతు ఖాతాలో చెల్లించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం రైతులు నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తే దళారులు నిలువునా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నిబంధనలూ పెట్టకుండా కొనుగోలు చేయాల్సి ఉందని, అధికారులు నిబంధనలను బేకాతర్ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మార్కెట్లో కొనుగోళ్లలో సంచి దగ్గర రెండు కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని చెప్పారు. మిల్లర్లకు ప్రభుత్వమే తరుగు పేరుతో నూటికి పది రూపాయలు ఇస్తుంటే, మరో పది రూపాయలు రైతుల నుంచి ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలా ఒక లారీకి రూ.35 వేలు మిల్లర్లు లాభపడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆరుగాలం కష్టం చేసిన రైతుకు మిగిలేది నూటికి పది రూపాయలు అయితే.. అవి కూడా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఈ విధంగా దగా చేస్తుంటే ప్రజాప్రతినిదులు ఎందుకు నిలదీయడం లేదన్నారు. 2018 ఎన్నికలకు ముందు ఇస్తామన్న రుణమాఫీ ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు తూకం చేసి రైతుల దగ్గర నుంచి 10శాతం తరుగు పేరుతో తీసుకున్న ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. దీన్ని నిరసిస్తూ ఆందోళనకారులు రాస్తారోకో చేశారు. రైతులతో చర్చలకు వచ్చిన జాయింట్ కలెక్టర్ మోతిలాల్ ఏమీ మాట్లాడకుండానే వెనుతిరిగి పోయారు. జూపల్లి కృష్ణారావుతోపాటు ఎంపీపీ ప్రతాప్‌గౌడ్‌ను, ముఖ్య కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లారు.

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- వచ్చే ఎన్నికల్లో బాధితులందరూ నామినేషన్ వేయాలి : ప్రజా గాయకులు గద్దర్
- కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితుల ధర్నా



నవతెలంగాణ- భువనగిరిరూరల్

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, ఒకవేళ మార్చకుంటే ఎకరం భూమికి, మూడెకరాల భూమి ఇవ్వాలని ప్రజాగాయకులు గద్దర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ భూనిర్వాసితులు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి గద్దర్ మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి నుంచి భూ సమస్య పైనే పోరాటాలు జరిగాయని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కూడా భూమికోసం, భుక్తి కోసం జరిగిందని చెప్పారు. మహాభారత యుద్ధం సైతం భూమి కోసమే జరిగిందని గుర్తు చేశారు. 'మా భూమి మాకు కావాలి' అనే నినాదంతో ఓట్ల విప్లవం రావాలని, ఓటు ఆయుధం కావాలని అన్నారు. రాష్ట్రంలో ధరణి పేరుతో భూములను అమ్ముకుంటున్నారన్నారు. అలైన్‌మెంట్ మార్చకుంటే వచ్చే ఎన్నికల్లో బాధితులందరూ నామినేషన్ వేయాలని సూచించారు.త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌లో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు అండగా సీపీఐ(ఎం), రైతు సంఘం ఉంటుందని తెలిపారు. త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నాక ప్రమోద్ కుమార్ అన్నారు. అలైన్‌మెంట్ కోసం అవసరమైతే రాజీనామాలు చేస్తామని చెప్పారు. ధర్నాకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి మాట్లాడారు. త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, స్థానిక ఎమ్మెల్యే కోసం మార్పులు చేశారని ఆరోపించారు. మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు కల్పించుకొని అలా మాట్లాడటం సరికాదన్నారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్, బీజేపీల మధ్యల మాటల యుద్ధం ముదిరింది. కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. టీపీసీసీ బీర్ల ఐలయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు తంగేళ్లపల్లి రవికుమార్, పల్లెర్ల యాదగిరి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కన్వీనర్ కాశపాక మహేష్, వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షులు ఎండి.అవతార్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, కౌన్సిలర్ నాయిని పూర్ణచందర్, కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బీస్కుంట్ల సత్యనారాయణ, రఘుబాబు పాల్గొన్నారు.

మణిపూర్‌లో బీజేపీ అండతోనే గిరిజనులపై దాడులు : టీఏజీఎస్

నవతెలంగాణ- ఆదిలాబాద్

మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై బీజేపీ అండతో జరుగుతున్న దాడులను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. గిరిజనులపై దాడులు ఆపడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, మతోన్మాదులను కఠినం శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్ రాష్ట్రంలో రెండు మాసాలుగా కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై మతోన్మాద శక్తుల దాడులతో అట్టుడుకుతోందన్నారు. కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గిరిజనులపై దాడులను అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న మైతీ కులస్తులలో తమ బలాన్ని సుస్థిరం చేసుకోవడానికి బీజేపీ చేస్తున్న కుట్రలో భాగంగానే మణిపూర్‌లో కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై దాడులని పేర్కొన్నారు. బీజేపీ తన రాజకీయ లబ్ది కోసం రాష్ట్ర జనాభాలో 54శాతం ఉన్న మైతీ కులస్తులను గిరిజన తెగల జాబితాలో చేర్చడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. తద్వారా రాష్ట్ర జనాభాలో మైనారిటీగా ఉన్న కుకీ, నాగ గిరిజన తెగల హక్కులను దెబ్బతీయాలని చూస్తోందని పేర్కొన్నారు. కుకీ, నాగ తెగలను అడవి నుంచి గెంటేయాలని, వారి ఆధీనంలో ఉన్న భూములను గిరిజనేతరులైన మైతీలకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తోందన్నారు. అందుకు ఆటంకంగా ఉన్న గిరిజన చట్టాలను అతిక్రమించడానికి మైతీలను గిరిజనులుగా మార్చే ప్రయత్నాలకు బీజేపీ తెరతీసిందని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ, నాగ గిరిజన తెగలపై బీజేపీ అండతో మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. గిరిజనుల ఇండ్లను, ఆస్తులను, చర్చీలను ధ్వంసం చేశారని, 70మందికి పైగా చనిపోయారని పేర్కొన్నారు. శాంతియుతంగా కలిసి మెలిసి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెట్టి మణిపూర్ రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మార్చిందని తెలిపారు. మణిపూర్ ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న జాతి ఉన్మాద, మతోన్మాద దాడులను ప్రజలంతా తీవ్రంగా ఖండించాలని, కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై మతోన్మాద శక్తుల దాడులను అరికట్టేందుకే తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

నాలుగు రోజులుగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, పరిసర గ్రామాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45 నుంచి 46 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఈ క్రమంలో సోమవారం వడదెబ్బకు గురై పట్టణంలోని దీక్షిత్‌నగర్‌కాలనీలో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికురాలు పల్లపు మరియమ్మ(60), దద్దనాల చెరువు కాలనీలో నివాసం ఉంటున్న పటాన్ ముస్తక్‌ఖాన్(74) మృతిచెందారు. ముస్తక్‌ఖాన్ రోజువారి కూలీ పనులకు వెళ్తుంటాడు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆర్‌ఎంపీపీఎంపీల అసిసోయేషన్ నాయకులు ఎస్‌కె.మన్సూర్‌అలీ ప్రభుత్వాన్ని కోరారు.

అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలు

- 18మంది అరెస్ట్ : సీపీ రంగనాథ్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హన్మకొండ జిల్లాలో అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడుతూ గర్భస్రావాలు చేస్తున్న 18మందిని హ్యూమన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారని, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వారి నుంచి మూడు లింగనిర్ధారణకు వినియోగించే స్కానర్లు, 18 సెల్‌ఫోన్లు, రూ.73 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వరంగల్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనపై సీపీ వివరాలు వెల్లడించారు. అరెస్టయిన వారిలో వేముల ప్రవీణ్, వేముల సంధ్యారాణి, డాక్టర్ బాల్నె పార్థు, డాక్టర్ మోరం అరవింద, డాక్టర్ మోరం శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ బాల్నె పూర్ణిమ, వార్ని ప్రదీప్‌రెడ్డి, కైత రాజు, కల్లా అర్జున్, డి. ప్రణయ్‌బాబు, కీర్తి మోహన్, బాల్నె ఆశలత, కొంగర రేణుక, భూక్యా అనిల్, చెంగెల్లి జగన్, గన్నారపు శ్రీలత, బండి నాగరాజు, కాసిరాజు దిలీప్ ఉన్నారు.

ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్‌కు గతంలో స్కానింగ్ కేంద్రంలో టెక్నీషియన్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో దాని ద్వారా సులభంగా డబ్బులు సంపాదించాలనుకొని తన భార్య సంధ్యారాణితో కలిసి గోపాల్‌పూర్ వెంకటేశ్వర కాలనీలో కొద్ది మంది సిబ్బందితో పోర్టబుల్ స్కానర్ల సహాయంతో స్కానింగ్ కేంద్రాన్ని రహస్యంగా నిర్వహిస్తున్నారు. ఈ స్కానింగ్ కేంద్రానికి ఆర్‌ఎంపీలు, పీఆర్‌ఓలు, ఆస్పత్రి మేనేజ్‌మెంట్, సిబ్బంది, డాక్టర్‌లతో కలిసి ఒక నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేసుకొని వారి సాయంతో గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భిణులను లింగనిర్ధారణ పరీక్షల కోసం నగరానికి తీసుకొచ్చేవారు. లింగనిర్ధారణకు వచ్చే మహిళలకు పరీక్షలు చేసి పుట్టబోయేది ఆడబిడ్డ అయితే గర్భస్రావం కోసం ఈ ముఠాకు చెందిన ఆస్పత్రులు.. హన్మకొండలో లోటస్, గాయత్రి ఆస్పత్రులు, నెక్కొండలోని ఉపేందర్ (పార్థు ఆస్పత్రి), నర్సంపేటలోని బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సంబంధింత డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడి పంపించేవారు. ఇందుకోసం ఒక్కొక్క గర్భస్రావానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు డబ్బులు వసూలు చేసి వాటిని ఆ ముఠా సభ్యులు కమిషన్ల రూపంలో పంచుకునే వారు. ఇప్పటి వరకు ఈ ముఠా 200కుపైగా గర్భస్రావాలు చేశారు. అక్రమంగా లింగానిర్ధారణ పరీక్షలు చేస్తున్నందుకు గతంలోనూ ప్రవీణ్‌ను హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన అదనపు డీసీపీ పుష్ప, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సుజాత, శ్రీనివాసరావు, జనార్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఎస్ఐలు ఫసీయుద్దీన్, మల్లేశం, శరత్‌కుమార్, భాగ్యలక్ష్మీ, ఏఏఓ సాల్మన్, ఏహెచ్‌టీయూ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సమీయుద్దీన్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సైబర్ క్రైం సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, చైల్డ్ కోఆర్డినేటర్లు కృష్ణమూర్తి, కృతిను పోలీసు కమిషనర్ అభినందించారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్షా ఫలితాల విడుదల : మల్లయ్య భట్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2023-24 విద్యా సంవత్సరంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ , బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం సోమవారం విడుదల చేసినట్టు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. ఈ ఫలితాల్లో ఎంపీసీలో 150 మార్కులకుగాను 122 మార్కులతో మొదటి స్థానంలో సిద్ధిపేట జిల్లాకు చెందిన పి. జ్యోత్స్న బైపీసీలో నల్గొండ జిల్లాకు చెందిన పి.శ్రీవల్లి 108 మార్కులతో, సీఈసీలో పెద్దపల్లి జిల్లాకు చెందిన కె.సాయి సంహిత 107 మార్కులతో, ఎంఈసీలో మేడ్చల్ జిల్లాకు చెందిన ఎ. అర్చన 109 మార్కులతో అగ్ర స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు విద్యార్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో చేరాలని సూచించారు. ఫలితాలను https://mjptbcwreis. telangana.gov.in వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని మల్లయ్య బట్టు తెలిపారు.

మోడీ విజన్ 2047

- కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విజన్ 2047 లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బీజేపీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. తొమ్మిదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మేఘ్‌వాల్ మాట్లాడుతూ.. దేశంలో రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్‌లో మోడీనే చీపురు పట్టి ఊడ్చారన్నారు.

బిజినెస్

ఐటి రంగంలో తగ్గిన ఎఫ్‌డిఐలు

- 2022-23లో 22 శాతం పతనం



న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో భారత్‌లోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లు 22 శాతం పతనమై 46 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) గణంకాలు తెలిపాయి. ముఖ్యంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఎఫ్‌డిఐలు తగ్గాయని వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది 2021-22లో 58.77 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. ఈక్విటీ, ఇతర పెట్టుబడులను కలిపి స్థూలంగా 2022-23లో 16.3 శాతం పతనమై 70.97 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని డిపిఐఐటి తెలిపింది. ఇంతక్రితం ఏడాదిలో 84.83 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు చోటు చేసుకున్నాయి. తయారీ రంగం, కంప్యూటర్ సర్వీసెస్, కమ్యూనికేషన సర్వీసెస్‌లో అధికంగా ఎఫ్‌డిఐలు పడిపోయాయి.

2022-23 ఏప్రిల్ నుంచి మార్చి కాలంలో సింగపూర్ నుంచి అత్యధికంగా 17.2 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు వచ్చాయి. మారిషాస్ నుంచి 6.13 బిలియన్లు, అమెరికా నుంచి 6 బిలియన్లు, యుఎఇ నుంచి 3.35 బిలియన్ల పెట్టుబడులు నమోదయ్యాయి. నెథర్లాండ్స్ నుంచి 2.5 బిలియన్లు, జపాన్ (1.8 బిలియన్లు), బ్రిటన్ (1.73 బిలియన్లు), సైప్రస్ (1.27 బిలియన్లు) తదితర దేశాల నుంచి పెట్టుబడులు వచ్చాయి. మారిషాస్, అమెరికా, నెథర్లాండ్స్, జర్మనీ దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డిఐల్లో అధిక తగ్గుదల చోటు చేసుకుంది. 2021-22లో ఆటోమొబైల్ రంగంలోకి 7 బిలియన్ల పెట్టుబడులు రాగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1.9 బిలియన్లు మాత్రమే వచ్చాయి. 2022-23లో మహారాష్ట్రలోకి అత్యధికంగా 14.8 బిలియన్ల పెట్టుబడులు వచ్చినప్పటికీ.. ఇంతక్రితం ఏడాది 15.44 బిలియన్లతో పోల్చితే తక్కువగానే నమోదయ్యాయి. కర్నాటక రాష్ట్రంలోకి 10.42 బిలియన్లు, గుజరాత్‌లోకి 4.71 బిలియన్ల చొప్పున వచ్చాయి. తమిళనాడు, తెలంగాణ, హర్యాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోకి వచ్చే ఎఫ్‌డిఐల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ఈక్విటీ రంగంలోకి వచ్చే ఎఫ్‌డిఐల్లో భారీ తగ్గుదల నమోదయ్యింది.

నాట్కో ఫార్మా లాభాల్లో 345 శాతం వృద్ధి

NATCO
Natco Pharma Limited

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 345 శాతం వృద్ధితో రూ.275.8 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.50.5 కోట్లు, గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో రూ.62.3 కోట్ల చొప్పున లాభాలు ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ రెవెన్యూ క్రితం క్యూ4లో 51.80 శాతం పెరిగి రూ.926.9 కోట్లుగా చోటు చేసుకుంది. 2021-22 క్యూ4లో రూ.610.6 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఆర్థిక సంవత్సరం 2022-23లో స్థూలంగా నాట్కో రెవెన్యూ 37.6 శాతం పెరిగి రూ.2811.7 కోట్లుగా నమోదయ్యింది. కంపెనీ లాభాలు రూ.715.3 కోట్లుగా ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది రూ.170 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. బ్రిటన్ కంపెనీ జిస్టా ఫార్మాను పూర్తిగా స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపింది. అదే విధంగా కొలంబియాలో లక్ష డాలర్ల లోపు పెట్టుబడితో అక్కడ ఓ సబ్సీడరీ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. సోమవారం బిఎస్ఇలో నాట్కో షేర్ విలువ 0.91 శాతం పెరిగి రూ.635.10 వద్ద ముగిసింది.

ఆప్టిమస్‌తో షావోమి జట్టు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టివి బ్రాండ్ షావోమి ఇండియా తన 'మేక్ ఇన్ ఇండియా' ప్రయాణాన్ని బలోపేతం చేయడానికి ఆప్టిమస్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కేబుల్‌రహిత ఆడియో ఉత్పత్తులను స్థానికంగా తయారు చేయడానికి ఈ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఈ విభాగంలో దేశీయ ఛాంపియన్లతో కార్యకలాపాల విస్తరణ, తయారీ భాగస్వామ్యాల ద్వారా షావోమి భారత్ పట్ల తన నిబద్ధతను బలోపేతం చేస్తుందని తెలిపింది. వచ్చే రెండేండ్లలో స్మార్ట్‌ఫోన్ దేశీయ విలువ జోడింపులో 50 శాతం పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

వీక్‌ఫీల్డ్ ఫుడ్స్ నుంచి రెండు నిమిషాల్లో డెజర్ట్



హైదరాబాద్: ఆహారోత్పత్తుల కంపెనీ వీక్‌ఫీల్డ్ ఫుడ్స్ కొత్తగా ఇన్‌స్టంట్ కస్టర్డ్ మిక్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. రెండు నిమిషాల్లో ఈ డెజర్ట్ రెడీ అవుతుందని పేర్కొంది. ఆరు దశాబ్దాలుగా డెజర్ట్ మిక్స్‌ల విభాగంలో ఆధిపత్యం కలిగి ఉన్నామని వీక్‌ఫీల్డ్ ఫుడ్స్ సిఇఒ సచ్‌దేవా పేర్కొన్నారు. నూతన ఇన్‌స్టంట్ కస్టర్డ్ మిక్స్ 2 నిమిషాల్లో గొప్ప రుచిని అందిస్తుందన్నారు. ఒక్క సాచెట్ ధర రూ.25గా నిర్ణయించామన్నారు.

మోబిల్ ప్రచారకర్తగా హృతిక్ రోషన్

న్యూఢిల్లీ:చమురు ఉత్పత్తుల కంపెనీ మోబిల్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా హృతిక్ రోషన్‌ను నియమించుకున్నట్లు తెలిపింది., "భారత్‌లో మోబిల్ లూబ్రికెంట్స్ కోసం హృతిక్ రోషన్‌తో భాగస్వామ్యం మాకు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. దేశ లూబ్రికాంట్ అవసరాలను పూరిస్తామనే మా మాటకు వ్యాపార భాగస్వాములు, వినియోగదారులలో విశ్వాసం కలిగించేలా హృతిక్ వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుందని మేము నమ్ముతున్నాము." అని ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ సిఇఒ విపిన్ రాణా పేర్కొన్నారు.

భారత్ పర్యటనలో కాంబోడియా రాజు

- నేడు రాష్ట్రపతి, ప్రధానమంత్రితో చర్చలు

న్యూఢిల్లీ : భారత పర్యటన కోసం కాంబోడియా రాజు నరోడోమ్ షిమామోని సోమవారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఇక్కడి పాలం ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో కాంబోడియా రాజుకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ సింగ్ ఆహ్వానం పలికారు. మొత్తం 27 మంది ప్రతినిధులతో కూడిన అత్యున్నత బృందంతో కలిసి కాంబోడియా రాజు భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ బృందంలో రాయల్ ప్యాలెస్ మంత్రి, విదేశాంగ మంత్రి, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. భారత్-కాంబోడియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు 70 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కాంబోడియా రాజు భారత్ పర్యటనకు వచ్చారు. 1952లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ప్రారంభమయ్యాయి. అలాగే 60 ఏళ్ల విరామం తరువాత కాంబోడియా రాజు భారత్‌లో పర్యటిస్తున్నట్లయింది. 1963లో ప్రస్తుత రాజు నరోడోమ్ షిమామోని తండ్రి భారత్‌లో పర్యటించారు. కాగా, మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో కాంబోడియా రాజుకు స్వాగత కార్యక్రమం నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి రాజు గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఇవ్వనున్నారు. అలాగే రాష్ట్రపతి, ప్రధానమంత్రితో ద్వైపాక్షిక సంబంధాల్లో కాంబోడియా రాజు పాల్గొంటారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తోనూ రాజు చర్చలు జరుపుతారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య 366 మిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుంది. దీనిని విస్తరించడానికి, సాంస్కృతిక, రక్షణ, భద్రత రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ చర్చలు సాగుతాయి.

టర్కీ అధ్యక్షుడిగా మరోసారి ఎర్డోగన్ ఎన్నిక

- రెండు దశాబ్దాల పాలన పొడిగింపు

ఇస్తాంబుల్ :టర్కీ అధ్యక్షులుగా రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ మరోసారి ఎన్నికయ్యారు. దీంతో టర్కీలో గత 20 ఏళ్లగా కొనసాగుతున్న ఎర్డోగన్ పాలనకు పొడిగింపు లభించినట్లయింది. చివరి విడత కౌంటింగ్‌లో ఎర్డోగన్‌కు 52 శాతం ఓట్లు లభించినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యర్థి కెమల్ కిలిక్‌డరోగ్లుకు 48 శాతం ఓట్లు లభించాయని తెలిపారు. ఆదివారం రాత్రి ఈ ఫలితాలు విడుదల చేశారు.

4 నెలలు.. 44 కోట్లు

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా ప్రకటనలు

- విచ్చలవిడిగా ఖర్చు చేసిన కర్నాటక బీజేపీ ప్రభుత్వం
- రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బొమ్మై సర్కారు నిర్వాకం : ఆర్టీఐ సమాచారంలో వెల్లడి

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. ప్రకటనలపై కోట్లాది రూపాయలను విచ్చలవిడిగా ఖర్చు చేసింది. కోట్లాది రూపాయలను కుమ్మరించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలను ఇచ్చింది. ఇలా కేవలం నాలుగు నెలల్లోనే రూ. 44 కోట్లకు పైగా ఖర్చు చేసింది. సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు సమాధానంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ సమాచారం ప్రకారం.. గతేడాది డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 29 మధ్య.. కర్నాటక బీజేపీ ప్రభుత్వం మొత్తం నాలుగు నెలల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనల కోసం రూ.44.42 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రింట్ మీడియా కోసం రూ.27.46 కోట్లు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనల కోసం రూ. 16.96 కోట్లు వెచ్చించింది. అయితే, బొమ్మై సర్కారు తన ప్రకటనల బడ్జెట్‌ను ఖర్చు చేసిన మీడియా సంస్థల గురించి మాత్రం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ వివరాలను వెల్లడించలేదు. కర్నాటకలో షెడ్యూల్ ప్రకారం మే 10న 224 స్థానాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అత్యధికంగా 135 స్థానాలను గెలిచి అపూర్వ విజయాన్ని సొంతం చేసుకోగా.. 66 సీట్లతో బీజేపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నది.

ప్రజా ధనాన్ని లూటీ చేసిన బీజేపీ ప్రభుత్వం : కాంగ్రెస్

ప్రభుత్వాలు తమ పథకాలపై అవగాహన కల్పించేందుకు బడ్జెట్‌ను కేటాయించటం విలక్షనమైనప్పటికీ.. రాష్ట్రంలో అధికారాన్ని పొందాలనే ఏకైక లక్ష్యంతో ఎన్నికల సమయంలో పన్ను చెల్లింపుదారుల సొమ్మును విపరీతంగా ఖర్చు చేయటం సరి కాదని ఆర్టీఐ కింద దరఖాస్తును దాఖలు చేసిన పుత్తూరుకు చెందిన కృష్ణప్రసాద్ అన్నారు. బీజేపీ దాదాపు రూ. 50 కోట్లు ఖర్చు చేసిందనీ, ప్రతిపక్షాలను విమర్శించేందుకే కొన్ని ప్రకటనలను ఇచ్చారని తెలిపారు. బొమ్మై ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసిందని కర్నాటక కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్ శివన్న ఆరోపించారు. పథకాల ప్రచారాల పేరుతో విపక్షాలను ఎదుర్కోవడానికి బీజేపీ దానిని రాజకీయంగా ఒక సాధనంగా వాడుకున్నదని ఆయన అన్నారు.

ఢిల్లీ మహిళా మల్లయోధుల శిబిరంపై

పోలీసుల దాడిని ఖండించండి

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విమలక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహిళా మల్లయోధులపై కేంద్ర పోలీసు బలగాలు దాడి చేయడంతోపాటు న్యాయం కోసం వారు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 36 రోజులుగా చేస్తున్న దీక్షా శిబిరాన్ని తుడిచి పెట్టేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లు 36 రోజులుగా ఆందోళన చేస్తున్నా పార్లమెంట్ సభ్యుడు, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలు చేస్తున్నా స్పందించని కేంద్రం వారు పార్లమెంట్ వైపు దూసుకువస్తున్నారనే కారణంతో అమానుషంగా ప్రవర్తించడమనేది స్త్రీల పట్ల కొనసాగుతున్న మనువాద భావజాలానికి నిదర్శనమని అన్నారు. అరెస్టు చేసిన క్రీడాకారులను విడుదల చేసి, వారిపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్ల శిబిరాన్ని పునరుద్ధించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఖండన

ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లపై పోలీసులు దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. దేశానికి ఎన్నో పతకాలు, కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టిన క్రీడాకారులపై ఇలాంటి దమనకాండ సరైంది కాదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ 35 రోజులుగా రెజ్లర్లు తీవ్ర నిరసన తెలుపుతున్నా దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నా కేంద్రం అతన్ని అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. ఒకవైపు నూతన పార్లమెంటును ప్రారంభోత్సవం చేస్తూ ఇంకోవైపు ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలిపిన మహిళా రెజ్లర్లపై అరాచక పద్ధతుల్లో దాడి చేయడం అత్యంత అమానుషమని విమర్శించారు. భేటీ పడావో, భేటీ బచావో అని చెప్పేనే మహిళలను భక్షిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఎన్ఈపీ

టీపీటీఎఫ్ అధ్యక్షులు అశోక్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)ను అమలు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయం చెన్నుపాటి లక్ష్మయ్య భవన్ ఎదుట ఆ సంఘం పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అశోక్ కుమార్ ఆ సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. విద్యారంగానికి సరిపడా బడ్జెట్ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో ఉన్న ఖాళీలను నింపకుండా ఏండ్ల తరబడి తాత్సారం చేస్తున్నాయని అన్నారు. దీంతో సర్కారు బడులలో విద్యార్థులు తమ విలువైన భవిష్యత్తును నష్టపోతున్నారని అన్నారు. కేంద్రం తెచ్చిన ఎన్ఈపీ పేదలకు విద్యను దూరం చేసేదిగా ఉందని విమర్శించారు. అది విద్యా ప్రయివేటీకరణను బలోపేతం చేసేదిగా ఉందన్నారు. రిజర్వేషన్లను రద్దు చేసిందని, విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో మాత్రమే నడిపించేలా నిర్ణయాలు తీసుకుంటున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ స్వతంత్రతను, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీసేలా ఉన్న ఎన్ఈపీని తెలంగాణలో అమలు చేయొద్దని ఆయన డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలూ విద్యావిధానాన్ని మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని కోరారు. ఉద్యోగులకు ప్రస్తుతం అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం ప్రకాష్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ భాస్కర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సుధాకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి, రాష్ట్ర కౌన్సిలర్ రామానందయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో 21ని గెజిట్ చేయాలి

దశలవారీ ఆందోళనలు :

తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సెక్యూరిటీ సర్వీసెస్ జీవో నెంబర్ 21ని గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ దశలవారిగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ ఆందోళనలకు సెక్యూరిటీ గార్డులు పెద్ద సంఖ్యలో కదిలిరావాలని పిలుపునిచ్చింది. కార్మిక శాఖ సెక్యూరిటీ సర్వీసెస్‌కు సంబంధించిన జీవో నెంబర్ 21 విడుదల చేసి రెండేండ్లు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు గెజిట్ ప్రకటన చేయకుండా తాత్సరం చేస్తున్నదని రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు మాట్లాడుతూ యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గే ప్రభుత్వం గెజిట్ చేయడం లేదని అన్నారు. దీనివల్ల రాష్ట్రంలో వేలాది మంది సెక్యూరిగార్డులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పై డిమాండ్ సాధన కోసం దశలవారి ఆందోళనల్లో భాగంగా జూన్ 1 నుండి 5వ తేదీ వరకు సంతకాల సేకరణ, మార్కెట్ కమిటీల కార్యదర్శులు, చైర్మెన్లకు వినతి పత్రాలు, జూన్ 10వ తేదీ జిల్లా అధికారులకు, జూన్ 12న జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే జూన్ 4వ వారంలో ఛలో హైదరాబాద్ ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. దేశంలో మహిళలు, శ్రామిక మహిళల హక్కులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు.

రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం సెక్యూరిటీ గార్డుల సమస్యలతో కూడిన వినతిపత్రాలను మంత్రులు కేటీఆర్, టీ హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, చామకూర మల్లారెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని వారి పేషీల్లో అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము, కోశాధికారి టి.జనార్ధన్, రాష్ట్ర నాయకులు గొంగిడి లక్ష్మణ్, ఎస్. కుమారస్వామి, వై.రామాంజయ్య, ఎస్.రమేష్, ఎం.యాకయ్య, ఎం.భాస్కర్, షేక్ సోయాబుద్దీన్, ఎమ్‌డీ యాకూబ్‌అలీ, బి. వెంకటేష్, ఎస్.యాకయ్య, పి.వెంకన్న, వెంకటేశ్వర్లు, బి.రమేష్, పి. శ్రీనివాస్, ఉపెందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ ఆందోళనలకు సిద్ధం

- ఉత్తరప్రదేశ్‌లో ఐక్యమవుతున్న రైతులు, ఉద్యోగులు
- భారీ ర్యాలీలు, నిరసనలకు ప్రణాళిక

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు, ఉద్యోగులు భారీ ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగులు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలని రైతులు ఈ ఆందోళనకు దిగుతున్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణను చేయకుండా కేంద్ర, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడం కూడా ఈ ఆందోళనల ప్రాథమిక లక్ష్యంగా చెబుతున్నారు. ఈ డిమాండ్లను సాధించడానికి, మద్దతును సమీకరించడానికి రాబోయే నెలల్లో ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా, దేశ రాజధానిలోనూ నిరసనలు, ర్యాలీలు నిర్వహించ నున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 60 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అయినా ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగుల సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. దేశంలో నిరుద్యోగం రేటు తీవ్రస్థాయిలో ఉన్నా (7.5 శాతం) ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీకి పూనుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడంపై రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటీకరణ తరువాత విద్యుత్ బిల్లులు అనేక రెట్లు పెరుగుతాయని, తద్వారా రైతులపై ఆర్థిక భారం పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. రైతులు, ఉద్యోగులు ఈ ఆందోళనల్లో ఎంఎస్‌పి, ఒపిఎస్‌లతో పాటు స్థానిక సమస్యలను కూడా ప్రస్తావించనున్నారు. పంట పొలాలను పశువులు నాశనం చేయడం, విద్యుత్ ఉద్యోగులను అకారణంగా సస్పెండ్ చేయడం వంటి సమస్యలు ఇందులో ఉన్నాయి. ఇటీవల సమ్మెలో పాల్గొన్న 121 మంది విద్యుత్ ఉద్యోగులను సస్పెండ్ చేశారని, వారిని ఇంకా విధుల్లోకి చేర్చుకోలేదని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. ఒపిఎస్ అంశం రాజకీయ గేమ్ ఛేంజర్‌గా ఉద్యోగులు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కారణంగానే బిజెపి ఓటమి పాలయిందని, ఒపిఎస్‌ను పునరుద్ధరించకుంటే 2024 సాధారణ ఎన్నికల్లో బిజెపికి అదే గతి పడుతుందని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. ఆగస్టు 9న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ నిరసనను ప్రారంభిస్తారని సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్ల, బైక్ ర్యాలీలతో పాటు నిరసన సభలు నిర్వహిస్తారని చెప్పారు. నవంబర్ 3న దేశ రాజధానిలో ఉద్యోగులు భారీ నిరసన ర్యాలీని నిర్వహించనున్నారు. రైతులు కూడా మూడు విడతలుగా తమ ఆందోళనలు నిర్వహించనున్నట్లు రైతు సంఘాల నాయకులు చెప్పారు. ముందుగా మొదటి దశలో భాగంగా మేలో రైతులు ప్రజాప్రతి నిధులకు తమ డిమాండ్లపై వినతి పత్రాలు అందజే యనున్నారు. ఆగస్టులో జరిగే రెండో విడతలో స్థానికంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇక చివరి, మూడో దశలో నవంబర్ 26 నుంచి 28 తేదీ వరకూ 72 గంటల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సమావేశం కానున్నారు. బిజెపి పాలనలో ఆరోగ్య సంరక్షణ, విద్య చాలా ఖరీదుగా మారాయని రైతులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

మృతదేహాలైనా ఇప్పించండి

- మణిపూర్ కుటుంబం వేడుకోలు

సైకూల్ (మణిపూర్) : హింసాకాండతో మణిపూర్ అట్టుడుకుతోంది. మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించే అవకాశం కూడా లేకుండా పోతోంది. ఇది సైకూల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువతుల దీనగాథ. ఓ యువతి వయసు 21 సంవత్సరాలు కాగా మరొకరిది 24 సంవత్సరాలు. వీరిద్దరూ ఉపాధి కోసం అన్వేషిస్తూ రాజధాని ఇంఫాల్ వెళ్లారు. అక్కడ కార్లను కడిగే ఓ షెడ్డులో పనిలో చేరారు. ఒకరు కార్లను కడుగుతుంటే మరొకరు క్యాష్ కౌంటర్‌లో కూర్చునే వారు. అంతా బాగానే సాగుతోందనుకుంటున్న సమయంలో జాతి ఘర్షణలు వారి ప్రాణాలనే బలిగొన్నాయి. మెయితీలు, కుకీ-జో గిరిజనుల మధ్య మొదలైన విద్వేషాలు ఈ నెల 3న పెద్ద ఎత్తున హింసాకాండకు దారితీశాయి.

ఈ నెల ఐదవ తేదీ సాయంత్రం యువతుల తల్లికి ఓ మహిళ ఫోన్ చేసింది. మణిపురి భాషలో మాట్లాడిన ఆ మహిళ 'నీ కుమార్తె బతకాలని కోరుకుంటున్నావా లేక చావాలని కోరుకుంటున్నావా' అని ప్రశ్నిస్తూ ఫోన్ పెట్టేసింది. ఫోన్ చేసినా ఎవరూ బదులివ్వలేదు. రాత్రి సమయం కావడంతో తల్లిదండ్రులకు ఏం చేయాలో అర్థం కాలేదు. మర్నాడు ఉదయం షెడ్డులో పని చేసే వారు ఫోన్ చేశారు. అల్లరి మూకలు వచ్చి మీ పిల్లలను చంపేశారని చెప్పారు. ఆ గుంపులో మహిళలు కూడా ఉన్నారట. పనివారు చెప్పిన వివరాల ప్రకారం...దాడి సమయంలో షెడ్డు యజమాని లేడు. దుండగులు ఆ మహిళలను ఓ గదిలోకి లాక్కొని వెళ్లి లోపల గడియ పెట్టారు. ఆ గదిలోనే వారిని దారుణంగా హతమార్చారు. లైంగిక దాడి చేశారేమో తెలియదు. అల్లరి గుంపు దాడి చేస్తుండగా ఓ పనివాడు వీడియో తీశాడు. జరిగిన దారుణం గురించి యజమానికి చెబుదామంటే ఫోన్ తీయలేదు. ఆయన ఏ తెగకు చెందిన వాడైనప్పటికీ పనివారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. ఆ దాడిలో ఆయనకు కూడా ప్రమేయముందేమో తెలియదు. దీనిపై పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినా వారి నుండి ఇప్పటి వరకూ సమాధానం లేదు.

ఈ నెల ఐదవ తేదీ నుండి ఆ యువతుల మృతదేహాలు ఆస్పత్రి మార్చురీలోనే పడి ఉన్నాయి. ఇంఫాల్ వెళదామంటే అక్కడ ఉద్రిక్తతలు. కనీసం తమ కుమార్తెల శవాలనైనా అప్పగించాలని వారు కన్నీరుమున్నీరై వేడుకుంటున్నారు. 'పోయిన ప్రాణాలు ఎలాగూ తిరిగి రావు. కనీసం శవాలైనా ఉంటే వాటికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి తృప్తి పడతాం' అని ఆ తల్లిదండ్రులు వాపోతున్నారు. మణిపూర్‌లో ఇలాంటి అభాగ్యులు ఎందరున్నారో?

మెస్ చార్జీల పెంపు ప్రకటనలకే పరిమితం : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ప్రకటనలకే పరిమితమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు 25 శాతం పెంచుతూ మంత్రివర్గ ఉపసంఘం మార్చి మొదటి వారంలో నిర్ణయం తీసుకున్నదని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ నిర్ణయం అమలు కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మెస్ చార్జీలు పెంచేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఏపీ నుంచి బీఆర్ఎస్‌లోకి...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరినట్టు ఆపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి, ఆ రాష్ట్రం అభివద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. రాష్ట్ర రాజధాని ఏదో కూడా చెప్పుకోలేని దుస్థితిలో అక్కడి ప్రజలు ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఏపీ ప్రజలు బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టంచేశారు. ఏపీలో తాము ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగామని చెప్పారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన నేతలకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.

ఢిల్లీలో బాలిక దారుణహత్య

- యూపీలో నిందితుడి పట్టివేత
- శాంతిభద్రతలపై సీఎం సహా పలువురి ఆగ్రహం

న్యూఢిల్లీ : ఢిల్లీలో 16 ఏళ్ల బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు సాహిల్‌ను యుపి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఈ హత్యకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలోని షహబాద్ డైరీ ప్రాంతంలో తన ఇంటి వెలుపల కూర్చున్న బాలికపై సాహిల్ ఆదివారం విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. 21సార్లు పొడిచాడు. కత్తి తలతో ఇరుక్కుపోవడంతో బండరాయితో మోది హత్య చేశాడు. ఆ హత్యను ప్రజలు చూసుకుంటూ వెళ్లారు తప్పితే ఒక్కరూ ఆపలేదు. ఈ ఉదంతం సిసి కెమెరాల్లో రికార్డ్ అయింది. ఈ ఘటన తర్వాత నిందితుడు సాహిల్ అక్కడి నుంచి పరారయ్యాడు. 20ఏళ్ల సాహిల్ ఫ్రిజ్ - ఏసీ రిపేర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. హత్య అనంతరం పారిపోయిన వ్యక్తిని పట్టుకునేందుకు ఢిల్లీ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చివరకు ఉత్తర్ ప్రదేశ్ లోని బులంద్ షహర్‌లో పట్టుకున్నారు.

శాంతి భద్రతల బాధ్యత గవర్నర్‌దే : కేజ్రీవాల్

బాలిక దారుణ హత్యపై ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విచారం వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతి భద్రతల బాధ్యత పూర్తిగా గవర్నర్‌దేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'ఢిల్లీలో బాలిక దారుణంగా హత్య చేయబడింది. ఇది చాలా విచారకరం. బాలికను హత్య చేసిన నేరస్తులు ఏమాత్రం భయం లేకుండా ఉన్నారు. పోలీసులంటే వారికి భయం లేదు. లెఫ్టినెంట్ గవర్నర్ సార్.. ఢిల్లీలోని శాంతి భద్రతలు మీ బాధ్యత. దీనిపై దయచేసి ఏదో ఒకటి చేయండి' అని లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాకు విజ్ఞప్తి చేశారు. బాలిక హత్యపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్ నేత అతిషి లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనాపై మండిపడ్డారు. 'ఢిల్లీలోని ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాజ్యాంగం లెఫ్టినెంట్ గవర్నర్‌కి ఇచ్చింది. కానీ గవర్నర్ సక్సేనా మాత్రం.. అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న పనిని ఆపడానికే తన సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఢిల్లీలోని మహిళలు సురక్షితంగా లేరు. కాబట్టి వారి భద్రతపై దృష్టి పెట్టాలని నేను గవర్నర్‌ని రెండుచేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను' అని ఆమె ట్వీట్ చేశారు. ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతిమలివాల్ ఢిల్లీ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నడిరోడ్డుపై దారుణంగా హత్యకు గురైన 16 ఏళ్ల బాలిక చేసిన తప్పేంటి? ఢిల్లీలో పోలీసులకు, చట్టానికి ఎవరూ భయపడరు. ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకపోతే క్రూరత్వానికి హద్దులుండవు' అని ఆమె అన్నారు.

ప్లాస్టిక్ కాలుష్య అంతానికి ఒప్పందం

- చర్చలు ప్రారంభించిన ఐరాస కమిటీ

పారిస్ : ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం అంతచేయడం కోసం ఒక ఒప్పందం కుదర్చడానికి ఐక్యరాజ్య సమతి కృషి చేస్తుంది. ఇందులో భాగంగా ఏర్పడిన ఐరాసకు చెందిన ఇంటర్‌గవర్నమెంటల్ నెగోషియేటింగ్ కమిటీ సోమవారం పారిస్‌లో చర్చలు ప్రారంభించింది. అయితే ఈ ఒప్పందం ఏ విధంగా ఉండాలనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ సముద్ర పర్యావరణంతో సహా ప్లాస్టిక్ కాలుష్యంపై మొదటి అంతర్జాతీయ, చట్టబద్ధమైన ఒప్పందాన్ని అభివృద్ధి చేయడంలో ఈ కమిటీ బాధ్యత వహిస్తుంది. 2024 నాటికి ఈ కమిటీ ఐదు సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. ఇది కమిటీకి రెండో సమావేశం.

ఆరు నెలల క్రితం ఉరుగ్వేలో మొదటి సమావేశం జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 430 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో మూడింట రెండువంతులు వ్యర్థాలుగా మారుతున్నాయి. సముద్రాలు, మానవ ఆహార గొలుసులోకి ఇవి ప్రవేశిస్తున్నాయి. 2060 నాటికి ప్లాస్టిక్ వ్యర్థాలు మూడు రెట్లు పెరుగుతాయని ఒక అంచనా. 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని ఐరాస కమిటీ కట్టుబడి ఉంది.